ప్రజాశక్తి

Vol. 1, no. 273

(Sept. 8, 1946)

బెజవాడ, 1946

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 273

(Sept. 8, 1946)

Bejavāḍa, 1946

Record no. 683

Regd. No 4486

20 పేజీలు 3 అణాలు

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 1] బెజవాడ 8—9—46 ఆదివారం [సంచిక 273

ఈ సంచికలో

సెప్టెంబరు 10 రాష్ట్రమంతా సర్వవ్యాప్తసమ్మె చేయండి

బొంబాయి కొట్లాటల్లో కార్మికులు ఐక్యతాపాఠం నేర్పుతున్నారు

బొంబాయి, సెప్టెంబరు 6

కార్మిక పేటల్లో కూడా కల్లోలం పుట్టించడానికి అన్ని వైపులనుంచీ తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. కాని, లాభం లేకపోయింది. బొంబాయి కమ్యూనిస్టు కమిటీ, గిర్నీ కాంగార్ యూనియను సెప్టెంబరు 2 వ తేదీనే "కల్లోలాలు కార్మిక పేటలకు చేర నివ్వవద్దు" అని విజ్ఞప్తి చేశాయి. శాంతిరక్షణ దళాలను నిర్మించి పేటల ప్రచారం చేయవలసిందని కోరాయి. కార్మికులు అన్యోన్య ప్రేమతో, ధైర్య సాహసాలతో ఆదర్శంగా నిలబడ్డారు.

భాగేశ్వరి బిల్డింగులలో కొందరు కార్మికులు పఠాణుల ప్రాణాలు కాపాడారు. వారి ప్రాంతంలో, కారటి దళంలోని హిందువులు ఇతరవీధులనుంచి పారిపోయి వచ్చిన ముస్లిములకు రక్షణ యిచ్చారు. అంబావాడీలో హిందువులూ, ముస్లిములూ కలిసి నివసిస్తున్నారు. ఒక హిందూ గూండాల గుంపు వచ్చి అక్కడి హిందువుల్ని సురక్షితమైన మరోచోటికి చేరుస్తామన్నారు. ఇలా అనడంలో వారి వుద్దేశ్యం హిందువుల్ని దాటించి ముసల్మానుల పని పట్టాలనే. హిందువులు రామన్నారు. ఈ వార్త వింటూనే కామ్రేడ్స్ కర్నే, పాట్కర్‌లు అక్కడకు పరుగెత్తారు. పోలీసులు వారిని వెంబడించారు. అదిచూచి ముస్లిం కూలీలు దాలా నొచ్చుకొని "మీయిష్టం వచ్చినప్పుడు రండి. వెళ్ళండి. మీకు పోలీసుకావలా అక్కర్లేదు. ఎర్రజెండావాళ్ళకి మేమెప్పుడూ స్వాగతంఇస్తాం" అన్నారు. ఒక 60 ఏళ్ళ హిందూ కార్మికుని పిలిచి, అక్కడినుంచి వెళ్ళిపోవాలను కుంటున్నావా అని వారు అడిగారు. అతడు నిరాకరించాడు. "నేను వాళ్ళపక్క 40 ఏళ్ళనుంచి వుంటున్నా." అంటూ ఒక ముసలి ముసల్మానును దగ్గరకు పిలిచాడు. "ఇతనే నన్ను చంపేది. నాకు ఇంకోచోటికి వెళ్ళవలసిన పనేలేదు. నాకు భయంలేదు." అన్నాడు.

మధ్యతరగతి ప్రజలు వుండే భేండీ బజారులో, ఒక రైల్వే కార్మికుడు తన కుటుంబానికి ప్రమాదం కలుగుతుందనే నాలెక్కచేయకుండా, కొందరు హిందూ కార్మికులకు రక్షణఇచ్చాడు. మదన్‌పూరాలో ముస్లిం గూండాలు కొందరు ఒక హిందువును దోచుకోబోతూంటే, నవజవాన్ సభకు చెందిన ముసల్మాన్ కామ్రేడ్స్ వారిని తరిమి హిందువును రక్షించారు.

నేడు సామ్రాజ్యవాదుల ఏజంట్లకూ, శ్రామికులశక్తికీ మధ్య బలాబలాల పరీక్ష జరుగుతూంది.

కార్మికులు ఈ పరీక్షకు నిలబడ్డారు. పట్టణంలోని 68 బట్టలమిల్లులలో 60 మిల్లులు ఇతర కార్ఖానాలు పనిచేస్తున్నాయి.

కార్మికులపేటలు ప్రశాంతంగావున్నాయి.

(మా విలేఖరి)

ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని ఖండించండి

ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ పిలుపు

బెజవాడ, సెప్టెంబరు 7

మద్రాసు కాంగ్రెసు ప్రభుత్వం పదవులు పుచ్చుకొని మూడు నెలలకు పైగా అయింది. యుద్ధకాలంలోను, యుద్ధానంతరమూ కూటికీ, గుడ్డకూ కరువయి యమయాతనలనుభవించుచున్న ప్రజానీకమంతా తమ కష్టాలు గట్టెక్కుతాయని ఎదురుచూస్తున్నారు. న్యాయసమ్మతమైన తమ కనీస హక్కులకు ఆందోళన సాగిస్తూ పోరాటాలు చేస్తున్నారు. కాని ప్రజా హక్కులను కాపాడవలసిన కాంగ్రెసు మంత్రివర్గం ఆరోజుకారోజు తీవ్ర నిరంకుశ నిర్బంధ విధానము నమలువర్చుతూ 144 సెక్షన్లతోను, అరెస్టులతోను, తుపాకి కాల్పులతోను క్రూర పోలీసు పరిపాలన సాగిస్తోంది. ఈనిర్బంధవిధానం వెనుకనున్న బ్రిటిష్ వారి కుట్రను ప్రజానీకమంతా గుర్తించాలి. ప్రధాన రాజకీయ సంస్థలైన కాంగ్రెసు—లీగులు అవలంబిస్తున్న రాజీపందాను, వాని మధ్యగల వైరుధ్యాన్ని ఉపయోగిస్తూ భారతదేశంలో నేడు పొంగిపొరలి వస్తున్న ప్రజావుద్యమ వెల్లువను బ్రిటిష్ ప్రభుత్వం అణిచేయాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్రాలలో ఏర్పడిన మంత్రివర్గాలను, కేంద్రంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వాన్ని వుపయోగించి తన సామ్రాజ్యవాద ఆశయాలను సాగించుకోవాలని కుట్ర చేస్తోంది.

మద్రాసు మంత్రివర్గం ఈ బ్రిటిష్ ప్రభుత్వ ప్లానుకు లోబడి దిగజారే ప్రమాద పరిస్థితి ఏర్పడింది. గత 3 మాసాల దృశ్యం ఈవిషయాన్ని దృఢపరుస్తోంది.

తుపాకికాల్పులు, లాఠీఛార్జీలు, అరెస్టులు, కేసులు, నిషేధాజ్ఞలు, 144 సెక్షన్లు, రక్తపాతం లేనిరోజు లేదు.

ఆంధ్రపట్టణాలలో వందలతరబడి అరెస్టులు జరుగుతున్నాయి. మ్యునిసిపల్ కార్మికుల సమ్మెలో పోలీసులు లాఠీరాజ్యం సాగిస్తున్నారు. ప్రభుత్వ సూచనలను ఒంగీకరించినా, సమ్మె విరమింపుకు తయారుగాక పేచీలుపెట్టి ప్రజారోగ్యాన్నికూడా లక్ష్యం చేయకుండా సమ్మెను పొడిగిస్తూ ప్రభుత్వం నిర్బంధాన్ని సాగిస్తోంది.

కార్మిక నాయకులు కట్టయ్య, నరసింహారావు మొదలైనవారి మీద శిక్షలు రద్దు చేయలేదు. ఎక్కడచూసినా 144 సెక్షన్.

తమిళనాడులో మద్రాసు, మధుర, ట్రిచీ, విక్రమసింగపురం మొదలైన అన్ని ప్రధాన కేంద్రాల్లో పోలీసులు పేద ప్రజలమీద విచ్చలవిడిగా తుపాకులు కాలుస్తున్నారు.

5—9—46 న గోల్డెన్‌రాక్‌లో జరిగిన ఘోరం సహింపరానిది. రైల్వేకార్మికులమీద తుపాకి కాల్పుల ఫలితంగా 4 గురి మరణం. కామ్రేడ్ ఆనందనంబియార్ తలమీద గూడ దెబ్బ. 400 కార్మికుల అరెస్టు. సామాన్య కార్మికహక్కులమీదదాడిచేసి సమ్మెనుకొనసాగించిన యజమానులకు మిలిటరీ పోలీసు మద్దతు ఇచ్చి కాంగ్రెసు మంత్రివర్గం రక్తపాతం చేస్తోంది.

మలబారుకో గూడ ఇదేకథ. 'దేశాభిమాని' కార్యాలయంమీద మఃబారు పోలీసులదాడి. నంబూద్రిపాద్, గోపాలన్ అరెస్టులు. కేసు...

ఈవిధంగా మంత్రివర్గం దిగజారుటవల్ల రాష్ట్ర ప్రజాజీవితానికే ఘోరప్రమాద పరిస్థితి ఏర్పడుతోంది. బ్రిటిష్ ప్రభుత్వానికి కీలుబొమ్మ గాకుండా మంత్రివర్గాన్ని నిరోధించడానికి ప్రజానీకమంతా 10 వ తేదీ ముందుకురావాలి.

ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని అరికట్టడానికి ఈనెల 10 వ తేదీన ప్రజానీకమంతా నిరసన దినంగా జరపాలి. కార్మికవర్గమంతా సర్వవ్యాప్త సమ్మె సాగించాలి. బ్రహ్మాండమైన సభలద్వారా ప్రదర్శనల ద్వారా మంత్రివర్గంమీద తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాలి. తీర్మానాలు, టెలిగ్రాములు ప్రభుత్వానికి పంపాలి.

ఈ ఘోరనిర్బంధ విధానంపట్ల తమ అసమ్మతిని తెలియజేయుటకై సోదర కాంగ్రెసువాదులను లీగర్లనుగూడ పార్టీ సభ్యులంతా కలుసుకుని సభలలో పాల్గొనవలెనని, స్టేట్మెంట్లు ఇచ్చేటట్లు కృషిచేయాలి.

10 వ తేదీ కార్యక్రమానికి ప్రతి పార్టీ సభ్యుడు, ప్రతిపార్టీసెంటరు, ప్రతిగ్రామం, ప్రతి పేట, వెంటనే కదిలి పని చేయుటకు పూనుకోవాలి.

—రాష్ట్రకమిటీ, భారతకమ్యూనిస్టుపార్టీ

ఎస్. ఐ. రైల్వేలో 1054 అరెస్టులు

నంబియార్‌కు తుపాకి దెబ్బ

(మా ప్రత్యేక విలేఖరి)

మద్రాసు, సెప్టెంబరు 7

సెప్టెంబరు 5 వ తేదీన గోల్డెన్‌రాక్ (తిరుచునాపల్లి)లో పోలీసు కాల్పుల ఫలితంగా 4 మంది చనిపోయారు. 8 మంది గాయపడ్డారు. కామ్రేడ్ ఆనందనంబియార్ (ఎస్. ఐ. రైల్వే కార్మికసంఘ కార్యదర్శి) తలపై తుపాకిదెబ్బతగిలి హాస్పిటల్‌కు చేర్చబడ్డారు.

ఈ హత్యలు చాలవన్నట్లు డి. ఎస్. పి. 400 మంది గోల్డెన్‌రాక్ కార్మికులను, కామ్రేడ్ ఆనందనంబియార్ (యూనియన్ కార్యదర్శి, సమ్మెకమిటీ సహాయకార్యదర్శి), ఖాను, రహీమ్ (సెంట్రల్ ఎక్జిక్యూటివ్ సభ్యులు), ఇస్మాయిల్‌ఖాన్ (బ్రాంచి యూనియన్ అధ్యక్షులు) గార్లను అరెస్టు చేశారు. వీరుగాక రాష్ట్రరైతుసంఘ కార్యదర్శి కామ్రేడ్స్ బి. శ్రీనివాసరావు, రత్నంలను కూడా అరెస్టు చేశారు. కామ్రేడ్ పి. రామమూర్తి మధురలో అరెస్టయ్యారు. మొత్తం ఇంతవరకు ఎస్. ఐ. రైల్వే సమ్మె సందర్భములో 1054 మంది నిర్బంధించబడ్డారు. వారిలో 31 మంది మంది స్త్రీలు, 7 గురు బిడ్డలు. గోల్డెన్‌రాక్‌లో అనేకచోట్ల కర్ఫ్యూ, 144 సెక్షన్ ప్రవేశపెట్టారు. సభలు జరప కూడదంటూ నిషేధించారు. సమ్మెనిధి వసూళ్లు జరగనివ్వడంలేదు. యూనియన్ నాయకులను మోటార్లు ఉపయోగించనివ్వడంలేదు.

నేడు మద్రాసులో 15 కార్మిక సంఘాలు రాష్ట్ర ట్రేడ్‌యూనియను కాంగ్రెసు కార్యాలయంలో సమావేశమై తాత్కాలిక ప్రభుత్వం ఈ విషయంలో కలుగచేసుకుని కార్మికుల కోర్కెలను రైల్వే మేనేజరుచే అంగీకరింపచేయవలసిందని కోరుతూ తీర్మానించారు.

కామ్రేడ్స్ పిల్లలమర్రి, వెంకట్రామన్‌గారల సంయుక్త ప్రకటన

"హారిసన్, రైనాల్డ్సులు కాంగ్రెస్ మంత్రుల హయాములోనే గోల్డెన్‌రాక్‌ను జలియన్ వాలాబాగ్గా మార్చారు. ప్రకాశంగారు ఎసెంబ్లీలో పోలీసులను పొగడడం హారిసన్, రైనాల్డ్సులకు ధైర్యాన్నిచ్చింది. ఆ ధైర్యంతోనే కార్మికులమీద, వారి నాయకులమీద విరుచుకుపడ్డారు. కాని, కార్మికవర్గం బెదరదు. తన హక్కుల కోసం దృఢంగా నిలబడుతుంది. వారి ధీరత్వము ప్రజాబలమూ పోలీసుల దురంతాలను అణగలవు. రాష్ట్ర ప్రజలను కాపాడగలవు. ఈ పశు ప్రవర్తనను నిరసిస్తూ ప్రజాసేవకులంతా ముందుకు రావాలని కోరుతున్నాము.

కామ్రేడ్ వెంకట్రామన్ తమిళనాడు పార్టీసభ్యులకు, కిసాన్ సంఘాలకు సెప్టెంబరు 11 తేదీన "నిర్బంధ నిరసన దినం" జరపవలసిందని కోరుతూ ప్రకటనచేశారు. సభలు సమావేశాలు జరిపి అరెస్టు అయినవారి విడుదలకు, పౌరసత్వ హక్కులకొరకు, గోల్డెన్‌రాక్‌లో సెప్టెంబరు 5 న జరిగిన కాల్పులపై బహిరంగ విచారణ కొరకు, రైల్వేకార్మికుల న్యాయమైన కోరికలను అంగీకరించేందుకు ఆందోళన జరపమని కోరారు. ఎస్. ఐ. ఆర్. సమ్మెనిధికై విజ్ఞప్తిచేశారు.

ఎమ్. ఎస్. ఎమ్ రైల్వే కార్మికుల నాన్‌గెజెటెడ్ ఆఫీసర్ల సంఘశాఖలు సమ్మెనిధికి రు 185 లు పంపారు.

కామ్రేడ్ పి. వెంకటేశ్వర్లు అసెంబ్లీలో అడ్జర్న్‌మెంటు తీర్మానం ప్రతిపాదించారు. ముస్లిములీగు సభ్యులు దానిని బలపరచారు. నేడు సాయంత్రం 6 గంటలకు దానిపై చర్చ జరుగుతుంది.

కలకత్తా కొట్లాటలపై కాంగ్రెసు తీర్మానం

నిరాధారమని లీగ్ వర్కింగ్ కమిటీ

కలకత్తా, సెప్టెంబరు : 6

కాంగ్రెసు వర్కింగుకమిటీ కలకత్తా కల్లోలాలపై చేసిన తీర్మానాన్ని ఖండిస్తూ బెంగాల్‌రాష్ట్ర లీగ్ వర్కింగ్‌కమిటీ ఈవేళ ఒక తీర్మానం చేసింది. సరిగ్గా కాంగ్రెసువలెనే, లీగ్ ప్రజావుద్యమాలు తమ మంత్రివర్గాన్ని కూలదొయ్యడానికి వచ్చినట్లు భయాన్ని ప్రకటించింది. ప్రభుత్వ నిర్బంధ విధానానికి వ్యతిరేకముగా, చిరకాలంనుంచి జైళ్ళలో మగ్గుతూన్న దేశభక్తుల విడుదలకై, పోస్టల్ సమ్మెను బలపరుస్తు అన్నిజాతుల,మతాల కార్మికులు, ప్రజలు కలకత్తా వీధులలో జరిపిన ప్రదర్శనాలన్నీ లీగుమంత్రులను అల్లరిపాలు చేసేటందుకే జరిగినట్లు తీర్మానించారు.

కాంగ్రెసు వర్కింగ్‌కమిటీ తీర్మానం ఆధారరహితం అంటూ, ఇలా తీర్మానించారు :

"మునల్మానులు అల్లర్లు చేయదలచుకొనివుంటే, తమకుటుంబాలను, బిడ్డలను ఊళ్ళవద్ద హిందువుల దయాదాక్షిణ్యాల కువిడిచిపెట్టి మైదానంలోజరిగే మీటింగుకి హాజరయివుందరు. శుక్రవారం రోజున తెల్లవారిందిమొదలుకొని ముస్లిములమీదదాడి ప్రారంభమైనట్లు కాంగ్రెసు పత్రికలు చదివితేనే తెలుస్తుంది. ఆరోజున హాస్పిటళ్ళకు తీసుకురాబడ్డ ప్రజలలో మూడు వంతులు మునల్మానులేనని, లెక్కలుచూస్తే తెలుస్తుంది. తర్వాతనే ముస్లిములు ప్రతీకారానికి పూనుకున్నారు. కల్లోలాలకు ముందునుంచీ అజాద్ హింద్ ఫౌజ్ నాయకులకు సన్మానం ఇచ్చేపేరుతో వలంటీర్లకు శిక్షణచెప్పి హిందువులు తయారుగా వున్నారు. మొదటినుంచీ హిందూ నాయకులు ఉపన్యాసాలద్వారాను, పత్రికలద్వారాను ప్రజల్లో ఉద్రేకాలు రెచ్చగొట్టారు. త్వరలోనే లీగ్ మంత్రివర్గం ఆఘటనలపై విచారణ చేయబోతూంది. అప్పుడే తేలుతుంది కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానంలోని నిజం".

తీర్మానం చివర లీగ్ వర్కింగ్ కమిటీ పట్టణాలలోనూ, పల్లెలలోనూ శాంతిపరిస్థితులు నెలకొనేటందుకు సర్వవిధాలా ప్రయత్నించమని మునల్మానులకు విజ్ఞప్తిచేసింది.

తరఫున ఎన్నిత్యాగాలకయినా సిద్ధపడి పనిచేయమని ముస్లిం లాయర్లను కోరుతూంది. ఒకతీర్మానం.

ముస్లిం షాపులలోనే ముస్లింలు సరుకులు కొనుక్కోవాలని రెండో తీర్మానం.

లీగ్ ప్రచారాన్ని రాష్ట్రం అంతటా తీవ్రంగా సాగించేటందుకై ముల్లాల పేర్లు, మతబోధకుల పేర్లు జాబితాలుగా తయారు చేయాలని మూడో తీర్మానం.

లీగ్ 'పోరాట' కార్యక్రమం

పెషావరు, సెప్టెంబరు 6

సరిహద్దురాష్ట్రంలో పోరాట కార్యక్రమానికై రాష్ట్ర లీగ్ మూడు తీర్మానాలు చేసింది. కోర్టులలో ముస్లిముల

నిమ్నజాతుల సత్యాగ్రహం

జుల్మానా చెల్లించకపోతే ఆస్తులు లాక్కుంటారట

నాగపూర్, సెప్టెంబరు 6

నిమ్నజాతుల సత్యాగ్రహం 3 రోజులనుంచి వరుసగా సాగుతోంది. నిన్న 258 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో ఒక్కొక్కరికి రు 10 మొదలు రు 200 వరకు జుల్మానా విధించారు. మొన్న అరెస్టుచేయబడిన 203 సత్యాగ్రహులకు రు 200 చొ॥ జుల్మానా విధించారు. జుల్మానా చెల్లించకపోతే, వారిఆస్తులు స్వాధీనం చేసుకోవలసిందని పోలీసులకు ఉత్తరువు చేశారు.

ఈవేళ 247 సత్యాగ్రహుల్ని అరెస్టు చేశారు. కొంతసేపు వుంచి తరువాత విడుదల చేసారు.

కార్మికుల సమ్మెకు యజమానులే కారణం

చీరాలలో 3000 కార్మికుల సమ్మె

(మా విలేఖరి)

చీరాల, సెప్టెంబరు 6

నిన్నటినుంచి చీరాలలో పొగాకు ఫ్యాక్టరీ కార్మికులు మూడువేల మంది సమ్మె చేస్తున్నారు.

కొద్దిరోజులక్రితమే లేబరు కమీషనరు కలుగచేసుకుని, కార్మికుల జీతాలు పెంచడం, సెలవులు యివ్వడం, ఉద్యోగాలనుంచి సస్పెండు చేయడం, బర్తరఫు చేయడం మొదలగు విషయాలమీద రాజీ కుదిర్చారు. నేడు మిల్లు యజమానులు ఆ షరతులన్నీ అతిక్రమించి, యూనియన్‌ను నాశనం చేసే వుద్దేశ్యంతో ఏ కారణాలూ చెప్పకుండా ఇద్దరు యూనియను నాయకుల్ని పనినుంచి తొలగించారు. వారిని తిరిగి పనులలోకి తీసుకోనకపోతే 24 గంటలలో సమ్మె ప్రారంభ మవుతుందని యూనియన్ నోటీసు ఇచ్చింది. యజమానుల బిరుసుతనంవల్ల సమ్మె ప్రారంభం కాకతప్పిందికాదు.

సమ్మె శాంతంగా జరుగుతూంది. సమ్మెదార్లను బెదిరించడానికి రిజర్వు తెచ్చారు.

యజమానులతోనే రాజీలు చేసుకోండి!

అసెంబ్లీలో కార్మికమంత్రి హితోపదేశం

మద్రాసు, సెప్టెంబరు 6

నిన్న అసెంబ్లీలో పరిశ్రమల శాఖమంత్రి, వి. వి. గిరిగారు, రు. 1,16,59,400 ల గ్రాంటు కోరుతూ తీర్మానంప్రవేశపెట్టారు.

ముస్లింలీగు సభ్యులు ప్రభుత్వ పాలసీని విమర్శించడానికి కోతతీర్మానంప్రవేశపెట్టారు. మద్రాసురాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి యితరరాష్ట్రాల పెట్టుబడిదార్లకు (బిర్లావంటి వారికి) ప్రోత్సాహం ఇవ్వడం మంచిదికాదన్నారు. కార్మికుల హక్కులరక్షణకై వెంటనే ఒక బిల్లు ప్రవేశపెట్టడం అవసరమన్నారు. ఫ్యాక్టరీలలో బాలబాలికలచేత పని చేయించుకొనే పద్ధతిని నిషేధించాలన్నారు. మగ్గాలకు నూలు సప్లయి ఏమాత్రమూ చాలడం లేదన్నారు.

కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు మద్రాసురాష్ట్రంలో ఎక్కడెక్కడ భారీ పరిశ్రమలకు అవకాశం ఉందో పరిశోధనలుచేసి, వాటికి ప్రోత్సాహమివ్వాలన్నారు. ఖాదీస్కీముకు ప్రత్యేకిస్తున్న రు 2 కోట్లను పరిశ్రమలకు వినియోగించమని సూచించారు. రాయలసీమలో బట్టల మిల్లులు స్థాపించడం అవసరమన్నారు. కీలక పరిశ్రమలన్నింటినీ జాతీయపరం చేయాలన్నారు. కార్మికసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవలంబించే విధానం చాలా అసంతృప్తికరంగా ఉందని విమర్శించారు.

గిరిగారు జవాబుచెబుతూ ఇలాఅన్నారు:

"మద్రాసు రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ఫైనాన్సు కార్పొరేషన్ అనే సంస్థను ఏర్పాటుచేసింది. గృహ పరిశ్రమలలో తరిఫీదు యివ్వడానికి 20 స్కూళ్ళు తెరిచాము.

"బిర్లాకంపెనీ మన రాష్ట్రంలో ఫ్యాక్టరీని స్థాపించుటకు లైసెన్సు యిచ్చింది, మద్రాసు ప్రభుత్వంకాదు, ఇండియా ప్రభుత్వం. బళ్లారికి 30 మైళ్ళదూరంలో ఉన్న సాందూర్ సంస్థానంలో వనస్పతి ఫ్యాక్టరీని నిర్మించడంకోసం బిర్లాకంపెనీ నిశ్చయించుకొంది. ఒక సంస్థానంలో ఫ్యాక్టరీని తెరవడం కంటే మద్రాసురాష్ట్రంలో తెరిస్తేనే మన ప్రభుత్వానికి ఆర్థికంగా లాభమనుకొని, మన రాష్ట్రానికి ఆహ్వానించాం. ఇందుమూలంగా రు 1 లక్ష సేల్సు టాక్సు లభిస్తుంది. కార్మికులు మన రాష్ట్రంవారే ఉంటారు.

షేర్లు 100కి 49 మనరాష్ట్రానికేఉంటాయి.

"ఇక కార్మిక సమస్యల విషయంలో త్వరలో ప్రభుత్వం కార్మిక తగాదాలబిల్లు ఒకటి ప్రవేశపెడుతుంది. యజమానులకూ - కార్మికులకూ వచ్చే ప్రతి తగాదాను అన్యోన్యంగా పరిష్కరించుకొనేటట్లు చూడ్డం ప్రభుత్వ పాలసీ. అది విఫలమైతే, లేబర్ కమీషనరు రాజీ చేయడానికి ప్రయత్నిస్తాడు. అదీ విఫలమైతే, నేను స్వయంగా జోక్యం కలిగించుకుంటాను. అదీ విఫలమైతే, కార్మిక తగాదాబిల్లును పురస్కరించుకొని విచారణ కమిటీలను, రాజీ కమిటీలను వేస్తాం. అవీ విఫలమైతే, అర్బిట్రేటరును నియమిస్తాం."

తరువాత, సమ్మెలను గురించి ప్రస్తావిస్తూ, గిరిగారు యిలా చెప్పారు :

"కార్మికులు యజమానులతో ప్రత్యక్షంగా సంప్రతింపులు జరుపుకొని తగాదాలు పరిష్కరించుకోవాలి. ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమ్మెలు చేయవలసిన అవసరం ఏమైనా నాకు బోధపడ్డంలేదు. ప్రభుత్వం పేదల కొరకే ఏర్పడింది. లేకపోతే ఈ ప్రభుత్వము ఒక్కనిమిషం కూడా అధికారములో ఉండదు."

ఇతర విషయాలకు గ్రాంటు

తరవాత, ఇతర విషయాలకు గ్రాంటుగా రు 94,61,700 కోరుతూ ప్రధాని ప్రతిపాదించిన తీర్మానంపై చర్చ జరిగింది.

కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు యిలా మాట్లాడారు :

"బీద విద్యార్థుల స్కాలర్‌షిప్పులకుగాను ప్రత్యేకించినసొమ్ము ఏమీ చాలదు. ఏ కులానికి, మతానికి చెందినా, బీద విద్యార్థులకు విరివిగా స్కాలర్‌షిప్పులివ్వాలి. బంజరు భూములను ప్రధానంగా హరిజనులకు యివ్వాలి. పాలేర్ల స్థితిని బాగుచేసేటందుకు ప్రభుత్వం ఒక చట్టం తయారు చెయ్యాలి." హరిజనుల సహాయార్థం ప్రత్యేకింపబడిన 1 కోటి రూపాయలు హరిజనులకే వినియోగించాలి గాని, ప్రభుత్వ లెక్కలలో చూపిన 112 షెడ్యూల్డ్ కులాలవారికి యివ్వరాదని మునుస్వామి పిళ్లై మొదలైనవారు సూచించారు.

చర్చకు ప్రధాని జవాబుచెబుతూ, హరిజనులకే 1కోటిరూపాయిలనువినియోగిస్తామని వాగ్దానంచేశారు. ఇతర షెడ్యూల్డు కులాలకు 30½ లక్షలు ప్రత్యేకించామన్నారు. బీద విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్పులు యిచ్చే విషయంలో ప్రభుత్వం ఉదారంగానే ఉంటుందన్నారు.

మనకలహాల రక్తపాతంలో తమపంట పండించుకోడానికి బెంగాల్ యూరపియన్ల కుట్రలు

మా విలేఖరి
నిఖిల్ చక్రవర్తి

యుద్ధంముగిసిన నాటినుంచీబెంగాల్లో తెల్లదొరలు తమకు ప్రమాదం సంభవిస్తోందని గ్రహించారు. బెంగాల్‌లో ఇనుము, ఉక్కు, బొగ్గు, ఎలెక్ట్రిసిటీ, జ్యూట్, టీ, మొదలైన పరిశ్రమల్లో వారు 75 కోట్ల రూపాయలు పెట్టుబడిపెట్టారు. యుద్ధానంతరం వస్తున్న సమ్మెలవెల్లువ వారికి దడ పుట్టించింది. లక్షలకొలది కార్మికులు సమ్మెలకు పూనుకోవడంచూచి వారు గాభరాపడసాగారు.

దీనికితోడు నవంబరులో అజాద్‌ఫౌజు నాయకుడు రషీదాలీ విడుదలకోసం జరిగిన ప్రదర్శనం, నావికుల తిరుగుబాటు, పోస్టల్ కార్మికులకు సానుభూతిగా జూలై 29 న జరిగిన 40 వేలమంది జనరల్ స్ట్రయికు, మొదలైన బ్రిటిషు వ్యతిరేక ప్రజాందోళనలు వారికి భయోత్పాతాన్ని కలిగించాయి.

వారు ఎంత భయపడిపోయారో తెలుసుకోడానికి ఈ క్రింది ఉదాహరణ చాలు. అవసరమైతే బెంగాల్‌లోని బ్రిటిష్‌వారంతా ఒక్కసారి ఫోర్టువిలియం కోటలోకి పోయి దాక్కోడానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేయబడ్డాయి. ఆత్మరక్షణకు అంతా సిద్ధంకావాలని హెచ్చరికలు పంపబడ్డాయి. రక్షణకు కొత్తగా 73 వ నెంబరు, బ్రిటిష్ సైనిక బ్రిగేడ్ రప్పించబడింది.

ఈ పరిస్థితుల్లో, ముస్లింలీగ్ "ప్రత్యక్ష పోరాట" నినాదం యిచ్చింది. మరోప్రక్క కేంద్రంలో తాత్కాలిక ప్రభుత్వ నిర్మాణానికి వేవెల్ కాంగ్రెసును ఆహ్వానించాడు. దేశం రెండుగా చీలిపోయింది. ఇది బెంగాల్‌లోని తెల్లదొరలకు చక్కని అవకాశంగా కనబడింది. ఈ అంతర్యుద్ధ వాతావరణాన్ని బాగా ఉపయోగించుకొని, వెల్లువగా వస్తున్న బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాన్ని పెడమార్గాలపట్టించవచ్చునని ఆలోచించారు.

గవర్నరు అనుమతితో, అగస్టు 16 బెంగాల్‌లో సెలవుదినంగా ప్రకటించారు. దీనినిచూచి బెంగాల్ లీగ్ మంత్రివర్గం, తమకు సంపూర్ణస్వాతంత్ర్యం యివ్వబడిందని సంతసించింది. ఈ సందర్భంలో ఎసెంబ్లీలోని యూరోపియన్‌సభ్యులు ఒక నాటకం ఆడారు. అగస్టు 16న సెలవు అక్కరలేదన్నట్లు నటించి వ్యతిరేకపక్షంతో కలసి విమర్శించారు.

ఆ విధంగా బెంగాల్ గవర్నరు, యూరపియన్లు కలిసి కుట్రలుపన్ని, అగస్టు 16న అంతర్యుద్ధజ్వాలలు ప్రజ్వలింపజేశారు.

మిలిటరీ కమాండర్ కుట్రలు

ఈస్టరన్ మిలిటరీ కమాండింగు అధికారి మేజర్ జనరల్ బుచర్ 9 రోజులు ముందునుంచే కుట్రలుపన్నాడు. అగస్టు 7 వ తేదీ తన ఆఫీసులో ఒక రహస్య సమావేశం జరిపి, తన క్రింది ఉద్యోగులందరికీ, అగస్టు 16 వ తేదీ చాల ప్రమాదకరమైనరోజు అని హెచ్చరించాడు. సరిగా అల్లాగే 16 వ తేదీ కలకత్తా అంతా గప్పుమని మండింది.

బుచర్ కుట్ర అంతా యిందులోనే కనబడుతుంది. 9 రోజుల క్రితమే ప్రమాదం వుందని గ్రహించినవాడు, తన చేతిలోవున్న మిలిటరీని వుపయోగించి ముందే ఎందుకు రక్షణ యివ్వలేదు? అంతేకాదు, కొట్లాట ప్రారంభమైన 40 గంటల వరకూ కలకత్తా వీధులలో ఒక్క మిలిటరీదళంగాని, పోలీసు దళంగాని అడుగుపెట్టలేదు. కొట్లాటలను ఆపడానికి ఏమీ కృషిచేయకుండా, గవర్నర్ బర్రోస్, మిలిటరీ కమాండర్ బుచర్, ఇరువురూ కూడా రోజున్నరకాలం చూస్తూ కూర్చున్నారు.

మిలిటరీ 'రక్షకులు' బైటికి వచ్చారు !

అప్పటికి జరిగిన హింసాకాండను చూచి లీగ్‌నాయకులకు కాళ్ళు వణకడం మొదలుపెట్టాయి. గవర్నరు దగ్గరకు పరుగెత్తారు. మిలిటరీని పంపి సహాయం చేయమని వేడుకున్నారు. గవర్నరుగారు అంగీకరించారు. ఎందుకంటే, ప్రతివారూ ఇప్పుడు మిలిటరీని తమకు "రక్షకులు" గా భావించుతారు. కొద్దిరోజులక్రితమే మిలిటరీపై రాళ్లు రువ్విన ప్రజలు ఇప్పుడు మిలిటరీ వచ్చి తమను కాపాడిందని పొగుడుతారు. దొరికిందేతడవుగా, 45 వేలమంది సైనికుల్ని తెచ్చి కలకత్తా నగరంలో పెట్టారు. సింగపూర్‌నుంచి విమానాలలో కూడ తెచ్చి దింపారు.

అవిధంగా ప్రజలను రెండుపక్షాలుగాచీల్చి అమర్య బ్రిటిష్ సైన్యాలను తెచ్చి మకాం పెట్టారు. మొదటి విజయం సంపాదించారు.

తమ చెప్పుచేతలలోవుండే మంత్రివర్గాన్నిపెట్టి కార్మిక కర్షకోద్యమాలను అణచాలని ఎత్తులు

బుచర్ రహస్యలేఖ

అంతటితో ఆగలేదువారు. తమ దమననీతిలో మరో అడుగు ముందుకువేశారు.

అగస్టు 23 వ తేదీని తన క్రింది అధికార్లకు మేజర్ బుచర్ ఒక రహస్య లేఖ పంపాడు. ఆ లేఖమీద "రహస్యం — పై ఉద్యోగులకు మాత్రమే" అని వ్రాసివుంది. దానిలోవున్న విషయంయిది. కలకత్తా ఘటనలను గురించి, మిలిటరీ అధికార్లు ఒక రహస్య దర్యాప్తు జరపాలి. దీని ఉద్దేశం ఏమంటే, కొట్లాటలు ఆపడానికి తగినంత మిలిటరీనితెచ్చామని యితరులకు తెల్పడం, ఇంకా ప్రజల "మన్ననలు" పొందడానికి అవసరమైతే అదనంగాకూడ మిలిటరీని దిగుమతిచేసి, ఏక్షణంలోనైనా సరే ప్రజలను రక్షించడానికి సిద్ధంగా వున్నామని తెల్పడం.

ఇంకో ముఖ్యవిషయం, స్థానిక ప్రభుత్వం కోరకపోయినా ఇదంతా మిలిటరీ అధికార్లు తమంతటతామే జాగ్రత్తవహించి చేస్తున్నారనికూడా తెలియజేయాలి.

అంటే దీని ఉద్దేశం, దెబ్బలో దెబ్బ ముస్లింలీగ్ మంత్రివర్గాన్ని అపఖ్యాతిపాలు చేయడం.

చీఫ్ సెక్రటరీ మద్దతు "స్టేట్సుమన్" పత్రిక దాడి

ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ పై కుట్రను బలపరుస్తున్నాడు. ఈ కొట్లాట సందర్భంలో పోలీసు, మిలిటరీ చేసిన అత్యాచారాలను గురించి, పత్రికా రచయితలు అడిగిన ప్రశ్నలకు అతడిలా సమాధానం చెప్పాడు.

ఆ ప్రశ్నలు, శాసనసభలో అడగవలసినవి. మంత్రులే వాటికిసమాధానం చెబుతారు అన్నాడు.

దీనిఅర్థం ఏమిటి? అగస్టు 16న రక్తపాతానికి, అత్యాచారాలకు బాధ్యత అంతా లీగు మంత్రులదేనని, వారిమీదికి ఇతరులను ఉసికొల్పడంకాక మరేమిటి?

దీనికితోడు యూరపియన్లపత్రిక "స్టేట్స్‌మన్", కొట్లాటలు ప్రారంభమైన నాటినుంచీ లీగ్ మంత్రివర్గంమీద దుమ్మెత్తిపోయడం ఆరంభించింది, "అసమర్థపు మంత్రివర్గం" అని తిట్టడం సాగించింది.

వేవెల్ ప్లాను

అగస్టు 25 వ తేదీని లార్డ్ వేవెల్ ఢిల్లీనుండి విమానంలో వచ్చి కలకత్తాలో వ్రాలాడు. కాంగ్రెస్ లీగునాయకులను చాలమందిని కలుసుకుని మాట్లాడాడు.

నిజానికి సెక్షను 93 అతనిబుర్రలోవుంది. కాని ఇప్పుడది అమలుజరపడం అసాధ్యం. అందుకని, గవర్నరుకు బాగా అనుకూలంగా వుండేటట్లు మంత్రివర్గంలో మార్పులుచేస్తే బెంగాల్‌లోని బ్రిటిష్‌పెట్టుబడిదార్లకు సంతృప్తికరంగా వుండడమేగాక, ప్రజావిప్లవోద్యమాన్ని అణచడానికికూడా మంచి వీలుగా వుంటుంది. అందుకొక ప్లానువేసి, యూరపియన్లకిచ్చివెళ్ళాడు.

కాంగ్రెసు లీగులకు యూరపియన్ల షరతులు

యూరపియన్లు కుట్రలు మొదలుపెట్టారు. బెంగాల్ ఎసెంబ్లీలో వారికి 25 ఓట్లున్నాయి. కాంగ్రెసు లీగుపక్షాల బలాలు వీరు ఎటు మొగ్గితే అటువుంటాయి. అందుచేత అన్ని పార్టీల మంత్రివర్గం అనేపేరుతో ఇవుడున్న మంత్రివర్గాన్ని మార్చివేయాలని వారి ఎత్తు. తమ చెప్పుచేతలలో వుండే నజీముద్దీను మనుష్యులకు ఎక్కువమందికి స్థానం ఇవ్వాలని, పోలీసు మిలిటరీ బందోబస్తును ఎక్కువచేయాలని, కార్మికోద్యమాన్ని అణచివేయాలని వారి పట్టుదల,

ఎసెంబ్లీలో వ్యతిరేకపక్షమైన కాంగ్రెసు పార్టీకి కూడా డాక్టరు కైతాన్‌ద్వారా వారు అవే షరతులను పంపారు. (డా॥ కైతాన్, బెంగాల్‌లో బిర్లాగారి మనిషి.)

మద్రాస్, బొంబాయి మంత్రులు వారికాదర్శం

కార్మికోద్యమాన్ని అణచివేయడములో మద్రాసు, బొంబాయి రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రులు అవలంబిస్తున్న విధానం, బెంగాలు యూరపియన్ పెట్టుబడిదార్లకు నచ్చింది, అందుచేత ఎసెంబ్లీ సమావేశాలలో కూడా, మద్రాసు, బొంబాయి రాష్ట్రాలమాదిరి లేబరు పాలసీని అవలంబించవలసిందంటూ ఉపన్యాసాలు కూడా ఇచ్చారు.

ఈ విధంగా, మనకష్టాల నుపయోగించుకొని యూరపియన్లు తమ ఎత్తులను కొనసాగించుకొంటూవుంటే, మన నాయకులు పరస్పర నిందలతో సంతృప్తిపడుతున్నారు.

అగస్టు 16 వ తేదీని ఒకపెద్ద బహిరంగ సభలో మాట్లాడుతూ నజీముద్దీన్ సిగ్గువిడచి ఇలా అన్నాడు :

"కాంగ్రెసే పాకిస్తాన్‌కు నిజమైనశత్రువు. ఈరోజున కాంగ్రెస్ బ్రిటిష్‌వారిని బెదిరించి లొంగదీసుకొంటోంది" అన్నాడు.

ఇంత సుహ్రావర్దీని చూడండి : ఒకప్రక్క శాంతిని కాపాడమని ఐక్య శాంతికమిటీ తరఫున అప్పీలు చేస్తున్నాడు. శాంతిరక్షణ దళాలతో కలసి తిరుగుతూనే వున్నాడు. మరోప్రక్క విదేశ పత్రికా విలేఖరులతో యీ రక్తపాతానికంతకీ హిందూ కాంగ్రెసుదేబాధ్యతఅన్నాడు. బ్రిటిష్‌ప్రభుత్వంమీద పోరాటం యింకా ముందు వుందన్నాడు.

గవర్నరును అనడానికి ధైర్యంలేదు

గవర్నరు, మిలిటరీ, యూరపియన్లు చేసినదానికి వారిని విమర్శించేధైర్యం ఎవరికీ లేదు. సుహ్రావర్దీ మనుష్యులు సమయానికి గవర్నరు సహాయం పంపలేదని చెవులు కొరుకుతారేగాని పైకి ఆమాట అనరు.

శరత్‌బోసు 'చొరవ'

శరత్‌బోసు మొదటి నాలుగురోజుల్లోను నాలుగుసార్లు గవర్నరును కలుసుకున్నాడు. ఎక్కువ సైన్యాలను పంపమని ప్రాధేయపడ్డాడు.

నిందుగవర్నరు చాలా "గట్టి" ఏర్పాట్లు చేశాడని పొగిడాడు. బెంగాల్ గవర్నరు కూడా అవిధంగా చేయాలన్నాడు. వెంటనే బయలుదేరి కలకత్తాకు రమ్మని వైశ్రాయి వేవెల్‌ను ఫోనులో ప్రార్థించాడు. వేవెల్ విమానంలో దిగేటప్పటికి, విమానాశ్రయం వద్ద శరత్ బోసు కాచుకుని కూర్చున్నాడు.

ఎర్రజెండా పనికిరాదట !

శాంతిని కాపాడడానికి అంత ఆతృత చూపిన శరత్ బోసుకు, ఐక్యశాంతి కమిటీలో ఎర్రజండాకూడా వుండడం ఇష్టంలేకపోయింది. కాంగ్రెసు - లీగు జెండాలు, పరస్పర కలహాలను ఆపకుండా రెచ్చగొట్టి రక్తపాతాన్ని కలిగిస్తూవుంటే, కలకత్తాలో ఎర్రజెండా ఒక్కటే 15 లక్షల కార్మికుల్ని ఆ అంతర్యుద్ధంలో ప్రవేశించకుండా ఆపింది. అలాంటి ఎర్రజెండా ఈ "శాంతికాముకుడి"కి పనికిరాదట !

యూరపియన్ల మంత్రివర్గం మరీ పెద్దహాని

యూరపియన్లు తమ మంత్రివర్గాన్ని నెలకొల్పడానికి చేస్తున్న ఈ కుట్రలను గురించి, యింతవరకు కాంగ్రెసునాయకులుగాని, లీగునాయకులుగాని నోరు మెదపడం లేదు.

బెంగాల్ రాష్ట్రానికి యూరపియన్ల కీలుబొమ్మ మంత్రివర్గం రావడంకంటె పెద్ద హాని మరొకటి వుండదు. ఇప్పుడు జరిగిన రక్తపాతంకంటె ఆమంత్రివర్గం ఎన్నోరెట్లు అపకారి అవడానికి ఏమీ సందేహంలేదు.

(మిగతా 4 వ పేజీలో)

కాంగ్రెసు మంత్రుల కార్మిక వ్యతిరేక పంథా

స్వాతంత్ర్య పోరాటానికి పెద్దదెబ్బ

"పీపుల్స్ ఏజ్" సంపాదకీయం

కార్మికుల కోర్కెల విషయంలోను, వాటి పరిష్కారం కొరకు ప్రారంభమయ్యే సమ్మెపోరాటాల విషయంలోను, కాంగ్రెస్ మంత్రులు తీసుకుంటూన్న చర్యలు అతిదారుణంగా పరిణమిస్తున్నాయి. చివరకు పౌరసత్వహక్కులకే ఎసరుపెడుతున్నాయి మంత్రులు సమ్మెలను క్రూరంగా అణచివేసి, న్యాయమైన కార్మికుల హక్కులను త్రోసిపుచ్చుతున్నారు. కార్మికవర్గాన్ని అణచివేసేటందుకై బహిరంగంగా పెట్టుబడిదారులకు సహాయం చేస్తున్నారు.

"చట్టవిరుద్ధమైన" సమ్మెలు అంటూ బెదరింపులతోను, భవిష్యత్తులో అంతా చక్కబరుస్తామనే వాగ్దానాలతోను కాంగ్రెస్ మంత్రులు పరిపాలన ప్రారంభించారు. కాని, వారి పరిపాలన యొక్క నిజస్వరూపం అధికారం తీసుకున్న 15 రోజులలోనే తెలిసి పోయింది.

బొంబాయి కార్మికతగాదాల చట్టంలో ఎన్ని లోపాలున్నా వాటికి లోబడి జరిగే చట్టబద్ధమైన సమ్మెలపై కూడా 144 వ సెక్షన్‌ను ప్రయోగించారు.

అమల్నేర్ హత్యలు

ఈ విధానంయొక్క పర్యవసానమే అమల్నేర్‌లో జరిగిన సామూహిక హత్య. అమల్నేర్ తూర్పు ఖాన్‌దేశ్‌లోని ఒక చిన్న పారిశ్రామిక నగరం. అక్కడి కార్మికులలో ఒకనిని పనినుంచి తొలగించినందుకై కార్మికులు సమ్మెచేయవలసి వచ్చింది. ఆ సమ్మె పూర్తిగా చట్టబద్ధం బొంబాయి కార్మిక తగాదాల చట్టంలో నిర్దేశించబడిన రాజీప్రయత్నాలన్నీ విఫలం అయినాక (ఈ చట్టాని క్రిందటిమారు అధికారంలోవున్నప్పుడుకాంగ్రెస్ మంత్రులే సృష్టించారు.) సమ్మె ప్రారంభమయింది. కాని, సమ్మె ఆరంభమైన మరునాడే, జిల్లాఅధికారులు ఏవిధమైన మీటింగులూ జరపకూడదంటూ 144 వ సెక్షన్ ప్రయోగించారు.

ఆ నిషేధాన్ని తొలగించ వీలులేదని పోలీసుశాఖ మంత్రి నిరాకరించాడు ఆ విషయంలో కలగచేసుకునేందుకు కార్మికశాఖ మంత్రి (గుల్జారిలాల్ నందా) తిరస్కరించాడు. అందుచేత 144 వ సెక్షన్‌కు అసమ్మతి చూపుతూ కార్మికులు శాంతియుతంగా సభ జరపడానికి నిర్ణయించారు.

శాంతంగా జరిగిపోతూన్న ఈ సభ మీదనే డి. ఎస్. పి. పోలీసుల తుపాకులు కాల్చి 9 మందిని చంపారు. 50 మందిని పైగా గాయపరిచారు.

9 మందిచావు, 60మందికి గాయాలు. వీరిలో చాలామంది యావజ్జీవమూ వికలాంగులుగా జీవించవలసిందే. ఇది కాంగ్రెసు మంత్రుల హయాముక్రింద అమల్నేర్‌లో జరిగిన దారుణ హింసాకాండ. పెద్ద సర్వవ్యాపితసమ్మె జరుగుతూన్నప్పుడు సామ్రాజ్యవాదుల గులాములు కూడా గతంలో చేయలేని దారుణం, నేడు వీరు చేశారు.

మద్రాసు రాష్ట్రంలో

మద్రాసు రాష్ట్రంలో కూడా ప్రకాశం మంత్రివర్గం ఇదే పంథా తొక్కుతూంది.

నలభై వేల మంది పాల్గొంటూన్న పెద్ద ఎస్. ఐ. ఆర్. సమ్మె సందర్భంలో బహుక్రూరమైన రాక్షస విధానం అవలంబించబడుతోంది.

రైల్వేబోర్డులోని తెల్లదొరలు సాగిస్తూన్న దాడికి, పనుల నుంచి తొలగింపుకూ, వ్యతిరేకంగా కార్మికులు న్యాయమైన పోరాటం సాగిస్తున్నారు. గతంలో తాము పోరాడి సంపాదించుకొన్న హక్కులను నిలుపుకొనేందుకే వారు పోరాడుతున్నారు.

బినా, ప్రకాశం మంత్రివర్గం, ఎస్. ఐ. ఆర్. జనరల్ మేనేజరుకై నాల్డ్సుకు పూర్తిగా మద్దతు నిస్తూంది. కార్మికుల్ని అణచివేసేటందుకు పోలీసులకు పూర్తి అధికారం ఇచ్చింది. దురంతాలకు పేరు పడ్డ మలబార్ స్పెషల్ పోలీసులను కార్మికులనుఅణచడానికివుపయోగిస్తోంది.

మధుర మొదలైన ప్రదేశాలలో పోలీసులు కార్మిక పేటలలో ప్రవేశించి ఆడవాళ్లను బెదరించి వారి భర్తలను పనులలోకి పంపమని నిర్బంధిస్తున్నారు.

అరెస్టులు, లాఠీఛార్జీలు, కాల్పులు

ఇక్కడా అక్కడా అనకుండా 144 సెక్షనును, అన్నిచోట్లా మీటింగులను నిషేధించడానికై ప్రయోగిస్తూన్నారు. అనేకచోట్ల లాఠీఛార్జీలు జరిగాయి. 200 మందికి పైగా గాయపడ్డారనీ, 160 మంది అరెస్టు అయ్యారనీ కార్మిక నాయకులు చెప్తున్నారు. (ఈ సంఖ్య నాలుగు రోజుల ఈ మధ్య చాలా పెరిగింది. తిరుచునాపల్లిలో పోలీసు కాల్పులకు 4 గురు మరణించారు. 9 మంది గాయపడ్డారు. 1050 మంది అరెస్టుఅయ్యారు. కాల్పులకు ముందు జరిగిన లాఠీఛార్జీలో 150 మందికి గాయాలుతగిలాయి.—సం.)

లాఠీ ఛార్జీలు, వందలకొద్ది మంది అరెస్టు, 144 సెక్షను, శాంతంగా న్యాయబద్ధంగా సమ్మె సాగిస్తూన్న కార్మికుల్ని హింసించడం. ప్రకాశం మంత్రివర్గం వెనుకటి ప్రభుత్వాధికారుల పరిపాలనను తూ.చ. తప్పకుండా అనుకరిస్తున్నది.

కాంగ్రెసు వాదులం ఆలోచించండి

ప్రతిఒక్క సామాన్య కాంగ్రెసువాది తానుపోరాడుతూన్నది ఎవరి స్వాతంత్ర్యంకోసమో ఆలోచించవలసిన సమయంవచ్చింది. ఎవరి హక్కులకోసం, ఎటువంటి ప్రజా తంత్రంకోసం, తాను జైళ్లకువెళ్ళారు? లాఠీలను తుపాకులను ఎదిరించినిలబడారు? అధికారుల్ని కార్మికులమీదికి వుసికొల్పడానికేనా తాను పనులుచేసింది? పూర్వంలాగే ఆకలిబాధకు ప్రజలు గురికావడానికేనా. తానీ త్యాగాలుచేసింది? లేక ప్రజల్ని అధికారంలోకి తెచ్చి, వారిని ఆకలిబాధనుంచి రక్షించడానికా తానీ త్యాగాలుచేసింది. ఆలోచించండి.

సామ్రాజ్యవాద ప్రభుత్వం శాంతికోసమూ, అధికారం వప్పచెప్పడంకోసమూ ప్రయత్నిస్తూందనే భ్రమ వద్దు. ప్రజలలో ప్రజ్వరిస్తూన్న అసంతృప్తి జ్వాలలను అణచేటందుకై వారికి పైతరగతులవారి యొక్క, కాంగ్రెసు యొక్క సహాయం కావాలి. అందుకే ఈ ఎత్తులన్నీ, తాత్కాలిక మంత్రివర్గాలచేత తమపని చేయించుకోవాలని వారియెత్తు.

ఇది ప్రజలతో పోరాటం

కమ్యూనిస్టులతో పోరాడుతున్నామనే భ్రమకు ఏ కాంగ్రెసువాదీ లోనుకావద్దు. ఈనాడు కమ్యూనిస్టులతో పోరాడడం అంటే, విజృంభిస్తూన్న కార్మికశక్తులతోనూ, రైతులతోనూ పోరాడడం అన్నమాట. కాంగ్రెసుకు ఇంత ప్రతిష్ఠ కలిగించిన ప్రజలమీదనే దాడిచెయ్యడం అన్నమాట.

ఈ విధానం దేశ స్వాతంత్ర్యానికే ముప్పు తెచ్చిపెడుతుంది. ప్రతి దేశభక్తుడు ఈ విధానాన్ని ఎదిరించి, మంత్రివర్గాలు తమ తప్పుడు పంథాను మార్చుకొనేలా చెయ్యాలి. మంత్రివర్గ రాయబారుల ప్రణాళికలను అమలు జరపడంద్వారా బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో బేరాలు కుదుర్చుకొనడానికై ప్రయత్నిస్తూన్న పెట్టుబడిదారుల కౌగిలినుంచి కాంగ్రెసు మంత్రుల్ని కాపాడగలది కార్మికుల—ప్రజల ఐక్యశక్తి మాత్రమే.

కార్మికుల కర్తవ్యం స్పష్టంగా తెలుస్తూనేవుంది. అపవాదులకు, నిర్బంధాలకు, దురంతాలకు వ్యతిరేకంగా వారు చాలా తీవ్రమైన పోరాటం సాగించవలసి ఉంది. కమ్యూనిస్టుపార్టీ ఎన్నడూ కార్మికుల అండ విడువదు. తమ కోరికలకై వారు ఎంత ధైర్యంతో పోరాడితే, అంత త్వరలో వారిని పీడిస్తూన్నవారు ఓడిపోతారు.

రైతు-కూలీ ఉద్యమాలను అణచే యత్నం

(3 వ పేజీ తరువాయి)

ఆగస్టు 28 వ తేదీన మాట్లాడుతూ, యూరపియన్ సంఘాధ్యక్షుడు సి. పి. లాసన్ ఏమన్నాడో గమనించండి.

ఏ రాజకీయాలకు సంబంధించినా ఈ 'గుండాల'నందరినీ అరెస్టు చెయ్యాలట. 'దేశభక్తి' ముసుగుతో తప్పించుకోడానికి ఏ రాజకీయ పార్టీవారికీ అవకాశం యివ్వకూడదట. వారంతా బందిపోటు దొంగలకంటె ఏవిధంగాను వేరుకాదట.

దీనిఅర్థమేమిటో వేరేచెప్పనక్కరలేదు. "గూండాలు" అని లాసన్ వాడిన మాటకు చాలా అర్థంవుంది ఆ పేరుతో రాజకీయ పక్షాలన్నిటిమీద దాడిసాగించి చెండాడాలని ఆయన సలహా.

క్లయివ్‌వీధి యూరపియన్ల పత్రిక "కేపిటల్" రాజకీయాల పేరుతోగాని, మతం పేరుతోగాని, ఇలాంటి అల్లర్లు జరక్కుండా చేయాలని,అందుకు బలవత్తరమైనప్రభుత్వం కావాలనికోరింది.

ఎక్కువ పోలీసులను, ఎక్కువ మిలిటరీ సిబ్బందినీ తెచ్చి, ఈ అల్లర్ల వంకబెట్టి రాజకీయ ఉద్యమాలనే అణచివేయాలనియూరపియన్ల ఎత్తు.

రైతు, కూలీ ఉద్యమాలను అణచే యత్నం

"బలవత్తరమైన ప్రభుత్వం" "గట్టి లేబరు పాలసీ" అనే నినాదాలతో, సంఘటిత కార్మికోద్యమాన్ని నాశనం గావించాలని యూరపియన్ల ఆలోచన.

వారికి అసలు ప్రమాదం ఏదో బాగా తెలుసు.

నేడు లక్షలాది కార్మికులు - హిందూ ముస్లిం అనే భేదంలేకుండా - ఐక్యతతో, ఎక్కువజీతాలకోసం. అధికధరల అలవెన్సులకోసం, ట్రేడ్‌యూనియన్‌హక్కులకోసం పోరాటంసాగిస్తున్నారు. ఈపోరాటం రోజురోజుకి బలపడి సంఘటిత మవుతోంది. అందుచేత దీనిని దెబ్బకొట్టకపోతే, తమకిక్కడ బ్రతికే అవకాశమేవుండదు.

అంతేకాదు. తూర్పుబెంగాల్‌లో జూట్ (జనపనార) పండించే రైతులు కూడా చైతన్యవంతులవుతున్నారు. జూట్‌కు ఎక్కువ ధరలు కావాలని వారు ఆందోళన చేస్తున్నారు.

దీనిమీదకూడా దెబ్బకొట్టాలి. తమ యిష్టంవచ్చిన మంత్రివర్గాన్ని నెలకొల్పితే రైతులను అణచిపెట్టి, జూట్‌ధరలు తగ్గించి ఎక్కువలాభాలు గుంజుకోవచ్చునని వారి ప్లాను.

ఈ విధంగా, 7 వేల ప్రాణులను బలిగొన్న ఈ అంతర్యుద్ధపు రక్తవాహినిలో తమ పంట పండించుకోవచ్చునని యూరపియను పెట్టుబడిదార్ల ఎత్తు.

ఇప్పుడువచ్చిన ఇబ్బంది ఏమంటే, ప్రజా వుద్యమాలను నాశనంచేయాలనే బ్రిటిష్ ప్లానులో మన జాతీయ నాయకులుకూడా వారితోచేతులు కలపడానికి సిద్ధపడుతున్నారు. వారుగుడ్డిగా, తెలియక ఆపని చేయడంలేదు. పరస్పర ద్వేషాలతో బహిరంగంగానే ఆపనికి పూనుకుంటున్నారు.

తిండికోసం, స్వాతంత్ర్యంకోసం హిందూ - ముస్లిం ఐక్యతతో, కార్మిక కర్షకులు సాగించుతూన్న బ్రహ్మాండమైన ప్రజా పోరాటానికి ద్రోహంచేసినవార మవుతామని కూడా వారు గుర్తించడంలేదు.

హిందూ-ముస్లిం కొట్లాటలు బ్రిటిష్ కుట్ర

అంతర్యుద్ధం మన స్వాతంత్ర్య పోరాటానికి దెబ్బ

కలకత్తా కొట్లాటలలో జరిగిన భయంకర హత్యాకాండ స్వాతంత్ర్యయోధులందరికీ ఒక హెచ్చరిక. ఆగస్టు 16 మొదలు వరుసగా నాలుగురోజులు కలకత్తానగరం, పాడు మతవేళాలకు గురియైంది. హత్యలు, దోపిళ్ళు, ఇండ్లు తగులబెట్టడం. పట్టణమంతా వ్యాపించాయి. ఈ హింసాకాండలో పాల్గొన్నవారు రౌడీలు మాత్రమేకాదు. సామాన్య ప్రజలు సహితం పాల్గొన్నారు.

హిందువులలో, మహమ్మదీయులలో అంతా బాధితులమే అను యదార్థాన్ని వారుగుర్తించలేదు. దయ, జాలి, సభ్యత - యివిపూర్తిగా మాయమయాయా? అనిపించింది. ఇండ్లలో కుటుంబాలు నివసిస్తూండగానే, ఆయిండ్లకు నిప్పంటించారు స్త్రీలను మానభంగమొనర్చి హత్యలుచేశారు. అమాయకులైన పసికూనలను యిండ్లపైనుంచి వీధుల్లోకి చంపివిసిరి పారేశారు. చంపినవారి తలలను పట్టపగలు రోడ్లమీదికితెచ్చి, ప్రదర్శించారు.

బ్రిటిష్ యజమానులు మన దేశంలో గత 200 సంవత్సరాలుగా చేసిన ఘాతుక కృత్యాలే హిందూ బానిసలు మహమ్మదీయ బానిసలపైన, మహమ్మదీయ బానిసలు హిందూ బానిసలపైన, చేశారు:

సుమారు 3000 మంది అమాయక ప్రజలు హతులయ్యారు. 10,000 మంది ప్రజలకు గాయాలు తగిలాయి.

ఇలా చంపబడినవారందరూ ఎవరు? హిందువులు,మహమ్మదీయులు.మధ్యతరగతి లోను, పేద కుటుంబాలలోను పుట్టిన సామాన్య జనులు. ఏనాడైనా స్వాతంత్ర్య సమరంలో నగర్వంగా ప్రాణాలర్పించగల వీరు, తమతోటి సోదరుల చేతుల్లో ప్రాణాలు వీడవలసిన గతి పట్టింది:

చంపినవారుకూడా, సామాన్య కుటుంబాలకు చెందినవారే. వీరుకూడా స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలర్పించాలని ఉవ్విళ్ళూరేవారే.

ఇందులోనే ఉంది కలకత్తా నగరపు విషాద గాథ అంతా.

2 వారాలనాడు; ఈనాడు

కొద్ది నెలల క్రితమే, కలకత్తాలో ఆజాద్ హింద్ ఫౌజు సైనికుల విడుదలకొరకు బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిగాయి.

హిందూ మహమ్మదీయులు కలిసి, బ్రిటిష్‌వారితో పోరాడారు. ఆనాడు కలకత్తా వీధులలో హిందూ మహమ్మదీయుల రక్తం కలిసి ప్రవహించింది. బ్రిటిష్ సైనికుల తుపాకులను ధైర్యంగాకలిసిఎదుర్కొన్నారు.

తిరిగి రెండువారాలక్రితం, జులై 29 న. 15 లక్షలమంది హిందూ - మహమ్మదీయ కార్మికులు కలకత్తాలో పోస్టల్ సమ్మెను బలపరుస్తూ, సానుభూతి సూచకంగా, పనులు, మానేశారు. హిందూ ముస్లిం కార్మికులు చిన్న ఉద్యోగస్తులు, గుమాస్తాలు, విద్యార్థులు అంతాకలిసి ఇంటీరియం ప్రభుత్వపు పాలసీని ఖండించారు. అవేళ లీగ్ వాలంటీర్లు, ముస్లింలీగ్ మంత్రుల్ని పనులుచేసుకోనీయకుండా, వుక్కిరిబిక్కిరిచేశారు. యూరపియన్ షాహుకార్లు, ఎవరి యిండ్లలోవారు దూరి కూర్చున్నారు.

కలకత్తా పౌరులు ఆనాడు ప్రదర్శించిన ఐక్యత ప్రభుత్వాన్ని, కొంగదీసింది. ఒక్క పోలీసుగాని, సైనికుడుగాని అవేళ కలకత్తా వీధుల్లో కనబడలేదు: పట్టణం ప్రజల చేతుల్లోకి వచ్చింది.

కార్మికులకు, రైతులకు - కష్టజీవులకు అందరికి కమ్యూనిస్టుపార్టీ హెచ్చరిక

బాధ్యత ఎవరిది?

ఆ విప్లవ వాతావరణమంతా మాయమై కలకత్తాలో హిందూ - మహమ్మదీయ కొట్లాట ఎందుకొచ్చింది? ఎవరు దీనికి బాధ్యులు? ప్రజాజీవితాన్ని సర్వనాశనంచేయ తలపెట్టిన కుట్రదారులెవరు? ప్రజలు ఆ కుట్రలో ఎలా పడ్డారు?

విభజించి పాలించే సామ్రాజ్యవాద కుటిలనీతి, జాతీయైక్యతను విచ్ఛిన్నం చేసే, కాంగ్రెసు - లీగునాయకుల పాలసీ ఇవే కలకత్తా దుర్ఘటనలకు దారితీశాయి.

ఆజాద్ హింద్ ఫౌజు సైనికుల విడుదలకొరకు భారతవాసీకుల తిరుగుబాటును బలపరిచేందుకు, దేశంలో బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిగాయి. ఆ తర్వాత, నలువైపుల ప్రజా పోరాటాల వెల్లువ ఉప్పెనవలె వ్యాపించింది. వెంటనే సామ్రాజ్యవాదులు మేలుకున్నారు. పాతపద్ధతులతో దేశాన్ని పాలిస్తే ప్రయోజనం ఉండదని తెలుసుకున్నారు. భారతీయుల్లోనే భారతీయులకు కక్షలుపెంచి, పిల్లిమీద ఎలుకనూ - ఎలుకమీద పిల్లినీ ఎక్కించి, ఉభయ పార్టీలవారు సహాయం కొరకు తమపై ఆధారపడేలా చేయాలనుకున్నారు. దీని ఫలితమే బ్రిటిష్ మంత్రుల ప్రణాళిక.

ఈ ప్రణాళికయొక్క ముఖ్యోద్దేశ్యం ఏమిటి? సంస్థానాధీశుల్ని ఇతర ధనిక వర్గాలనూ చేరదీసి, భారతీయుల్లో చీలికలుపెట్టడంకోసంకాంగ్రెస్-లీగ్ విభేదాలను తమస్వార్థం కొరకు వుపయోగించుకోవడం. దేశంలో నానాటికి ఎక్కువవుతూన్న ప్రజావెల్లువను అణచడం. కాంగ్రెస్—లీగ్ నాయకులు ఒకరినొకరు సాధించుకోవడంకోసం తమపై ఆధారపడేలాచేయడం. కాంగ్రెస్ అనుచరుల్ని, ముస్లింలీగ్‌ను నాశనంచేయడంకోసం, లీగ్ అనుచరుల్ని కాంగ్రెస్‌పై దెబ్బతీయడంకోసం సమీకరించడమే ప్రధాన కర్తవ్యంగా ఉభయపార్టీల నాయకులు భావిస్తారు. అందరికి శత్రువైన బ్రిటిషు పాలకవర్గాన్ని విడిచిపెడతారు. దేశాన్ని యిలాతయారు చేయడమే బ్రిటిష్ ప్రణాళికయొక్క వుద్దేశం.

సామ్రాజ్యవాదుల కుట్ర

యీ రోజున, విభజించి పాలించే కుటిలనీతికి అర్థం హిందూ-మహమ్మదీయుల మధ్య అంతర్యుద్ధమన్నమాట. కాంగ్రెసునాయకులూ, లీగ్‌నాయకులూ ఈ అంతర్యుద్ధాన్నిగురించే మాటిమాటికీ ప్రకటనలుచేస్తున్నారు. అంతర్యుద్ధంవల్ల జరిగేదల్లా ఒకటే: భారతదేశ స్త్రీలు, బాలబాలికలు అన్యాయంగా దౌర్జన్యాలకు బలి అవుతారు. బ్రిటిష్ పరిపాలకులు మాత్రం తులుకుతూ, ఎప్పటిమాదిరిగానే మనపై పెత్తనం చెలాయిస్తూవుంటారు. విభజించి పాలించే తమ కుటిలనీతిని ఎవరిపై ఆధారపడి అమలుజరుపుదామనుకొంటున్నారు? మన ప్రధాన రాజకీయ సంస్థలయిన కాంగ్రెసు, లీగు నాయకుల పాడుదోరణిపయినే ఆధారపడి అమలు జరుపుదామనుకొంటున్నారు. అది వారికెంతయినా ధైర్యం, బలం ఇస్తోంది.

తాత్కాలిక ప్రభుత్వ నిర్మాణాన్ని గురించి సామ్రాజ్యవాదులు కాంగ్రెసు నాయకత్వంతో రాజీచేసుకొనబోతున్నారనేవార్త తెలుసుకొని ముస్లింలీగ్ యొక్క అభివృద్ధినిరోధక నాయకత్వం "పోరాటం" తీసుకురావాలని నిశ్చయించింది. ఆగస్టు 16 న దేశమంతటా సభలు, ప్రదర్శనలు జరపవలసిందని ఆదేశించింది.

లీగ్ ఆదేశించిన "పోరాటం" ఎలాంటిది?

భారతదేశంలో ప్రజాఉద్యమాలెన్నో వచ్చాయి. కాని, లీగ్ నాయకులు ఒక్కసారి కూడా, వాటిని బలపరుస్తూ, "పోరాట" తీర్మానాలు చేయలేదు. స్వాతంత్ర్య పోరాటంలో ఒక్కసారి కూడా చేరలేదు.

10 కోట్లమంది భారతముస్లిములకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకొనే లీగు నాయకులు, బెంగాల్ కరువుకు 30 లక్షల మంది (వీరిలో అధిక భాగం మహమ్మదీయులు) బలిఅవుతూంటేవారిని రక్షించడంకోసం "పోరాటం" ప్రారంభించలేదు. ముస్లిం రైతాంగాన్ని 'కరువు రాక్షసి' నుంచి రక్షించడానికి సామ్రాజ్యవాదులపై పల్లెత్తు మాటకూడా అనలేదు.

కాశ్మీర్ మహారాజుయొక్క హింసాకాండను ప్రతిఘటిస్తూ కాశ్మీర్ ప్రజాసామాన్యం (వీరిలో 100 కి 90 మంది మహమ్మదీయులు) వీరోచిత పోరాటం సాగిస్తూంటే, ముస్లింలీగు నాయకులు ప్రజల్ని బలపరుస్తూ ఎట్టి "పోరాటా"నికి పిలుపు యివ్వలేదు.

రైల్వే కార్మికులు ఇండియా ప్రభుత్వ పాలసీని ఎదిరిస్తూ సమ్మె చేయడానికి సిద్ధమైనప్పుడు, లీగు నాయకులు వారి పోరాటాన్ని వ్యతిరేకించారు కూడా.

పంజాబ్‌లో నేడు ముస్లిం రైతాంగం ముస్లిం జమీందార్లకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్నారు. లీగు నాయకులు వాటిని బలపరచలేదు.

ఇప్పుడే ఎందుకు "పోరాటం" చేస్తామని లీగ్ నాయకులు తీర్మానించారు? ఎవరికి ఆ తీర్మానం లాభదాయకం?

ముస్లిం ప్రజల్ని మోసగిస్తున్నారు

సామ్రాజ్యవాదుల పైశాచిక ప్రణాళిక తు. చ. తప్పకుండా అమలు జరిగేటట్లు చేయడానికే, ఆగస్టు 16 వ తేదీని సభలు, ప్రదర్శనలు జరపవలసిందని వారు ఆదేశించారు: కాంగ్రెసు కుట్ర నుంచి బ్రిటిష్‌వారిని "రక్షించడం" కోసమట. యీ ఆందోళన అంతా, అధికారం కొరకు ముస్లిం ధనాఢ్యులు కాంగ్రెసుపై చేసే ఒత్తిడి తప్ప మరేమీ కాదు. యిది. బ్రిటిష్ పాలకవర్గంమీద ప్రకటించిన పోరాటం కాదు యిది. హిందువుల్ని, కాంగ్రెసు సంస్థనూ సాధించడంకోసం, బ్రిటిష్‌వారి సహాయం కొరకు ఎదురుచూడడం తప్ప మరొకటికాదు ఇది. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు ఏది అవసరమో, అదే యీ "పోరాట" తీర్మానం తెచ్చిపెట్టింది.

ఇది బ్రిటిష్‌వారిమీద ప్రకటించిన పోరాటం అని లీగ్ నాయకులు ముస్లిం ప్రజాసామాన్యానికి చెబుతూన్నమాట నిజమే. కాని, మోసం చేయడానికే వారలా చెప్పారు. ఈ మోస ప్రచారంలో ముస్లిం ప్రజానీకం పడ్డారు. మతకలహాలలో సామాన్య ప్రజల్ని సాధనాలుగావుపయోగించుకొని, కాంగ్రెసును సాధించడంకోసం సామ్రాజ్యవాదులతో రాజీ చేసుకోవడమే వీరిఉద్దేశ్యం.

ముస్లింలీగు నాయకులు తమఅనుచరుల్ని భారతీయులందరూ కోరే స్వాతంత్ర్య పోరాటంనుంచి దూరంచేసి, వారిని హిందువులమీదికిరెచ్చగొట్టి, కాంగ్రెసుపై యుద్ధం ప్రకటించారు. ఈ పాలసీ అంతర్యుద్ధం కోసం ఉవ్విళ్ళూరే సామ్రాజ్యవాదులకే ఎక్కువగా ఉపయోగిస్తుంది.

కాంగ్రెసు నాయకత్వంకూడ బ్రిటిషు సామ్రాజ్యవాదులతో రాజీచేసుకోవడంకోసం చేసే ప్రయత్నాలన్నీ సామ్రాజ్య వాదులకే లాభం చేకూరుస్తాయి.

కాంగ్రెసు పాలసీ

ఈ రోజున, కాంగ్రెసు, హిందువుల్ని మహమ్మదీయుల్ని ఒకే వేదికపైకితెచ్చే కార్యక్రమం యిచ్చి, అందరూ కలిసి స్వాతంత్ర్యసమరంలో పాల్గొన వలసిందని పిలుపిచ్చేస్తే, బ్రిటిషు అధికారుల పెత్తనం ఒక్క దెబ్బతో అంతమౌతుంది, సామ్రాజ్యవాదుల పలుకుబడి అంతాఎందుకూ పనికిరాకుండాపోతుంది.

బ్రిటిషుపాలకవర్గముమీద ఇలాంటిబలీయమైన పోరాటం ప్రారంభించడానికి ప్రజాసామాన్యం సిద్ధంగావున్న ఈనాడు, కాంగ్రెస్ నాయకులు బ్రిటిష్ ప్రభుత్వంతో పిరికిపందరాజీ చేసుకున్నారు.

దీని ఫలితం దేశంలోని విప్లవశక్తులు విచ్ఛిన్నం కావడం, మతకలహాలు తీవ్రం కావడం. ఎందువల్లనంటే, హిందువుల్ని మహమ్మదీయుల్ని ఒకే పోరాటంలోకి తీసుకురావడానికిబదులు, కాంగ్రెసు నాయకులు రాజీకోసం ప్రాకులాడితే, ముస్లింలీగును తొలగదీయడంకోసం సామ్రాజ్యవాదులపై ఆధారపడవలసినఅవసరం కలుగుతుంది. అంతర్యుద్ధానికి దారితీసే వాతావరణాన్ని సృష్టించవలసి వస్తుంది.

విచ్ఛిన్న పాలసీ

ఈ మర్మ కాంగ్రెసు నాయకులు అవలంబించేపాలసీ చూస్తే, మహమ్మదీయ ప్రజాసామాన్యం తమ హిందూ సోదరులతోకలసి అందరికి న్యాయమయిన హక్కులకై పోరాడనీయకుండా అటంకపరుస్తూ వచ్చారు.

(మిగతా 6 వ పేజీలో)

కాంగ్రెసు, లీగ్ నాయకుల పాలసీ
శతృవుకే బలం చేకూర్చుతుంది

కలిసి పోరాడడంద్వారా
హిందూ - ముస్లిం ఐక్యత సాధించండి

(1వ పేజీ తరువాయి)

ఇందువల్ల మహమ్మదీయ ప్రజాసామాన్యంలో మతదురహంకారాన్ని రెచ్చగొట్టే నాయకుల పలుకుబడి హెచ్చుతూంది.

కాంగ్రెసు నాయకులు దేశీయధనిక వర్గాలతో రాజీచేసుకోవడంవల్ల జమీందార్లకు వ్యతిరేకంగా రైతులుచేసే పోరాటాన్ని భగ్నంచేయవలసివస్తోంది. అలాకాకుండా, పౌరుషాన్ని అణచరచే పక్షంలో, హిందూ మహమ్మదీయ రైతాంగం సోదరభావంతో, సమిష్టి ఆశయంకోసం, ప్రాణాలర్పించడానికి కూడ వెనుదీయరు.

అంతేకాదు, కాంగ్రెసు నాయకులు సమ్మెలవల్ల అవలంబించే వ్యతిరేక వైఖరివల్ల, హిందూ మహమ్మదీయ కార్మికుల సమిష్టి పోరాటాన్ని కాంగ్రెసు నాయకులు వ్యతిరేకించ వలసివస్తోంది. పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలమయే పనులుచేయవలసి వస్తోంది.

సంస్థానాధీశుల్నికూడ బలపరచే విధానం కాంగ్రెసు నాయకులవలంబిస్తున్నారు. తత్ఫలితంగా కాశ్మీరువంటి సంస్థానాలలో ముస్లిం ప్రజాసామాన్యం ప్రారంభించిన పోరాటాన్ని వ్యతిరేకించ వలసివస్తోంది.

ఈవిధంగా, కాంగ్రెసు నాయకులవలంబించే పాలసీ హిందూ — ముస్లింలమధ్య సంఘీభావం రాకుండా ఆటంకపరుస్తోంది. ముస్లిం ప్రజాసామాన్యంపై మతదురహంకారుల పలుకుబడిని నిలిచియుండేలా చేస్తోంది.

కాంగ్రెసునాయకులు బ్రిటిష్‌వారి సహాయంతో ముస్లింలీగును ఓడించడంకోసం ఎప్పుడైతే పన్నాహాలు ప్రారంభించారో, అప్పుడు ఈ పాలసీ మరీ వికృత రూపం ధరించింది.

భారతదేశంలో వివిధ జాతుల ప్రజలు, యిష్టపూర్వకంగా ఒకే ఒక ప్రజాతంత్ర ప్రభుత్వంక్రింద వుండడానికవకాశం యిచ్చే విధానం మాని, కాంగ్రెసునాయకులు బ్రిటిష్ మంత్రుల ప్రణాళికల ప్రకారం బలవంతంగా అన్ని రాష్ట్రాలవారినీ కేంద్రప్రభుత్వంక్రిందికి తేవాలని చూస్తున్నారు. ఇందువల్ల ముస్లిం నాయకులు తమ వెనుకవున్న మహమ్మదీయ ప్రజాసామాన్యాన్ని సులభంగా రెచ్చగొట్టగలుగుతున్నారు. ప్రత్యేక భాష, విజ్ఞానం, సాంప్రదాయంగలిగిన వివిధ జాతుల ప్రజలకు స్వయం నిర్ణయ హక్కును నిరాకరించడంవల్ల లీగ్‌నాయకులు తమ అనుచరులలో తీవ్రమయిన మతద్వేషాలను రెచ్చగొట్టగలుగుతున్నారు.

ఇలా కాంగ్రెసు నాయకులు ఒకవైపు జాతీయైక్యతకు మార్గం చూపలేకపోతూ, మరొకవైపు ముస్లిం ప్రజలలో వ్యతిరేక భావాలు వ్యాపించేలా లీగును దూషిస్తున్నారు. అంతేకాదు, ముస్లిం ప్రజలకు వ్యతిరేకంగా తమ అనుచరుల్ని రెచ్చగొడుతున్నారు.

హిందువులు, మహమ్మదీయులు కలిసి పనిచేయడానికొక కార్యక్రమం ఇచ్చి ఉభయుల్నీ సమీకరించగల ఐక్యపోరాటానికి పిలుపు ఇవ్వడానికిబదులు కాంగ్రెసు నాయకులు శాశ్వతమైన అంతఃకలహానికి మార్గం సరిచేస్తున్నారు.

తాత్కాలిక ప్రభుత్వ స్థాపన

కాంగ్రెసు ఒంటరిగా తాత్కాలిక ప్రభుత్వంలో ప్రవేశించడంతో, హిందూ మహమ్మదీయ కొట్లాటలకు అవకాశాలు మరింత ఎక్కువయాయి. ముస్లింలీగు నాయకుల తిరిగి "పోరాటా"నికి పిలుపు యివ్వడం, బ్రిటిష్ మిలిటరీ సహాయంతో కాంగ్రెసు ప్రభుత్వం ముస్లిం ప్రజల్ని అణచడం, సంభవించిననాడు, ఈ రాజీపాలసీ ఎంత అనర్థానికి దారితీయగలదో స్పష్టంగా గోచరిస్తుంది.

ఇండియానుంచి బ్రిటిష్ సైనికుల్ని తరిమివేయాలని ఏ కాంగ్రెసు నాయకులైతే 1942 లో గంభీరోపన్యాసాలిచ్చారో, ఆ కాంగ్రెసు నాయకులే ఇక మీదట బ్రిటిష్ సేనల సహాయం తీసుకోవలసి వస్తుంది.

తమ దేశస్తుల్ని, తమ ప్రజల్ని, ఐక్యపరచలేక, "శాంతి భద్రతలకై రక్షణ" కోసమని, బ్రిటిష్ సేనలమీద ఆధారపడే ప్రభుత్వాన్ని "సర్వాధికారాలుగల స్వతంత్ర ప్రభుత్వం" అని పిలవడం ఎంత అవమానకరం!

కలకత్తా కొట్లాటల వంటివి ఇక జరుగవనుకోవడం పొరపాటు. తిండికి మొగం వాచే లక్షలాది అభాగ్య భారత ప్రజలు ఇంకా అనేక అగ్నిపరీక్షలకు నిలబడవలసియుంది. కలకత్తా దుర్ఘటనల వంటివి అట్టి అగ్నిపరీక్షలలో ఒకభాగం మాత్రమే.

అభివందనలు

ఈ పరిస్థితుల్లో సామ్రాజ్యవాదులకుట్రను భగ్నం చేయగలవారు భారత ప్రజా సామాన్యమే.

కలకత్తానగరంలో, ఒకవైపు భయంకరమైన హత్యాకాండ జరుగుతోంటే, ట్రాంవే కార్మికులు, రైల్వే కార్మికులు, జూట్ కార్మికులు, ఇంజనీరింగు కార్మికులు బీడీ కార్మికులు—హిందువులు—మహమ్మదీయులు యిదివరలో తాము జరిపిన వర్గపోరాటాల అనుభవాన్ని జ్ఞప్తియందుంచుకొని, ఒండొరులయెడల సోదరభావం ప్రకటించారు. అపూర్వమయిన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. కార్మికపేటలకు విషజ్వాలలు వ్యాపించకుండ జాగ్రత్తపడ్డారు. వారందరికి భారత కమ్యూనిష్టుపార్టీ అభివందనలర్పిస్తోంది.

అరుణపతాకంయొక్క పవిత్ర సాంప్రదాయాన్ని, కార్మికవర్గ ఐక్యతను, జాతీయైక్యతను దృష్టిలో వుంచుకొని, అన్యోన్య ప్రేమ, వాత్సల్యంచూపిన ఆ కార్మిక వీరులకు యిచ్చే మా అభివందనాలు.

వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేయతలపెట్టిన వారందరికి కలకత్తా కార్మికులు—అతి నికృష్టమయిన జీవితం గడిపే కలకత్తా కార్మికులు—చక్కని గుణపాఠం నేర్పారు.

ఉద్రేకంకొద్దీ చంపడానికి వచ్చినవారిని నివారించి, అమాయక ప్రజల్ని ధైర్యంతో రక్షించిన హిందూ, మహమ్మదీయ కార్మికులకూ - సామాన్య కుటుంబీకులకూ కమ్యూనిష్టుపార్టీ అభివందన లర్పిస్తోంది.

మహమ్మదీయుల్ని రక్షించడంలో హిందువులు,హిందువుల్నిరక్షించడంలో మహమ్మదీయులు అపూర్వమైన ధైర్య సాహసాలు, సోదర వాత్సల్యం ప్రదర్శించారు. ఇలా రక్షించడంలో తమ మతస్థుల ఆవేశాలకు బలిఅయిపోయారు. నేటి మన రాజకీయ నాయకులు గుర్తించని సోదర వాత్సల్యాన్ని, అపూర్వ త్యాగాన్ని వారు ప్రదర్శించారు. నిజమైన భారతమాత పుత్రులనిపించుకున్నారు. భారతదేశ బానిసనంకెళ్ళను పగులగొట్టగల స్వాతంత్ర్య యోధులు వీరంతా. వీరికి భారత కమ్యూనిష్టుపార్టీ జోహారు లర్పిస్తోంది.

అంతర్యుద్ధమనే ఆయుధం

కార్మికుల్నీ, హిందూ మహమ్మదీయుల్నీ భారతీయులందరినీ — ఐక్యపరచే సోదర సంబంధాన్ని చెడకొట్టడంకోసం ముందుముందు యిలాంటి అంతర్యుద్ధాలెన్నో రెచ్చగొట్టబడతాయి.

ఎందువల్లనంటే, దేశమంతట వ్యాపిస్తూవున్న కార్మిక పోరాటాలు, రైతు పోరాటాలు, తమ ఉనికికే భగం కలిగిస్తాయని సామ్రాజ్యవాదులు గాభరా పడుతున్నారు.

సామ్రాజ్యవాద ప్రణాళికకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని విచ్ఛిన్నం చేయడానికి మాటిమాటికి, తమ అవార్డులను అమలు జరపడానికి, యీ అంతర్యుద్ధాలను వారొక సాధనంగా ఉపయోగించుకుంటారు.

కార్మికుల సమ్మెపోరాటాలను విచ్ఛిన్నం చేయడానికికూడా వీటిని ఆయుధంగాఉపయోగించు కుంటారు. ఎందువల్లనంటే, కార్మికులు ఐక్యతతో ఉన్ననాడు పెట్టుబడిదారీ వర్గంనుంచి (దేశీయ పెట్టుబడి దారులు, యూరోపియన్ పెట్టుబడిదారులు) అంతకంతకు ఎక్కువరాయితీలు, ఎలవెన్సులురాబట్టుకుంటారనిభయం.

గ్రామాలలో హిందూ - మహమ్మదీయ రైతాంగం జమీందారులమీద, షాహుకార్లమీద, జరిపే సంయుక్త పోరాటాన్నిభగ్నం చేయడానిక్కూడా మతకలహాలను కొందరు స్వార్థపరులు రెచ్చగొడతారు.

ఈ మత కలహాలు, ఈ అంతర్యుద్ధం, భారతీయుల సంఘీభావాన్ని చెడగొట్టడానికి సామ్రాజ్యవాదులు పన్నినకుట్ర. కార్మిక పోరాటాలను, రైతుపోరాటాలను చెడగొట్టడంకోసం దేశీయధనికవర్గం పన్నేపన్నాగం.

కాంగ్రెసు నాయకత్వం, లీగునాయకత్వం అవలంబిస్తూన్న పాలసీ యీ కుట్రకు బలం చేకూరుస్తుంది.

కార్మికవర్గం, ప్రజానీకం ఈ కుట్రను భగ్నంచేసి, కాంగ్రెసు - లీగ్ నాయకుల విచ్ఛిన్నపాలసీని ఓడించవలసిందని కమ్యూనిష్టుపార్టీ హెచ్చరిస్తోంది.

కలిసి ఎదుర్కోవాలి

— కార్మికులలో హిందూమహమ్మదీయ కొట్లాటలువస్తే, మిల్లుయజమానులు జీతాలు తగ్గించివేసి, నిరోద్యోగం తెచ్చి పెడతారనీ, కార్మికులే నష్టపడతారనీ, గుర్తుంచుకోవాలి. హిందూ,మహమ్మదీయ రైతాంగంమధ్య అంతర్యుద్ధంవస్తే జమీందారులే బాగుపడతారనే విషయం మరచిపోకూడదు.

ప్రజా సామాన్యంలో వచ్చే ప్రతి చీలిక సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని బలపరుస్తుందనే యదార్థాన్ని గ్రహించాలి.

— అందువల్ల, సామ్రాజ్యవాదుల ప్లానును గొంతెత్తి ఖండించండి. కాంగ్రెసు నాయకత్వం, లీగ్ నాయకత్వం, అవలంబించే విధానాలను గట్టిగా నిరసించండి.

— ప్రజా సామాన్యంలో అభేద్యమైన ఐక్యతను నిర్మించడంకోసం నడుం బిగించి పనిచేస్తామని సామ్రాజ్యవాదులకు తెలియజేయండి. ఇకమీదట ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే, సహించం.అని స్పష్టంగా ప్రకటించండి. ఐక్యతతో ఎదుర్కొంటాం — అనిస్పష్టంచేయండి.

— ఇకమీదట మన యింట్లను మనమే నాశనం చేసుకొనే స్థితికి వెళ్ళము - అని సంస్థానాధీశులకు, జమీందార్లకు, షాహుకార్లకు గట్టిగా చెప్పవలసియుంది.

ప్రజలు పనిముట్లుకాకూడదు

అంతేకాదు. ఒకళ్ళనొకళ్ళను నరుక్కోవటం, పసిపాపలను హత్యచేసి, అంతర్యుద్ధంలో బలికావడానికి అంగీకరించం — అని కాంగ్రెసునాయకులకు,లీగు నాయకులకుబాగా స్పష్టం చెప్పవలసియుంది. కొందరు గ్రూపుల స్వార్థంతో అధికారంకొరకు పెనుగులాడుకొంటూంటే, అమాయక ప్రజలు వారిద్దరిమధ్య సాధనాలుగా వుపయోగపడే కాలం పోయిందని వారిచేత గుర్తింపజేయాలి.

సామ్రాజ్యవాదులకుకూడా ఒక విషయం స్పష్టంచేయవలసియుంటుంది. భారత కార్మికులు, భారత ప్రజలు ఎన్ని త్యాగాలనయినా చేసి, ఎందరి ప్రాణాలనయినా అర్పించి, భారతీయుల ఇండ్లను నిప్పంటించే కిరాతకుల కుట్రలను భగ్నంచేసి తీరుతామని చెప్పాలి.

వయోజన వోటింగు పద్ధతిప్రకారం, జాతుల స్వయంనిర్ణయ హక్కునుబట్టి, సర్వాధికారాలుగల రాజ్యాంగ నిర్మాణ సభకోసం పోరాడి తీరుతాం — అని చాటాలి.

భారత ప్రజల శక్తికి ఎదురులేదు. ఎట్టి కుట్రనైనా వారు భగ్నం చేయగలరు. ఐక్యతను విచ్ఛిన్నం చేసేవారందరినీ ఓడించగలరు. సామ్రాజ్యవాదుల నుంచి సంపూర్ణ స్వాతంత్ర్యం గుంజుకోగలరు.

—పీపుల్స్‌ఏజ్ నుంచి.

కథ

ఖాశీంబీబీ

'పుల్లయ్య'

తెల్లవారేటప్పటికి వూరంతా గప్పుమంది. అమ్మలక్కలంతా చేరి విచిత్రముగా చెప్పుకుంటున్నారు.

"ఇంత యిద్దూరం ఎప్పుడన్నా వుండేమో చూడమ్మా! మా కాలంలో మేమెప్పుడూ ఎరుగమమ్మా"అంది డెబ్బదేళ్ళ మునలమ్మ.

"దానికేం పోయేకాలమొచ్చిందే! ఒక్కగానొ ఒకపిల్లాడేగా దానికుంది." అభివృద్ధమైన 10 ఎకరాల పొలమున్న సుబ్బయ్యభార్య కోటమ్మ అంది.

"ఒక కన్ను కన్నుగాదు: ఒక బిడ్డ బిడ్డగాదు అన్నారు పెద్దాళ్ళు. అదిగాక పోయినా నలుగురు బిడ్డలుంటే మాత్రం తల్లికి యింకో బిడ్డ చేదా పెద్దమ్మా"అని ఆస్తిపాస్తులులేని స్త్రీ చుక్కమ్మ అంది.

"ఏమోనమ్మా చుక్కమ్మా! మా కాలంలో యిట్టాంటి యిద్దూరాలే లేవే. పదిమంది పిల్లలున్న ముత్తయిదువంటే ఎంతయిదిగా చూసేవారనుకున్నా 'కడుపు పల్లని తల్లి' అనేవారు పదిమందినీ" అంది మునలమ్మ.

"షాహుకారు రామయ్యగారికి ఎట్టాలేదన్నా 100 ఎకరాలపైగా మాగాణి వుంది. ఇంకా కాతా యెంతవుందో ఎవరికి తెలుసు!"అని విస్తుపోయింది కోటమ్మ.

"ఎంత తబ్బుంటే ఏంలే! ఆ పాడు ముండ ఎరికిలి మంత్రసాని చేత మందు తిని ప్రాణంమీదికి తెచ్చుకుంది"అని అందుకొంది చుక్కమ్మ.

"ఇంకో బిడ్డపుడితే భాగాలు చీలుతాయని భయం రామయ్య పెళ్ళానికి. అందుకే కడుపు దించుకోడానికి మందు పుచ్చుకొంది, ప్రాణంమీదికి వచ్చింది" అని తేల్చివేసింది కోటమ్మ.

"కూటికి కరుగా! గుడ్డకు కరుగా! ఈ పాడుబుద్ధి ఎందుకు పుట్టిందేదానికి?" అని మునలమ్మ మళ్ళీ అడిగింది అర్థంగాక.

"అదికాదు పెద్దమ్మా! కూటికీ గుడ్డకూ కరువైనాళ్ళకు యీబుద్దేపుట్టదు. ఇంతకీ రెండో కొడుకు పుడితే భాగాలు చీలిపోతాయని మందు పుచ్చుకుందట. అసలు తల్లి ప్రాణానికే ముంచుకొచ్చిందంట పెద్దమ్మా!"

ఏపోనమ్మా! ఏదో యివాళకాలమొచ్చింది. ఇద్దరు బిడ్డలుంటే రామలక్ష్మణుల్లే వుండేవారు గదా! ఇప్పుడేమయింది? వచ్చినాక యీ ఆస్తంతా నెత్తినేసుకు పోతాందా!" అని మునలమ్మ విసుక్కుంది.

"ఉండ మారాజులు ఏం చేసినా చెల్లిపోతుంది లెండి"అంటూ ఖాశింబీబీ 10 నెలల పసికందును ఎత్తుకొని అక్కడికి వచ్చింది.

"ఏంచెప్పినా ఖాశింబీబీనే చెప్పాలి. పదిమంది బిడ్డలతల్లి. లేని కాపురం, ఎందుకొచ్చిన పిల్లలని ఎన్నడూ యిసుక్కుని ఎరగదు" అని చుక్కమ్మ ఖాశింబీబీని పొగిడింది.

"అయితే బాబూ! ఆ చంకనున్న పిల్లెవరూ? మనుమరాలా?" అని మునలమ్మ అడిగింది.

"కాదు! మామ్మా! మొన్న అరుక్కునే బొందిలాళ్ళు మా యింటి దగ్గర దిగారు" అని ఖాశింబీబీ తన కేతిలోని పిల్లకథ చెప్పడం ప్రారంభించింది.

ఖాశింబీబీ కి 50 యేళ్ళుంటాయి. 6 గురు కొడుకుల్ని, 5 కూతుళ్ళను ఎత్తిన ముత్తయిదు. మొగుడు చేపలుపడతాడు. బీబీ వాటిని అమ్ముతుంది. కూలి ముమ్మరంగావున్న రోజుల్లో యిద్దరూ కూలికి పోతారు. కష్టపడి ఎల్లాగో గంపెడంత సంసారాన్ని యీదుకొస్తున్నారు. ఈడు వచ్చినప్పటినుంచి పిల్లలు పాలేరుతనం చేసి తలిదండ్రుల చేతికి అర్దువడుతున్నారు. ఇప్పటికి ఖాశింబీబీకి కానుపు వుడిగిపోయింది. పెద్దపిల్లలు కాపురాలు చేస్తున్నారు. మనుమల్ని.మనుమరాళ్ళనూ సాకిందికూడ ఖాశింబీబీ.

"ఆ బొందిలీవాళ్ళలో ఒకడు ఎవరో అమ్మాయిని లేవదీసుకు వచ్చాడు—పిల్లతల్లిని. పిల్లతోకూడా తీసికొచ్చినందుకు తల్లితో సందకాడ పోట్లాడుతున్నాడు," అని ఖాశింబీబీ చెబుతూంది.

"అవునులే లంజెకి పిల్లతగలాటమని వాడికేం మొగాడి ఆట ఎట్లైనా సాగుతుంది" అంది చుక్కమ్మ.

"ఏమైనా కన్నతల్లి గదమ్మా! పిల్లాడిని వదలిపెట్టి వుండలేనని యేడ్చింది. మొత్తుకుంది. ఐతేయేం, ఇల్లు కదిలాక ఆడది మొగాడికి లోకువే కదమ్మా! ఏం మాయచేశాడో! బెదిరించాడో! తెల్లవారేప్పటికి వాళ్ళంతా వెళ్ళిపోయారు యీ పసిబిడ్డను వదిలేసి" అంది ఖాశింబీబీ.

"ఐతే నీకున్న పిల్లలు చాలరనా! దాన్నికూడ పెంచుతున్నావా ఖాశింబీబీ?" అని కోటమ్మ విస్తుపోయింది.

"మాతల్లిగదే! నీకు యింతమంది పిల్లాజల్లా వున్నా యింకో దిక్కులేని బిడ్డను దగ్గరకుతీశావు. నీ పేరు చెప్పుకుంటే పుణ్యమొస్తుంది"అని మునలమ్మ దీవించింది.

"ఇందులో గొప్పేముందిలే అమ్మా. మా! రెక్కలొచ్చేదాకా యింతగంజి పోస్తాం. తరువాత ఏ అయ్యదగ్గరో పాలేరుతనం పెడతాము. వాడి రెక్కల మీద వాడేబతుకుతాడు"అంది ఖాశింబీబీ.

"నీ కడుపు బంగారంగాను! నీ ఇంటాబంధాలకనా యింకోబిడ్డ పెంపకం. ఐతే ఖాశింబీ, ఈ పిల్లాడిని ఎక్కడికి తీసికపోతున్నావ్?" అని అడిగింది చుక్కమ్మ.

"తల్లిపాలు కుడిచేబిడ్డ. నిన్న అన్నం పెట్టాం. కడుపులో నొప్పేయేమో రాత్రి ఏడ్చాడు. ఆసుపత్రికి మందుకి తీసికెళ్తున్నా! మాటల్లోపడి మరచిపోయానమ్మా. మళ్ళీ డాక్టరుగారు వెళ్ళిపోతారు" అని ఖాశింబీబీ చకచకా వెళ్ళిపోయింది.

అమ్మలక్కలందరూ బీబీని మెచ్చుకుంటున్నారు. రామయ్య పెళ్ళాన్ని తిడుతున్నారు. ఇది నచ్చని కోటమ్మ అంది గదా:

"ఆస్తిపాస్తులు లేనివాళ్ళకి ఎంతమంది వుంటేఏం. ఇచ్చేదీలేదు. తెచ్చుకునేదిలేదు, ఎట్టిగా యింతకూడేస్తే కూలైనా నాలైనా వాళ్ళే బ్రతుకుతారు. రెక్కలొచ్చాక యే గొడ్లకాడో పెడితే యింత సంపాదించి పెడతారు. వాళ్ళదేంపోయింది. ఎవరైనా పెంచొచ్చు" అని కోటమ్మ వెళ్ళిపోయింది.

"అయ్యో! నీయిల్లు బంగారంకానూ! ఇంత చుప్పనాతి తన మెందుకే! మంచి ఎక్కడున్నా చెప్పుకుంటాము!" అని మునలమ్మ తెల్లబోయింది. "మాయదారిడబ్బు ఎంతపనైనా చేయించుతుంది. భాగాలు చీలతాయని రామయ్య పెళ్లాం కడుపుదించుకు చచ్చింది. ఏమీ లేని బీబీ యింకోరి పిల్లను పెంచుతూంది"

తేలెండు!

పి. రామమోహనశర్మ

రెండు కార్మికులార! లేలెండు ॥
రండు శ్రామికులార! రారండు॥
రెండు వందల యేండ్లు
దుండగీడుల క్రింద
దాసియై మనభూమి
నాశమై పోయింది.
తల్లిదుస్థితిబాప తరలండి!
తగవులన్నీమాని నడవండి ॥
అన్నిదేశాలందు
ఐక్యమైప్రజలంత
స్వాతంత్ర్యమునుగాంచి
సౌఖ్యాన్ని పొందారు
సంకెళ్ళు సడలించి కదలండి!
శత్రువుల తీర్పుగా నడవండి ॥
వేరువేరై పోయి
మనదేశనాయకులు
సామ్రాజ్య వాదులతో
మంతనాలాడారు.
మీ మాట పూర్తిగా మరచారు!
మీ ఆశలను వమ్ముచేశారు ॥
అన్న దమ్ములయుద్ధ
మందరికినష్టమని
పెద్ద నాయకులంత
విస్మరించిరినేడు.
వైరముల వలదంచు నేర్పండి?
మీ రంద రైక్యమై చెప్పండి ॥
యంత్రాలు నడిపించి
పంటలను పండించి
మనుజ జాతికిమీరు
ప్రాణాలు నిలిపారు.
మీశక్తి గుర్తెరిగి లేవండి!
మీ కర్తవ్యం తెలిసి రారండి ॥
కూడు గుడ్డలు లేక
మాడి సమ్మెలు చేస్తె
దిరసించి మిమ్ములను
వంచింప చూశారు.
నవశక్తి మూదంచు నడవండి!
స్వాతంత్ర్య దీక్షతో సాగండి ॥
అందరూ కలవండి
ఐక్యమై నిలవండి!
ముదముతో కదలండి!
ముందుకే నడవండి
అడ్డంకులను దీర్చి చెండండి!
స్వేచ్ఛగా నయనమై సాగండి ॥
ఝరులుగా పరుగెత్తి
నదులుగా ప్రవహించి
కెరటాలు కెరటాలు
గాలేది దుముకండి!
దాస్యాంధమును బాప సాగండి!
ఉదయాద్రి నెత్తిపై ఉరకండి ॥
స్వాతంత్ర్య భానుడు
ప్రాగ్వీధి ప్రసరించు
విప్లవారుణవర్ణ
రేఖలై తోచండి!
వీరజాతుల పుట్టి నిల్లండి!
భారతావని ఖ్యాతి నిలపండి ॥
రండుకార్మికులార! రారండు ॥
రండుశ్రామికులార! రారండు ॥

విజ్ఞానం - వికాసం

ఇతరులకు హానిచేసేది స్వాతంత్ర్యమేనా?

"సత్య"

"కమ్యూనిజం సూత్రాలు కొన్ని మంచివే. అందరూ సమానమే. అంటే నేను ఒప్పుకుంటాను. కాని కమ్యూనిస్టు సంఘంలో వ్యక్తి స్వాతంత్ర్యముండదు. అది చూస్తే నాకు అసహ్యం ఇతర విధాల ఎలావుంటేనేమిటి. వ్యక్తిస్వాతంత్ర్యంలేని విధానమంటే నాకు కిట్టదు—" ఈ ధోరణిలో చాలామంది మాట్లాడుతూ ఉంటారు.

ఈ వ్యక్తి స్వాతంత్ర్యమంటే ఏమిటి ఒక్కొక్కళ్ళు దీనిని ఒక్కొక్కలాగ అర్థంచేసుకొంటారు. అందువలననే ఒకే విషయం గురించి వేరు వేరు విధాలుగా ఉద్దేశాలు బయలు పడుతూ ఉంటాయి.

మానవసంఘంలో ఒకవ్యక్తి ఇతరులతో సంబంధము లేకుండా ఉండలేడు. పుట్టినప్పటినుండి చచ్చేవరకు ఒక మానవుడు ఇతరులమీద ఆధారపడి ఉంటున్నాడు. అతని ప్రతిచర్యకు ఇతరులతో ఏదో సంబంధముంటుంది. అతని ప్రతి కోరిక ఇతరులకోరికలతో మెలిపెట్టబడి ఉంటుంది. అటువంటప్పుడు అతని వ్యక్తి స్వాతంత్ర్యమన్నది ఇతరుల స్వాతంత్ర్యాలతో సంబంధం కలిగి ఉంటుంది.

ఇతరులకు హానిచేసేది స్వాతంత్ర్యంకాదు

ఒక మనిషి తన ఇంటిలో తాను కూర్చుని దానికి నిప్పు అంటించదలచుకున్నాడనుకోండి. అది అతడు కట్టించుకొన్న ఇల్లు. అందులో తానుమాత్రమే ఉన్నాడు. దానికినిప్పు అంటించుకొందుకు అతనికి హక్కు ఎందుకుండకూడదు? కాని ఆ పని చేశాడంటే అతని ఇంటితోపాటు చుట్టూఉన్న ఇతరుల ఇళ్ళుకూడా కాలుతాయి. బ్రతుకుదామనుకున్న వారికి తమఇళ్ళు తాము నిలుపుకోవాలన్న వారికి ఆ వ్యక్తియొక్కకోరిక భంగాన్ని కలుగచేస్తుంది. అటువంటి స్వాతంత్ర్యం ఆ వ్యక్తికి ఉండవచ్చా? అలాగే ఒక ఒకయజమాని తన మిల్లును తాను హఠాత్తుగా ఆపివేసుకునేహక్కు తనకు ఉన్నదనుకొన్న, ఆ హక్కు ఎంతోమంది ఇతర వ్యక్తుల ఆర్థిక పరిస్థితిని ఒక్కమారుగా పాడుచేసి, వారిస్వాతంత్ర్యాన్ని భంగపరుస్తుంది. అటువంటి హక్కు అతడికి ఉండవచ్చా?

ఒక పురుషుడు ఒక అందమైన స్త్రీని చూసి, ఆమె సాహచర్యం మభిలషించవచ్చును. కాని అంతమాత్రాన తనకోరిక నెరవేర్చుకో గలుగుతున్నాడా? తన కోరిక ఆమె ఇష్టానికి అనుకూల మయినప్పుడే నెరవేర్చుకుంటాడు. లేనిచో అతడు తనకోరిక నెరవేర్చుకొనే అవకాశంలేదు ఈ అవకాశం లేకపోవడాన్ని అతడు స్వాతంత్ర్యాన్ని గోల్పోయాడంటామా?

సమాన అవకాశమున్నప్పుడే స్వాతంత్ర్యం


వ్యక్తి స్వాతంత్ర్యములో ముఖ్యం ఒకడి స్వాతంత్ర్యం ఇంకొకని స్వాతంత్ర్యాన్ని ఏమాత్రంకూడా భంగపరచకపోవడమే. అందరికి సమానమైన స్వాతంత్ర్య ముండాలి. సమానమైన స్వాతంత్ర్య ముండాలంటే, సమానమైన అవకాశాలుండాలి. అవకాశాలులేకుండా కబుర్లతో స్వాతంత్ర్యముందంటే ప్రయోజనంలేదు ఒక మనిషికి కోరికలు కలిగి ఉండడానికి స్వేచ్ఛఉంటే చాలదు. ఆ కోరికలను నెరవేర్చుకునేందుకు తగిన అవకాశాలున్నప్పుడే, అతడికి నిజమైన స్వేచ్ఛఉన్నట్లు. అందువలన నిజమైన వ్యక్తి స్వాతంత్ర్యముండాలంటే, అందరికీ సమానమైన అవకాశాలు. స్వతంత్రత ఉండాలి:

కేపిటలిస్టు సమాజంలోని బూటకపు స్వాతంత్ర్యం

కేపిటలిస్టు సమాజంలోఉండే చెడుగులన్నీ కేపిటలిస్టు ఆర్థిక విధానంలోనే ఉన్నాయి. దీనివలన అనేకమంది తగిన అవకాశాలు లేక బాధలకు గురి అవుతున్నారు. బీదవాళ్ళ బీదతనము హెచ్చుయిపోతూ ఉంటుంది. చేసేదిలేక తాము కష్టపడి ఉత్పత్తిచేసిన విలువలను ఇతరులకు సమర్పించుకోవలసి వస్తూంది. కనుక ఒక్కపెట్టులో అనేకమంది క్రియా స్వాతంత్ర్యం పోయిందన్నమాట. సాధారణంగా సిద్ధాంత పూర్వకంగా ప్రతి మనిషికి తన ఇష్టము వచ్చినట్టు చేసుకొనే స్వాతంత్రముంటుంది. కాని ఆచరణలో ఆఖరికి చదువుకునేందుకైనా అవకాశం (అందువలన స్వాతంత్ర్యం) లేకుండా, కార్మికుడు పనియవ ఏటినుండి కష్టించి పనిచేసి, ఏరోజు పొట్టకూటికోసం ఆరోజు తను పట్టించిన విలువలను పెట్టుబడిదారుడి పరం చేయవలసి వస్తూంది.

అనేకమంది క్రియా స్వాతంత్ర్యాన్ని నాశనం చేస్తున్న ఈ విధానంలోని సిద్ధాంత పూర్వకమైన స్వాతంత్ర్యం వుత్త మోసం. అందరికీ సమానమైన అవకాశాలు, సమానమైన స్వాతంత్ర్యం ఉండాలంటే, ఉత్పత్తి పరికరాలు [illegible] రుల రెక్కల కష్టాన్ని అపహరించేదుకు వీలుగా కొద్దిమంది వ్యక్తులచేతుల్లో ఉండకుండా, సంఘంచేతుల్లో ఉండాలి. సంఘం అందరికీ పనినిచ్చే బాధ్యత తీసికోవాలి. అప్పుడందరికీ సమాన అవకాశాలు, సమాన స్వాతంత్ర్యం ఉండగలవు.

(మిగతా 10 వ పేజీలో)



గ్రంధావలోకనం

ప్రాచీన భారతీయ గంధ్రాలయ చరిత్ర

గ్రంధకర్త: కొడాలి లక్ష్మీనారాయణగారు. దొరకుచోటు: కొడాలి రాజారామమోహనరావుగారు. ఇతిహాస పరిశోధక మాల, మోపర్రు (వయా తెనాలి)

వెల రు 2–8–0

ఎందరో ప్రఖ్యాత పరిశోధకుల గ్రంధాలను అధ్యయనంచేసి, చాలాశ్రమతో వ్రాసిన గ్రంధం. గ్రంధకర్త, చాలవరకు తన అభిప్రాయాలను, వివిధ పరిశోధకుల గ్రంధాలనుండి ఉదహరించి చెప్పారు. గ్రంధకర్త అభిప్రాయాలతో ఏకీభవింపనివారూకూడా, వారి కృషిని అభినందించక తప్పదు.

భారతదేశంలో లిపి పుట్టినప్పటి నుంచి అచ్చుగ్రంధాలు వచ్చేవరకూ జరిగినపరిణామాన్ని, సులభంగా అర్థమయేటట్టు గ్రంధకర్త చెప్పారు. నేటిపెట్టుబడిదారీసమాజంలో కొందరు విజ్ఞానవ్యాప్తిని అరికడుతున్నట్టే, ఆ పాతరోజుల్లోకూడా చాదస్తంవల్లా, స్వార్థదృష్టివల్లా కొందరు విజ్ఞానవ్యాప్తిని అరికట్టడమూ, బౌద్ధమతాల అభ్యుదయకరమైన పాత్ర, వివిధ దశలలో భారతీయ విజ్ఞానమూ కళలూ ఎలాఅభివృద్ధిఅయాయో, ఇందులో చాలా చక్కగా చూపబడ్డాయి. ఈగ్రంథంలో ప్రజావిజ్ఞానాన్నికోరుతున్న యీకాలానికి, అంతర్గతమైన సందేశంవుంది.

కూలి బిడ్డ

రచయిత: శ్రీ పణితపు నాగభూషణం

వెల: 0–2–0

ఈనాటి సమాజంలో కూలీలు ఏ విధముగా బాధపడుతున్నారో తేటగీతి పద్యాలలో ఈ రచయిత చిత్రించాడు. బ్లాక్ మార్కెట్, జమీందారీ విధానం, బిర్లా నఫీల్డ్ సంధి, బిర్లాగారిమిల్లుల్లో కూలీలపై కాల్పులు, 1938 చీరాల, చిట్టివలస ఘటనలు, పిఠాపురం రాజాగారి షష్టిపూర్తికి పట్టాభిగారి ఆశీర్వాదం, మొదలైన వివిధ విషయాలు ఇందులో చర్చించబడినవి.

ఆంధ్రశిల్పి

సచిత్ర మాసపత్రిక సంపాదకులు: వి. ఆర్. చిత్రా. పి. గణపతిశాస్త్రిగార్లు 10 వరశింగపురంవీధి మౌంట్ రోడ్డు. మద్రాసు. విడిపత్రిక రు 0–12–0

చక్కని ఆకారమూ, అందమైన బొమ్మలూగల "ఆంధ్రశిల్పి" కి సుస్వాగతం. సభ్యతా, హేతుబుద్ధీ నానాటికి దిగజారిపోతూవున్న—తెలుగు పత్రికాలోకంలో, "ఆంధ్రశిల్పి" కొత్త ఆశల్ని కలిగిస్తోంది. ఇందులో పేరు పొందిన చాలమంది కవులూ కధకులూ కనిపిస్తున్నారు. అయినా సంక్షుబ్ధ మనస్థితిలో వున్న నేటిదేశానికిగాని—కనీసం తమ పాఠకులకుగానీ—వీరి రచనలు పాత సద్ధతుల్లోసాగుతూ యేమీ ఉపయోగం లేకుండా పోవడం విచారించవలసిన విషయం. ఈకొత్తపత్రికనుండిసరికొత్త రచనలు, యికనుండీ రావాలని ఆశిస్తున్నాము.

★ ఫిలిం రివ్యూ

డాక్టర్ కోట్నీస్

డైరెక్టరు: శాంతారాం

"డాక్టర్ కోట్నీస్" భారత చలనచిత్రరంగంలో ముఖ్యమైన చిత్రం. తక్కిన లోపాలెలావున్నప్పటికీ, కేవలంపచ్చి, వ్యాపార సరళిలో నడుస్తున్న మన చిత్రపరిశ్రమలో, దేశభక్తినీ అంతర్జాతీయతనూ ప్రబోధించే యిటువంటి కధావస్తువును తీసుకోవడమే, అభ్యుదయకరమైన విషయం.

చైనా భారతదేశాలపట్ల ఇంకెవరూ తీసుకరానంత సన్నిహితత్వాన్ని తీసుకవచ్చింది, డాక్టర్ కోట్నీస్ జీవితం. జపాను దండయాత్ర నెదుర్కొని చైనా ప్రజలు చేస్తున్న చావుబ్రతుకుల పోరాటంలో — వైద్యసహాయంలేక అనేకమంది చైనా సైనికులు నిస్సహాయంగా చనిపోతూ వున్నప్పుడు, డాక్టరు కోట్నీసూ, డాక్టరు బాసూ మొదలైన యితర డాక్టర్లూ చైనాదేశానికి అపారమైన సేవచేశారు. ఈరెండు దేశాలకూ అపారమైన స్నేహం కలిగించారు. ఈ యదార్థ కధావస్తువును తీసుకొని, కొంతవరకూ విజయవంతంగా ఫిల్ము తీసినందుకు, శాంతారాంను అభినందించక తప్పదు. కాని ఇంకోదేశ ప్రజలకోసం తన ప్రాణాల్నికూడా త్యాగం చేసిన కోట్నీస్ జీవితంలోని ఉత్కృష్టతను, మనం ఆశించినంతగా యీచిత్రం చూపలేకపోయింది. చైనా కమ్యూనిస్టుల త్యాగాలనూ వీరోచిత పోరాటాలనూ చూసి, కోట్నీస్‌లో వచ్చిన రాజకీయ పరిణామమూ (సభ్యత్వానికి డాక్టరు కోట్నీస్ పెట్టినదరఖాస్తును చైనా కమ్యూనిస్టుపార్టీ ఆమోదించింది.) ప్రజాసేవాపరతంత్రతా, సరిగా చూపినట్లయితే యీచిత్రం యింకా ఎన్నోరెట్లు బాగుండేది. ఇదిలేకపోవడంవల్ల చైనాప్రజలకోసం యీయన యెందుకోసం యిన్ని కష్టాలు పడుతున్నాడో తెలియలేదు. అదేవిధంగా ప్రేక్షకులను నవ్వించడంకోసం, గెరిల్లా నాయకున్ని బఫూన్‌గా తయారు చేయకుండావుండి కోట్నీస్‌కూ ఆయన చైనా భార్యకూ మధ్య నడచిన ప్రణయాన్ని కొంత శ్రుతిమించకుండా చేస్తే, యీచిత్రం యింకా రాణించి వుండేది.

— ఈ రా.

ప్రభుత్వం తెచ్చే కౌలుదార్ల చట్టాన్ని 1937 జూలై 14 నుండి అనువర్తింపజేయాలి

రెండు సం॥ శిస్తుచెల్లిస్తే బాకీరద్దయే అవకాశం వుండాలి

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి ప్రకటన

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ సందూరి ప్రసాదరావుగారు జమీందారీలలోని రైతుల, కవులుదార్ల రక్షణకై మద్రాసు ప్రభుత్వం తెస్తున్న శాసనముల గూర్చి యీక్రింది ప్రకటన చేయుచున్నారు.

ఎస్టేటు ల్యాండు ఆక్టు వర్తించే ప్రదేశాలలోని రైతులను, పై యెస్టేట్లలోని స్వంత కమతం భూములపైగల కవులుదార్లను, మలబారు జిల్లాలోని కవులుదార్లను.. భూమి నుండి తొలగించకుండా వుంచగలందులకు [illegible] (2) యెస్టేటులలోని అడవులను [illegible] రక్షితంగా అపుటకు మరొక బిల్లును మద్రాసు ప్రభుత్వం తాత్కాలిక చట్టములుగా చేయబోవుచున్నది. కాని నిజానికి యీబిల్లులు యింతకుముందు యెన్నడో రావలసినవి. [illegible] గడచే రైతుసంఘాలు యిట్టి చట్టములకై ఆందోళనచేశాయి. ఈనాటికైనా యిట్టి చట్టాన్ని తేగోరుతున్నందుకు మంత్రివర్గాన్ని అభినందించవలసియున్నది

ఈరెండు బిల్లులలోను, మొదటిది ఆక్టుగా ప్యాసైనవెంటనే అమలులోకివస్తుంది. రెండవ [illegible] నెండుంటుంది. [illegible] కాలాన్ని ప్రభుత్వంపొడిగించవచ్చు. ఇది అమలులోవుండగా జమీందారీలలోని రైతులను జమీంలోని స్వంతకమతం భూముల లోను, మలబారు జిల్లాలోను వున్న కవులుదార్లను భూములనుండి తొలగించరాదు. ఆ భూములను [illegible] డిక్రీ [illegible] అర్జీల్లవల్లగాని అమ్మకమునకు తెచ్చుటకు వీలులేదు. శిస్తుబాకీలకుగాని, మరి యితర కారణముల వల్ల గాని, భూములనుండి రైతులను, కవులు దార్లను తొలగించుటకు జరుగుచున్న దావాలు, ఆక్టు వచ్చేనాటికి అమలు జరగకుండావుండే కోర్టు డిక్రీలు, ఆక్టువచ్చిన తర్వాత కొత్తగా వచ్చే దావాలు కొన్ని షరతులకు లోబడి ఆపుచేయబడతాయి. ఆ షరతులు యేమంటే - శిస్తు బాకీకు దావా జరుగుతూవుంటే, ఆ దావా మొత్తముగాని, లేక దావా ప్రారంభమునాటికి ముందురెండు సంవత్సరముల శిస్తుగాని డిక్రీ అయినపక్షంలో డిక్రీ మొత్తంగాని, లేకఆక్టు అమలులోనికి వచ్చేనాటికి గత రెండు సంవత్సరముల శిస్తుగాని ఏది తక్కువయితే దానిని ఈఆక్టు అమలులోనికి వచ్చిన రెండు మాసములలోగా రైతుగాని కవులుదారుగాని కోర్టులో డిపాజిట్టుకట్టాలి. పైవిధంగా సొమ్ము డిపాజిట్టు చేయనియెడల కోర్టు మామూలు వ్యవహారశాంత జరుపుతుంది.

దీనిలోని ముఖ్యమైన లోపమేమంటే ఈబిల్లుఆక్టుగా ప్యాసయినాటినుండి మాత్రమే అమలులోనికి వస్తుందనడం. క్రిందటి పర్యాయం కాంగ్రెసుమంత్రివర్గం అధికారములోకివచ్చిన నాటినుండిజమీందార్లకు భూస్వాములుఆడవులను అన్యాక్రాంతము చేసినారు. సాముదాయక భూములను, పోరంబోకులను చెర్వు గర్భాలను దౌర్జన్యంగా ఆక్రమించారు. రైతులను, కవులుదార్లను భూములనుండి అన్యాయంగా వెళ్ళగొట్టినారు. ఇట్టి దురాక్రమణలను, అన్యాక్రాంతములను గురించి ప్రకాశంకమిటీ విచారణసందర్భంలో అనేక గ్రామాల రైతులు మొరబెట్టుకున్నారు. కొన్ని సందర్భాలలో కాంగ్రెసుమంత్రివర్గం [illegible] వున్నయుదకలేదని మంత్రివర్గం అధికారంనుంచి దిగిరాగానే యిట్టి అన్యాక్రాంతములకు పూనుకున్నారు. అందుచేత యీ ఆక్టు కాంగ్రెసు మంత్రివర్గం క్రిందటి దఫా అధికారంలోకి వచ్చినప్పటినుంచి అనగా 1937 జూలై 14 నుంచి వర్తింప చేయాలి: అప్పుడే యీ బిల్లులోని ఉద్దేశ్యం నెరవేరుతుంది. రైతులకు వుపయోగంగా వుంటుంది.

మరొక సవరణ యేమంటే దావాబాకీలను గాని, డిక్రీ మొత్తాలనుగాని, లేక రెండు సంవత్సరముల శిస్తునుగాని కోర్టులో కట్టబడుటకు యిచ్చిన వ్యవధి రెండుమాసములు మాత్రమే. గర్భదారిద్ర్యంలో నలిగిపోతున్న బీదరైతాంగం యీ స్వల్పకాలంలో డబ్బును తేజాలరు. అందుచేత యీవ్యవధిని 6 మాసములుగా మార్పుచేయాలి. ఆ తరువాతనైనా దావా జరుగుచుండగాగాని, డిక్రీ అమలు జరుపుచుండగాగాని డబ్బు డిపాజిట్టు చేసే యెడల అట్టి దావా డిక్రీలుగూడా అపుచేయబడాలి.

ఇంకొక విషయమేమంటే ఒకే రైతుపై ఒకేభూమికి తేబడ్డ ప్రతి ఒక్కదావా డిక్రీకి, డిక్రీ [illegible] మొత్తముగాని, [illegible] రెండు సంవత్సరంతియ [illegible] అన్నింటి డిక్రీల [illegible] ము శిస్తు చెల్లిస్తే [illegible] అవకాశం కలిగించాలి.

లోగడ [illegible] కాంగ్రెసు మంత్రివర్గమేర్పాటుచేసిన [illegible] ప్రాప్పు [illegible] అనుసరించాలి.

ఇంక రెండవబిల్లు [illegible] 15, 1946 నుండి అమలులోకి వస్తుంది. కాని ఇదివరకే పైన తెల్పిన కారణంవల్ల 1937 జూలై 14 నుండి వర్తింప చెయ్యాలి. [illegible] విధ్వంసములో, పోరంబోకులను చెర్వుగర్భాలను వెళ్ళగొట్టబడిన చేర్చాలి.

పైసూచించిన సవరణలతో ఈ రెండు బిల్లులను వెంటనేఆక్టులుగా తీసుకొనిరావాలని మద్రాసు మంత్రివర్గాన్ని కోరుతున్నాము. ఈ సవరణలను పొందుపరుస్తూ ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం యిచ్చిన మెమోరాండమును బలపరుస్తూ ఆంధ్రరైతాంగమంతా మద్రాసు అసెంబ్లీ స్పీకరుకు వెంటనే టెలిగ్రాములు పంప గోరుచున్నాను.

రైతు స్వాధీనంలోవున్న లంకభూముల్ని అక్రమంగా చల్లపల్లి జమీందారు ఆక్రమిస్తున్నాడు

జమిందారి బిల్లు [illegible] కముందే అమ్ముకోవాలని ఎత్తులు

దివి తాలూకా రైతుసంఘ సహాయ కార్యదర్శి కావూరి కుటుంబరావుగా రిలా వ్రాస్తున్నారు:

హిందూ, ముస్లిం రాజుల పరిపాలనా కాలము నుండి గూడ భూమిపై హక్కు సాగుచేసే రైతుదే. జమీందారులు సర్కారు శిస్తు వసూలుచేసి తన కమీషన్ తీసికొనుట కేర్పడిన యేజెంట్లు మాత్రమే. స్వంత కమతం భూములు మాత్రము తమ స్వాధీనములో వుంచుకొనవచ్చును. ఎస్టేట్ లాండ్ ఆక్టు ప్రకారము ఒకప్పుడు రైతు భూములుగానున్న భూములను జమీందారు యే విధంగా ఆక్రమించినప్పటికి సదరు భూములకు కమతం స్వరూపం రాదు.

లంకభూములు ఆక్రమణ

దివి తాలూకా చల్లపల్లి యెస్టేటులోని పోతవరం లంక, గాజుల్లంక గ్రామాల భూములు కృష్ణానది వరదలచే విరిగి నదిలో కలసిపోవడం తిరిగి మెరక వేయడం జరుగుతోంది. తిరిగి మెరకవేసిన వేలకొలది యకరముల భూములను జమీందారు ఆక్రమించుచున్నాడు. 1850 సం॥ రంలో ఇనామ్యాయల్ దొరచే తయారుచేయబడ్డ లెక్కలను బట్టి పోతవరం లంకలో 15 యకరములు స్వంతభూమి మాత్రం జమీందారు కున్నది. ఏనాడూ జమీందారు స్వంతముగ సెంటు భూమి గూడ సాగుచేసినది లేదు.

లంకభూముల అమ్మకం

రైతులకు భూమినిసాగుచేస్తేనేగాని తిండిలేదు. దీనిని అదనుగా తీసికొని జమీందారు గ్రామాలలో [illegible] కలుపెట్టి, అమాయక రైతాంగాన్ని మోసగించి, తానాక్రమించినభూమినిపాటకు పెట్టాడు. పాట మొత్తములు సామాన్యముగా యకరం1కి రు 50 లు మొదలు 1వేయి రూపాయలవరకు ప్రతి సంవత్సరం గుంజుతున్నాడు. 1937 సం॥ రము చల్లపల్లి యెస్టేటుకు 8½ లక్షలు శిస్తు రూపేణావస్తే యీ రోజు 6 లక్షలకు పైగా వస్తోంది. పైగా ఆదాయం వచ్చిన 8½ లు॥ రూపాయలు యీకొద్ది లంకల గ్రామాల నుండి పిండుతున్నాడంటే యెంత అన్యాయమో తెలుస్తుంది.

ఈపాటలు పెట్టి యిచ్చే భూములకు గూడ కవులు కత్తులుండవు. రైతులిచ్చిన డబ్బుకు రశీదులుండవు. పచ్చగడ్డి పాటలకని వ్రాయించుకొనుటయో, డబ్బు అప్పుగా తీసికొన్నట్లు నోటులు వ్రాయించుకొనుటయో, లేక పంటమీద కాపలా వేసి డబ్బు వసూలు చేసికొనుటయో చేస్తున్నాడు. జమీందారు ఎందుకు యీ అక్రమపద్ధతులవలంబించాడు. ఈభూములకు కవులు కత్తులేలవ్రాయడు? నోట్లు యెందుకు వ్రాయించు కొంటున్నాడు? ఇందులోనే జమీందారుకు లంక భూములపై హక్కులేదనే బహిరంగ రహస్యమిమిడి యున్నది. అయితే ఇంతకాలం నుండి వీరంతుక బ్రిటిష్ ప్రభుత్వ అనరాతీసికొని యీ అక్రమాలు చేశాడు.

జమీందారీబిల్లు త్వరలో రాబోతోందని, యీ అన్యాయపు వసూళ్ళుచేయ వీలులేదని, అనాదినుండి సాగుచేయుచున్న రైతులను భూములనుండి తొలగించి, యీ భూముల నమ్ముకోజూస్తున్నాడు. జమీందారు రివాజువారి శిస్తు [illegible] చేసికొనవలసినవాడే గాని [illegible] అమ్ముకొనుట చట్టవిరుద్ధం.

కావున [illegible] రైతులకు గూడా వక్రమనుగ రశీదులివ్వుటలేదు. గ్రామాలకు గ్రామాలకు మధ్య తగవులపెట్టి, జమీందారు హక్కు లేకుండానే, అమ్ముచున్న యీ భూమిని కొని మోసపోవద్దని, భూములు కొనుటకు జమీందారుకుడబ్బు యిచ్చి రశీదులుపొందని రైతులుముందు యిబ్బందుల పాలౌతారని హెచ్చరించుచున్నాము.

కర్తవ్యం

ది 14–8–46 తేదీ ఎసెంబ్లీ సమావేశములో ప్రధాని శ్రీ ప్రకాశం పంతులుగారు జమీందారీ బిల్లు తెచ్చులోపుగా జమీందారులు రైతుల కవర్థకమయ్యే పనులుచేయకుండా నివారించుటామని, రైతులకు ఏమాత్రం సహాయం అవసరమో, అంతా గూడ చేయదలచామని చేసినవాగ్దానము నాచరణలోపెట్టి సాగుచేయుచున్న రైతులను భూములనుండి తొలగిరచకుండామా, జమీందారు అక్రమంగా రైతుభూమిని అమ్ముకొనకుండామూ అరికట్టి రైతుల హక్కులను కాపాడగోరుతాము.

లంకల రైతులకు జరుగుచున్న అన్యాయానికి అసమ్మతి తెలుపుచుగ్రామగ్రామాన సభలుపెట్టి ప్రభుత్వానికి తీర్మానములు పంపాలని రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

ప్రజలధనంలో ప్రజాపీడకులైన పోలీస

అడ్వయిజర్ల అడుగుజాడలలో

• పోలీసు సిబ్బందిని పెంచుతారు

• అదనంగా మిలిటరీ రిజర్వులను పెడతారు

• పోలీసుశాఖకు మోటార్లు ఆయుధాలు ఎక్కువచేస్తా

ప్రకాశం మంత్రివర్గం రోజురోజుకు ఎట్టి నిరంకుశ పోలీసురాజ్య పంథాలోకి దిగజారుతున్నదో శాసనసభలో పోలీసుగ్రాంటుమీద జరిగిన చర్చ, చర్చకు ప్రకాశంగారు ఇచ్చిన జవాబులతో మరింత దృఢపడింది.

"పరిపాలనకు సంబంధించినంతవరకూ ప్రభుత్వమే పోలీసు పోలీసే ప్రభుత్వం" అనే స్థితికి ప్రధాన మంత్రిగారువచ్చే, మన రాష్ట్రానికి, రాష్ట్రప్రజాజీవితానికి ఎంత ప్రమాద పరిస్థితిని మంత్రివర్గం కల్పించుతూందో దేశభక్తులందరినీ తీవ్రంగా ఆలోచించమని కోరుతున్నాను.

పోలీసు గ్రాంటు

ఈ సంవత్సరం పోలీసుగ్రాంటుక్రింద 1 కోటి 34 లక్షలు ఖర్చు అదనంగా నిర్ణయించబడింది. క్రితపటి సంవత్సరం పోలీసు ఖర్చు రు. 2,05,73,747 అయితే ఈ సంవత్సరం రు. 3,81,78,200 యిదిగాకుండా, సివిల్ డిఫెన్సు పేరుతో రాష్ట్రమంతటా సాయుధ పోలీసు రిజర్వులను నిర్మించడానికి అదనంగా కొన్ని లక్షలు. మొత్తం అంతా కల్పితే, ఈ సంవత్సరం పోలీసులక్రింద అదనంగా ఖర్చు అయేది 1 కోటి 34 లక్షలు.

వ్యవసాయానికి 1 కోటి 70 లక్షలు. వైద్యానికి, 1 కోటి 40 లక్షలు, ఆరోగ్యానికి, 1 కోటి 12 లక్షలు, కరువు నివారణకు, 1 కోటి 6 లక్షలు నిర్ణయించిన బడ్జెటులో పోలీసు గ్రాంటుక్రింద 3 కోట్ల 81 లక్షలు నిర్ణయించబడింది.

ఈ సంవత్సరం ప్రభుత్వ యంత్రానికి, పోలీసులకు కలిపి మొత్తం ఖర్చులో 4 వ వంతు అవుతుంది. ఈ సంవత్సరం మొత్తం ఖర్చు పెట్టబోయే రు. 57 కోట్ల 43 లక్షలలో ప్రభుత్వ యంత్రానికే 12 కోట్ల 67 లక్షలు: ప్రజోపకారకమైన కార్యాలకోసం పైనే కొన్ని సంఖ్యలిచ్చాను. ఇంకా కొన్ని చూడండి: ఇర్రిగేషన్‌కు 3 కోట్ల 93 లక్షలు వైద్యం, ఆరోగ్యం కలిపి 5 కోట్లు: వ్యవసాయం పశువైద్యం కలిపి 2 కోట్లు: పరిశ్రమలకు 1 కోటి 38 లక్షలు, విద్యుచ్ఛక్తికి 63 లక్షలు మాత్రమే.

పై సంఖ్యలనుబట్టి పోలీసులకు, ప్రభుత్వ యంత్రానికి బడ్జెటులో ఎట్టి ప్రథమస్థానం ఇవ్వబడిందో చూసిన తర్వాత, ప్రకాశంగారి బడ్జెటు ప్రజా బడ్జెటు ఎలా అవుతుంది?

ప్రజలు కోరేదేమిటి?

పోలీస్‌శాఖ విషయంలో ప్రజలు కోరేదేమిటి? ప్రభుత్వ యంత్రాన్ని దౌర్జన్యంతో కాపాడుటకు, ప్రజా స్వాతంత్ర్య ఉద్యమాలను నాశనంచేయడానికి ప్రధాన ఆయుధంగా ఉపయోగించడానికై ప్రజలతో సంబంధంలేని పోలీసు దళాన్ని బ్రిటిషువాళ్ళు నిర్మించారు. ప్రజా మంత్రివర్గం సామ్రాజ్యవాదుల నిరంకుశ మార్గానికి స్వస్తిచెప్పి, ప్రభుత్వ యంత్ర ఖర్చును, పోలీసు దళాల ఖర్చును తగ్గించి, ప్రజలను హింసించే పోలీసులుగాక, ప్రజాసహకారంతో ప్రజలతో సంబంధంగల పౌరరక్షణ దళాలుగా పోలీసులు పనిచేసే మార్గాన్ని అనుసరించాలని ప్రజలంతా కోరుతారు.

తిండి, గుడ్డలేక నానాబాధలు పడుతూ, లంచగొండితనానికిదిగే రు 16 జీతాలుగల సామాన్య పోలీసులకు జీతాలను హెచ్చించి ప్రజాసేవకులుగా వారిని తయారు చేయాలని అంటారు.

గత 25 సంవత్సరాలనుంచి ప్రతి స్వాతంత్ర్యపోరాటాన్ని క్రూరంగా, అమానుషంగా అణగ ద్రొక్కడానికి ప్రత్యేకంగా నిర్మించబడి, సాధారణ పోలీసు దళాలనుంచి దూరంగా వుంచబడిన, ప్రత్యేక మలబారు పోలీసు దళాన్ని రద్దుచేయాలని కోరుతున్నారు. ఒకప్పుడు ప్రకాశంగారే యీ కోర్కెను బలపరిచారు.

యూరపియన్ సార్జెంట్లు మనదేశంనుంచి పోవాలని, ఈలోపల యూరపియన్లకు, ఆంగ్లో ఇండియన్లకు, భారతీయులకు గల భేదాలు తొలగాలనిగూడ కోరుతున్నారు.

ప్రజానీకం అంతాకోరే పై మార్గాలనన్నిటిని ప్రకాశం మంత్రివర్గం కాలదన్ని, అడ్వయిజర్ల అడుగుజాడల ననుసరిస్తోంది. ఈ క్రింది వివరాలు దీన్ని ధృవపరుస్తాయి:

ప్రకాశంగారి పోలీసు ప్లాను

ప్రకాశంగారి ప్లానుక్రింద రాష్ట్రమంతటా పోలీసు సిబ్బంది ఎక్కువ చేయబడుతోంది. మలబారు స్పెషల్ పోలీసులపై గత సంవత్సరం రు 2 లక్షల 88 వేలు ఖర్చు అయింది. ఈ సంవత్సరం 5 లక్షల [illegible] వేలు, అనగా రెట్టింపు చేయబడింది. ఇంతేగాక్షి, త్వరగా, వేగంగా కదలి పనిచేయడానికి పోలీసు విధానాన్ని మోటరైజ్ చేయటానికి రు. 20 లక్షల ఖర్చును నిర్ణయించారు. ఆయుధాలను, మందుగుండు సామగ్రిని ఎక్కువ చేయడానికి నిర్ణయించారు. వీటితోపాటు రాష్ట్రంలోని ముఖ్య కేంద్రాలన్నిటిలో సాయుధ దళాల రిజర్వులను, వారికి కావలసిన బారెక్సును పట్టణాల మధ్య నిర్మించడానికిగూడా ప్రకాశం మంత్రివర్గం నిర్ణయించింది.

ఈ సాయుధ దళాల రిజర్వులన్నీ రక్తపాతానికేగా?

సివిల్ డిఫెన్సు పేరుతో ఈ క్రింది ప్లానును అమలు చేయబోతున్నారు.

(1) ఉత్తర గోదావరి డివిజన్ రాజమండ్రిలో అదనపు సాయుధ దళాల రిజర్వుకై 52 ఇళ్ళతో తాత్కాలిక బారెక్సు నిర్మాణానికి ఖర్చు రు. 75,000.

(2) పశ్చిమ గోదావరి జిల్లాలో సాయుధ రిజర్వు దళాలకై 157 ఇళ్ళతో తాత్కాలిక బారెక్సు నిర్మాణానికి ఖర్చు రు. 30,000.

(3) గుంటూరు డివిజన్ గుంటూరు జిల్లాలో సాయుధ రిజర్వుదళాలకి 148 ఇళ్ళతో తాత్కాలిక బారెక్సు నిర్మాణానికి రు. 10.0000.

(4) బళ్ళారి డివిజన్: అనంతపూరులో అదనపు సాయుధ దళాల రిజర్వుకై 20 దాదాపు శాశ్వతమైన బారెక్సు (200 కాన్‌స్టేబుల్సుకు, 22 హెడ్ కాన్‌స్టేబుల్సుకు) రు. 46,000.

(5) కర్నూల్ డివిజన్ కర్నూలులో 62 సాయుధ పోలీసులకుతాత్కాలిక బారెక్సుకై రు. 67,000.

(6) మదనపల్లి డివిజన్ చిత్తూరులో 56 సాయుధ పోలీసులు, 8 హెడ్సుకు, 1 హవాల్దారు మేజరుకు బారెక్సు రు. 50,000.

★ కంభంపాటి సత్యనారాయణ (జూనియర్)

(7) మదనపల్లి డివిజన్ చిత్తూరులో ప్రెసిడెన్సీ జెనరల్ రిజర్వుకు సాయుధ రిజర్వుదళాలకు 167 ఇండ్లతో బారెక్సు రు. 2,00,000.

(8) మదనపల్లి డివిజన్ కడపలో ప్రెసిడెన్సీ జెనరల్ రిజర్వుకై 180 ఇండ్లతో బారెక్సు రు. 1,80,000

(9) చెంగల్పట్‌లో సాయుధ దళాలకై పక్కా బారెక్సు రు. 3,00,000

(10) నెల్లూరు డివిజన్ సాయుధ దళాలకు, సెక్యూరిటీ గార్డులకు బారెక్సు రు. 4,00,000

(11) తిరునల్వేలి డివిజన్ పామ్‌కోటలో సాయుధదళాల బారెక్సు రు. 80,000

పైవిధంగా రాష్ట్రమంతటా రక్తపాతానికై సాయుధ రిజర్వు దళ కేంద్రాలను నిర్మించే సన్నాహంలో ఉంది కాంగ్రెసు మంత్రివర్గం.

మద్రాసు సిటీ విషయం చెప్పనే అక్కరలేదు సిటీ పోలీసు ఫోర్సునంతా ఎక్కువ చేయటానికి, సాయుధ మోటారు దళాల నిర్వహణానికి మొత్తం అంతా కలిసి ఈ సంవత్సరానికి అయ్యే ఖర్చు 12 లక్షల 80 వేల రూపాయలు:

సామాన్యపోలీసుల జీతాలను హెచ్చించి, వారి జీవిత పరిస్థితిని విజ్ఞానాన్ని వృద్ధిచేసే మాటే లేదు ప్లానులో. ఇటువంటి ఘోరమైన పోలీసు ప్లానుపై శాసన సభలో జరిగిన చర్చలకు వస్తాం.

శాసనసభలో కాంగ్రెసు సభ్యులు

సామ్రాజ్యవాదుల తొత్తులుగా నియమింపబడిన నేటి పోలీసు దళాల పాశవిక చర్యలను ఖండిస్తూ వాటిని రద్దుచేయాలని కాంగ్రెసు సభ్యులైన కోపల్‌రావ్ పట్టాభిరామమంత్రివర్గ ప్లానును ఖండించారు. ప్రజలను, కార్మికులను హింసించడానికి ఉన్న మలబారు పోలీసు దళాన్ని రద్దుచేయమన్నారు.

1942 లో బ్రిటిష్ ప్రభుత్వం పోలీ[illegible]

పోలీసులకు ప్రకాశంగారు తల

కార్మికుల కోర్కెలలోని న్యాయాన్ని గ

కామ్రేడ్ పిల్లమర్రి, యం. ఆర్. వెంకట్రామన్

మద్రాస్, సెప్టెంబరు 4

కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు ఎమ్. ఎల్. ఏ. క్రింది విధంగా ప్రకటిస్తున్నారు.

"ఎస్. ఐ. రైల్వే సమ్మె సందర్భంలో అనేక ప్రదేశాలలో అరెస్టులు, దౌర్జన్యాలూ విచ్చలవిడిగా సాగుతూన్నట్టు తంతివచ్చింది.

"దిండిగలులో సమ్మెచేస్తూన్న కార్మికులకు రేషన్లు ఇవ్వనిరాకరించారు. సమ్మె చేస్తూన్న వారికుటుంబాల పరిస్థితుల్ని పరామర్శించడానికి వెళ్ళిన 5 గురు స్టేషన్ మాస్టర్లను రామ్నాడ్ జిల్లాలో అరెస్టుచేశారు. వారికి జామీనుకూడా ఇవ్వలేదు. తిరుచునాపల్లిలో సమ్మెకు అనుకూలంగా ప్రచారంచేసినందుకు 17 గురు స్త్రీలకు కఠినశిక్షలు విధించారు. రాజాజీ ప్రధానిగా వున్న రోజుల్లో కాంగ్రెస్ జెండా లాగివేసిన హారిసనే నేడు కామ్రేడు కల్యాణసుందరంకుమార్తె శవాన్ని స్మశానవాటికికూడ తీసుకుపోకుండా, అడ్డుకొట్టాడు. పేలంలో రైల్వే కార్మికసంఘంయొక్క అధ్యక్ష, కార్యదర్శులను అరెస్టుచేశారు. కార్మికులపట్ల సమ్మెయెడ బహిరంగంగా సానుభూతి చూపిన పైవారందరినీ కూడా పనిలోకి పోతూన్నవారిని అడ్డగిస్తున్నారని దొంగకేసులు బనాయించి అరెస్టు చేస్తూన్నట్లు అనేక ప్రదేశాలనుంచి నాకు వార్తలు వచ్చాయి.

పోలీసుల ఈనిర్బంధవిధానాన్ని వెంటనే ఆపాలి దౌర్జన్యచర్యలన్నింటిపై విచారణ చెయ్యాలి. ప్రధాని ప్రకాశం పోలీసులను తెగ పొగుడుతున్నారు. ఇది ప్రజలే చేసుకుని, పోలీసు దౌర్జన్యాలపై జరిగేటట్లు మంత్రులపై వొత్తిడి తేవాలి

అప్రతిష్ఠనుంచి మంత్రివర్గాన్ని కాపాడండి

మద్రాసు, సెప్టెంబరు

తమిళనాడు కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి ఎమ్. ఆర్. వెంకట్రామన్ ఈవిధంగా ప్రకటిస్తున్నారు.

"పోలీసు గ్రాంటుపై చర్చ సమయాలలో ప్రధాని ప్రకాశంగారు మామీద విరుచుకుపడ్డారు.

"రైల్వే సమ్మె, మ్యునిసిపల్ కార్మికుల సమ్మె, మొదలయినవి అవకాశంగా తీసుకొని పోలీసులు వీరవిహారం సాగిస్తున్నారు హెచ్చరికైనా యివ్వకుండా, మధురలో తుపాకులు కాల్చారు. అనేకచోట్ల తీవ్రంగా లాఠీలు విసిరారు. ఎందర్నో కమ్యూనిస్టుల్ని అరెస్టు చేశారు. ఇప్పటివరకు తమిళనాడులో [illegible] మంది కమ్యూనిస్టులు 200 మంది [illegible]రూ అరెస్టు చేయబడివున్నారు.

కమ్యూనిస్టు బెదురును చూపి, ప్రభుత్వం [illegible]ంది రైతు-కార్మిక సేవకుల్ని అరెస్టు [illegible]. కమ్యూనిస్టులు ప్రోత్సహిస్తూన్నారనెపంచూపి, ప్రకాశంగారు కార్మికులకు [illegible]ం తలపెట్టారు. విషయాలు తెలుసు నిరాకరిస్తూన్నారు. కార్మికుల కోర్కెలలో వున్న న్యాయాన్ని గుర్తించడంలేదు. [illegible]గపోయిన 6 ఏళ్ళుగా కార్మికుల్ని అణచి[illegible], ప్రజల్ని దోచుకుతిన్నవారికి ప్రకాశం[గారు] ఈ విధంగా తోడ్పడుతున్నారు.

"కమ్యూనిస్టులు తన్ను పడగొట్టాలనుకుంటున్నారని, తనను సవాలుచేశారని ప్రకాశంగారికి ఓతిక్క ఏర్పడింది. ఇది ఆయనను ఎక్కడికి ఈడ్చిందో చూడండి 1930, 32, 42 ల నాటి దౌర్జన్యాలు చేసిన పోలీసులకు హామీ యిచ్చేస్థితికి తెచ్చింది. కాంగ్రెస్‌యొక్క ప్రజాసేవమీద సవాలు చేసినది నిజానికి రైన్నాల్డ్సు. వారికే నేడు [ప్ర]కాశంగారు తలవొంచారు. నిర్బంధ విధానము స్వేచ్ఛగా సాగిపోతూంది. ప్రకాశం[గారు] దానిమీద కాంగ్రెసు ముద్రవేశారు. ప్రజలు ఈదారుణాన్ని గుర్తించి, కాంగ్రెసు మంత్రుల్ని అప్రతిష్ఠనుంచి కాపాడాలి."

[ద]ళాలకు 1 కోటి 34 లక్షల అదనపు ఖర్చు

కాంగ్రెసుమంత్రుల పోలీసుప్లాను

దళాలతో ప్రజలమీద జరిపిన హింసాకాండను చూసిన తరువాతనైనా ప్రస్తుత పోలీసు దళాలను వెంటనే రద్దుచేసి, ప్రజలతో సంబంధంగల పౌరరక్షక దళాల నిర్మాణానికి పూనుకొని జాతీయపరం చేయుట అవసరం అని [illegible]పత్తి వెంకట సుబ్బయ్యగారు సూచించారు.

ఇతర కాంగ్రెసు సభ్యులు చాలామంది [పోలీ]సుల అత్యాచారాలను వర్ణించి వాటిని [ఆప]ట్టాలని, పోలీసు పాశవిక చర్యలనన్ని[టిని ఖం]డించాలనీ. వాటివల్ల నష్టపడినవారికి నష్ట[ప]రిహారం ఇవ్వాలని కోరారు. సామాన్య పోలీసుల జీతాలను పెంచాలని కోరారు.

పోలీసులకై ప్రభుత్వం తలపెట్టిన అదనపు ఖర్చును ఖండిస్తూ యన్. యస్. వరదాచారిగారు ప్రస్తుత పోలీసు దళాలకు విజ్ఞాన సంస్కరణ కావాలన్నారు. వరదాచారిగారు తప్ప మరెవరు ఈఅదనపు 1 కోటి 34 లక్షల [ఖ]ర్చును ఆపాలని గట్టిగా అడుగుటకు ముందుకు రాలేదు. కాని కాంగ్రెసు వాదుల ఉపన్యాసాలన్నీ వింటే, పోలీసులపట్ల మంత్రివర్గం చూపిస్తున్న వైఖరిని తీవ్రంగా నిరసిస్తున్నారని బోధపడుతుంది.

పోలీసుప్లానుకు లీగర్ల మద్దతు

పోలీసు సిబ్బందిని ఎక్కువ చేయడానికి లీగు సభ్యులంతా తలలు ఊపారు. రాష్ట్రమంతా పోలీసు దళాలు హిందూ-ముస్లిం పేద ప్రజలమీద సాగిస్తున్న రక్తపాతం వీరెవరికి పట్టలేదు. రాష్ట్రమంతా ఖండిస్తున్న మలబారు పోలీసులు అపారసేవ చేస్తున్నారని నీరిసాహెబ్ పొగిడారు; వారికింకా మంచిజీతాన్ని కల్పించాలన్నారు. లీగ్ పార్టీ నాయకులు ఇస్మయిల్, హమీద్‌ఖాన్, హుస్సేన్, రజాఖాన్, అన్వార్, పోకర్, అలీబేగ్ అంతా ప్రకాశంగారి ప్లానుకు పల్లవి పాడారు.

కాని కాంగ్రెసును లీగు వ్యతిరేకించాలిగా మరి! పోలీసుదళాల్లో మహమ్మదీయులకు ఎక్కువ ఉద్యోగాలు లేవని లీగు విమర్శ! రాష్ట్రప్రజలంతా కరువుతోపాటు పోలీసు రాజ్యంక్రిందికి వస్తుంటే లీగుపార్టీకి మాత్రం మత వ్యతిరేకతయే ప్రధానం, ప్రజాక్షేమం దానితరువాత!

అలీబేగ్ పోలీసు కేసులను మధ్యలో ఉపసంహరించడంవల్ల పోలీసు డిపార్టుమెంటుకు అప్రతిష్ట వస్తోందని, అలా ఉపసంహరించ గూడదని శాసనసభలో గూడా పోలీసు వాదనచేశాడు.

యూరపియన్ల నిరంకుశవైఖరి

ఇంకా మన దేశాన్ని జలగలవలె పట్టుకొని పీడిస్తున్న యూరపియన్ల తరపున వారి పార్టీనాయకుడు టాను ఎంత ధైర్యంతో మాట్లాడగల్గుతున్నాడు!

మద్రాసు పోలీసులు ప్రభుత్వ సేవలో పేరు పొందారని అట్టివారికి ప్రోత్సాహాలు ఎక్కువచేసి కాపాడాలని ప్రారంభించాడు. ఏ ప్రభుత్వం అధికారంలోకివస్తే వారికి సేవ చేయడానికే పోలీసు దళాలని సామ్రాజ్యవాదుల వైఖరిని సిగ్గులేకుండా పొగిడాడు. బుద్ధిలేకుండా ఒక పశుబలంగా వుంచి ప్రజలను హింసించడానికే పోలీసులు అని టాను అభిప్రాయం

పోలీసుల ప్రవర్తనను ఖండించేవారు అశాంతికి కారణమవుతూన్నారని అట్టివారిని శిక్షించాలని పోలీసులకు భద్రతారక్షణలు ఎక్కువ చేయాలని పోలీసు సిబ్బందిని ఎక్కువ చేయాలనిగూడ వాదించాడు

దక్షిణ ఇండియాలో యూరపియన్ మిల్లులకు, పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహించే టానుకు కార్మిక ఉద్యమాన్ని నాశనం చేయుటకు అదనంగా పోలీసు సహాయంకావచ్చు కాని భారతదేశ శాసనసభలలో 1946 లో ఈ విధంగా యూరపియన్ ప్రతినిధులు మాట్లాడగల్గటానికి ధైర్యం ఇచ్చేది ప్రకాశంగారి పోలీసుప్లానుగాక మరేమిటి?

కమ్యూనిస్టుల ఖండన

శాంతిభద్రతల పేరుతో పోలీసుదళాలను న్యాయమయిన సమ్మెలను భగ్నంచేయుటకు రక్తపాతాన్ని చేయుటకు ఉపయోగిస్తున్న మంత్రివర్గపువైఖరిని కమ్యూనిస్టు ప్రతినిధులు నంబియార్, వెంకటేశ్వర్లుగార్లుఖండించారు. యస్. ఐ. ఆర్. సమ్మె, మ్యునిసిపల్ సమ్మె ఇతర ప్రజా పోరాటాలను ఉదహరించి, వివరించారు. సమ్మెలంతటికీ కమ్యూనిస్టులే కారణమని ప్రకాశంగారు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండించారు. మలబార్ పోలీసు పాశవిక చర్యలనుచెప్పి వాటిని రద్దుచేయమన్నారు. సామాన్య పోలీసుల జీతాలు హెచ్చించి, సిబ్బందిని తగ్గించి, అదనపు ఖర్చును మాని ప్రజా మార్గాలను అవలంబించాలని కోరారు. నిరంకుశ నిర్బంధ మార్గాన్నిపట్టిన ప్రకాశంగారికి ఆగ్రహం వచ్చింది పాపం! కాని ప్రేక్షకుల గ్యాలరీ నుంచి ఎప్పుడూలేని హర్షధ్వనులు వచ్చాయి, నంబియార్ ఉపన్యాసానికి.

ప్రకాశంగారి సమర్థన

తానుచెప్పినట్లుగా, 1942 లో అమలులో వున్న ప్రభుత్వ ఆజ్ఞల ప్రకారం పోలీసులు చేశారని, పోలీసుల ప్రభుత్వభక్తిని ప్రకాశంగారు సమర్థించారంటే, మద్రాసువాళ్ళా[రి]కి తలవంపు. జాతీయఉద్యమాన్ని మాపుమాపాలని సామ్రాజ్యవాదులు గావించిన చిత్రవధను కాంగ్రెసు మంత్రివర్గం సమర్థించడం ఏదేశభక్తుడు అంగీకరిస్తాడు?

అట్టి అత్యాచారాలుచేసిన పోలీసు ఉద్యోగులకు అభయంగూడ ఇచ్చారంటే, దప్పుల సుబ్బారాయుడువంటి ప్రజాశత్రువుల చేతులు బలపర్చడంగాక మరేమిటి?

మలబారు పోలీసులసేవను పొగడి, వారికై చేయబోయే రెట్టింపుఖర్చును బలపర్చాడు. శాంతియుతంగా (కరువు కాటకాలు మినహాయించి) జీవితాలు గడుపుతున్న మోప్లాలను కమ్యూనిస్టులు రెచ్చగొట్టున్నారని అర్థంలేని నిందలకు దిగాడు.

ప్రత్యక్షంగా పోలీసులు గన్నవరంలో తదితర ఆంధ్రపట్టణాలలో, తమిళనాడు ఎస్. ఐ. రైల్వే విషయంలో, ఇతర పోరాటాల్లో, ప్రజలను, కార్మికులను బెదిరించి సమ్మెలను భగ్నం గావిస్తుంటే, పోలీసులు శాంతిని కాపాడుతున్నారని, అశాంతికి కారణం కమ్యూనిస్టులేనని ప్రకాశంగారు కమ్యూనిస్టులమీద విరుచుకుపడ్డారు. పోలీసు సిబ్బందిని ఎక్కువ చేయాలన్నారు.

(మిగతా 12 వ పేజీలో)

మధ్యరాష్ట్రాలలో కూడ కమ్యూనిస్టులపై దాడి

రాష్ట్రమంతటా పోలీసు సోదాలు

సి. పి. రాష్ట్ర కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి ఖండన

(మావిలేఖరి)

నాగపూరు, సెప్టెంబరు 4

ఈనెల 1వ తేదీ ఉదయం పోలీసు సబ్‌ఇన్స్‌పెక్టర్లు, మేజిస్ట్రేటు, పోలీసుసిబ్బందితో రాష్ట్ర కమ్యూనిస్టుకమిటీ ఆఫీసుమీద. జిల్లా కమ్యూనిస్టు కమిటీ ఆఫీసుమీద, రైతు సంఘ కార్యాలయంమీద, ఆకస్మాత్తుగా దాడిచేశారు. కమ్యూనిస్టుపార్టీ పత్రాలను స్వాధీనపరచుకునేందుకు వారంట్లు తెచ్చారు. ఆ వారంట్లలో, కమ్యూనిస్టు కార్యకలాపాలు ప్రజా శాంతికి భంగకరమని వ్రాసిఉంది.

కామ్రేడ్స్ బర్ధన్‌వ్యాస్, శర్మ మొదలైన వారి యిండ్లనుకూడా సోదాచేశారు.

సోదాలు జరగడానికి ముందు, ప్రధాన మంత్రి కామ్రేడ్ డి. పి. మెహతాను ఇలా హెచ్చరించాడు.

"ప్రభుత్వ పనివారలను, ప్రభుత్వముద్రణాలయాలలో పనిచేసే కార్మికులను, సమ్మె చేయవలసిందని మీరు ప్రోత్సహిస్తున్నారు. ఈ విధానాన్ని మీరు ఆపకపోతే, పరిస్థితులు విషమిస్తాయి. జాగ్రత్త!"

సోదాల సమయంలో ఇన్‌స్పెక్టర్లు చాలా అమర్యాదగా ప్రవర్తించారు. కడుపునొప్పితో బాధపడుతూ డాక్టరుకోసం వెళుతూన్న కామ్రేడు మోటేను వెళ్ళనీయకుండా దుర్భాషలాడారు. కామ్రేడ్ మోటే తీవ్రంగా మందలించిన తర్వాతగాని, వెళ్ళనీయలేదు. సభకు హాజరు కావడంకోసం వచ్చిన రాష్ట్ర కమిటీ సభ్యుల్ని సహితం తిరిగి వెళ్ళనీయకుండా, అడ్డుపెట్టారు.

ఇలాగే రాష్ట్రమంతట సోదాలు జరిగినట్లు వార్తవచ్చింది.

రాష్ట్రమంతట సోదాలు

జబల్పూరులో పార్టీఆఫీసుమీద, కామ్రేడ్స్ ఎస్. డి. ముఖర్జీ, పి. కె. ఠాకూర్, బి. సి. జైన్, లాబరన్, రతన్‌బాయి యిండ్లమీద పోలీసులు సెప్టెంబరు 1 వ తేదీని దాడులు చేశారు. కొన్ని జాబులు, సర్క్యులర్లు తీసుకెళ్ళారు.

రాయపూరు, అకోలా, బద్‌నేరా మొదలయిన పట్టణాలలోకూడా పోలీసుల సోదాలు చేసి పార్టీపత్రాలు తీసుకుపోయారు.

రాష్ట్రపార్టీకార్యదర్శి ఖండన

ఈ సోదాలను ఖండిస్తూ, సి. పి. రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి, కామ్రేడ్ బి. యన్. ముఖర్జీ ఈ దిగువ ప్రకటనచేస్తున్నారు

"శాంతి భద్రతల రక్షణకై ఈ చర్యలు తీసుకుంటూన్నట్లు కాంగ్రెసు మంత్రులు చెబుతున్నారు. ఇదివరలో సామ్రాజ్యవాదులు కూడా ఇట్టి సాకులే చూపెట్టారు వాటిని యీ మంత్రులే తీవ్రంగా నిరసించారు ఈనాడు తిరిగి ఆ మాటలనే వల్లించవలసిన అవసరం వీరికి ఏమివచ్చింది?

"కార్మికుల కోర్కెలను గురించి మంత్రివర్గం విచారణ చేయడానికి బదులు, కమ్యూనిస్టులు సమ్మెలను రెచ్చగొడుతున్నారని నిందించడం న్యాయంకాదు. రు 500 నుంచి రు 1000 వరకు తమ జీతాలను పెంచుకున్నారు. బంగాళాలలో ఫర్నిచర్ కొరకు రు 2 లక్షలు ఖర్చుచేసుకున్నారు. తమ క్రిందపనిచేసే పనివారలు తమ జీతాలు కొద్దిగా హెచ్చించమని అడిగితే, కమ్యూనిస్టులమీద విరుచుకు బడ్డం దారుణం

"మంత్రివర్గం త్వరలో కార్మికుల సమ్మె హక్కును అపహరించేందుకు కార్మిక తగాదాల పరిష్కారపుబిల్లు" అంటూ ఒకటి ప్రవేశపెట్టబోతూంది. దాన్ని కార్మికులు ప్రతిఘటిస్తారనే విషయం మంత్రులకు తెలుసు. దాన్ని అణచివేసేటందుకుకే ఈ దాడులు, సోదాలు.

"కార్మికుల పౌరసత్వ హక్కులపై యిది పెద్దదాడి. ఈదాడిని అరికట్టుటకు కాంగ్రెసు వాదులు, దేశభక్తు లందరూ ముందుకు రాకపోతే, కాంగ్రెసు మంత్రివర్గం ధనికవర్గాల ఒత్తిడికి లొంగిపోయి, ప్రజా ఉద్యమాలను అణచే పాడువిధానానికి దిగజారవలసి వస్తుంది."

స్థానికశాఖామంత్రి మాట నిలుపుకోలేదు

కార్మికులపై కక్ష సాధించడమే ప్రధానంగా ఎంచుతున్నారు

ప్రజారోగ్యాన్ని గురించి ఆలోచించడంలేదు

రాష్ట్రములో మున్సిపలు పనివారిల ఎస్. ఐ. ఆర్. సమ్మెల యెడల కాంగ్రెసు మంత్రివర్గము అవలంబించిన కార్మిక వ్యతిరేకధోరణిని ప్రజానీకానికి వెల్లడి చేస్తున్నవి. లేబరుమంత్రి గిరి, ప్రధాని ప్రకాశంపంతులు గార్లు కార్మికులకు సమ్మెచేసే హక్కున్నదని పైకి గుర్తిస్తూ సమ్మెను భగ్నము చేయుటకు, కార్మికులను లొంగదీయుటకు ప్రభుత్వ యంత్రాన్నంతా ఉపయోగించుచున్నారు. తమ కాంగ్రెసు పార్టీయొక్క పలుకుబడిని పురస్కరించుకొని బీదప్రజల హక్కులను కాలరాస్తున్నారు. ఒక మూల సమ్మె హక్కును గుర్తిస్తున్నట్లు మాట్లాడుతూ వేరొకమూల సమ్మెలు ప్రభుత్వాన్ని చెప్పి తీస్తున్నాయంటూ, శాసనసభలోను, యితర చోట్ల మంత్రులు మాట్లాడుతున్నారు. సమ్మె వచ్చేలోగా పరిష్కారానికి పూనుకోకుండా, సమ్మె మొదలిడిన తరువాత సమ్మె విరమించాలంటూ పోలీసు నిర్బంధముతో అణగ ద్రొక్కడానికి పూనుకొంటున్నారు.

కాంగ్రెసు ప్రభుత్వమే సమ్మెలను ఎదుర్కొని కార్మికుల హక్కులను తృణీకరిస్తోందంటే పెట్టుబడిదారుల సహితము కార్మిక సంఘాలను యింకా అణగద్రొక్కడానికి పెద్ద ఆయుధము వారి చేతుల్లో పెట్టి ప్రోత్సహిస్తుందన్న మాట.

అధికార ట్రేడ్‌యూనియన్ ఉద్యమముపై కాంగ్రెసు సంఘాలు, ప్రభుత్వము కమ్యూనిస్టు వ్యతిరేకధోరణితో దుష్ప్రచారము బెదరింపులు సాగిస్తున్నవి.

ఇది కార్మికవర్గాన్ని చీల్చాలనే ఉద్దేశమే కాకుండా, పెట్టుబడిదారీ హద్దుపద్దులలో కార్మికులను నిర్బంధించి దేశాన్ని బానిసవిధానంలో ఉంచేమార్గానికి దారితీస్తుంది. ఆంధ్ర మున్సిపలు కార్మికులయెడల ప్రభుత్వం అవలంబించిన ధోరణి ఒకసారి వివరిస్తాను:

ఆంధ్రరాష్ట్ర మున్సిపలు కార్మికులసంఘం మేనెలలో సమ్మెతాలలు తీసుకొంది. నూటికి నూరుమంది సమ్మెను బలపర్చారు. సమ్మె కార్మికులయొక్క చట్టసమ్మతమైన విధానం. కార్మికలోకము ఎంతో త్యాగముచేసి సమ్మె హక్కును కాపాడుకొంది. కార్మికుల కనీస కోర్కెలు స్థానిక పురపాలకసంస్థలు, ప్రభుత్వము నిర్లక్షించడంమూలంగా సమ్మె మినహా కార్మికులకువేరేమార్గములేకపోయింది. జూన్ 27 న సమ్మెనోటీసిచ్చి జూలై 10 వ తేది నుంచి సమ్మె ప్రారంభించుటకు 30 బ్రాంచి సంఘాలు తీర్మానించాయి. అయినప్పటికి తిరిగి స్థానిక పురపాలక సంస్థలకు ప్రభుత్వానికి యింకనూ గడవు యిచ్చుటకై వారి కోర్కెపైన తిరిగి సమ్మె వాయిదా వేయబడింది. ఈ కాలములో పరిష్కారమేమీ కాలేదు. తిరిగి జూలై 11 వ తేదీని నోటీసిచ్చి నెలరోజుల గడువుతో ఆగష్టు 9 న సమ్మె ప్రారంభించుటకు తీర్మానించడమైంది. ఇప్పటికికూడ ప్రభుత్వం కదలలేదు. స్థానిక పురపాలక సంస్థలు ముఖ్యమైన హక్కులగు జీతము, కరువుభత్యము వగయిరా ప్రభుత్వము ఆమోదించవలసినవికాని తమకు అధికారములేదని త్రోసివేశాయి. ఈ పరిస్థితులలో గత్యంతరంలేక సమ్మె 9 వ తేదీని ప్రారంభమైంది. సమ్మె ఒక రోజు ముందు ప్రారంభ మగుతుందనగా పబ్లిక్ హెల్త్ డైరెక్టరు, లోకలుబోర్డు యినస్పెక్టరు బెజవాడవచ్చి, సమ్మెను ఎదుర్కోవడానికి మార్గాలకై కమీషనర్లు, చైర్మనుల మీటింగుపెట్టి చర్చించిపోయారు.

లేబరు ప్రతినిధులు కలుసుకున్నప్పుడు యీ అధికారులు ప్రభుత్వము అన్నివిషయాలు పరిశీలిస్తేనేకాని హక్కులనుగురించి ఏమీ చెప్పలేదంటూ వెళ్ళిపోయారు. సమ్మె ప్రారంభించిన రెండు రోజుల తర్వాత (11-8-46) కన్సీలియేషను బోర్డును నియమిస్తామంటూ, నెలరోజులవరకు రిపోర్టు తయారు కాదంటూ ప్రకటించారు. ఇది యూనియనుతో సంప్రదించలేదు. కన్సీలియేషనుబోర్డు నెలరోజులు ఏమిచేసేదీ వివరించలేదు. కన్సీలియేషనుబోర్డు అవార్డు ప్రభుత్వము అమలు పెట్టేదీ లేనిదీ తెలుపలేదు. స్పష్టమైన పనివారల కనీసకోర్కెలను ప్రభుత్వ దృక్పథము వెల్లడిచేయలేదు. కన్సీలియేషను బోర్డు కాలయాపనకు మాత్రము ఉపయోగపడేదిగా ఉంది. కన్సీలియేషనుబోర్డు సహితము సమ్మె మొదలిడిన వారంరోజులవరకు (17-8-46) కదలలేదు. ఈ వారంరోజుల్లో పట్టణాలు మురిగిపోయాయి. కొద్ది దొంగకూలీలు, సమ్మెను భగ్నముచేసే కాంగ్రెసు వాదులతో రోడ్లు తుడిచినట్లు ఒక నటన మాత్రము చేశారు. పట్టణాల ఆరోగ్యము నానాటికి క్షీణిస్తోంది.

సి. వి. కె. రావు

ఇక ప్రభుత్వము పోలీసుల సహాయముతో సమ్మెను విచ్ఛిన్నము చేయడానికి మొదలు పెట్టింది. అనకాపల్లి, పెద్దాపురము, రాజమండ్రి ఏలూరు బెజవాడ పట్టణాల్లో విచ్చలవిడిగా పోలీసులు లాఠీచార్జీలతో స్త్రీ. పురుష కార్మికులను కొట్టుట. వారాలకొలది కార్మికులను అరెస్టుచేసి జైళ్ళలో నిర్బంధిస్తూ నీచమైన దౌర్జన్య విధానం అవలంబించారు. శాంతియుతులగు సమ్మెదారులపై కాంగ్రెసు మంత్రి డేనియల్ థామస్‌గారు లాఠీలను ఉపయోగించవచ్చునని బెజవాడకు ఫోను చేశారు. ప్రతిచోట యిదే పోలీసు కార్యక్రమమైంది.

సమ్మెను నిర్బంధ విధానంతో అణచడానికి సాధ్యముకాలేక కార్మికులను యిండ్లనుంచి తరిమివేస్తామంటూ, రేషను బియ్యము యివ్వకుండా కార్డులు లాగుకొంటామంటూ గుడ్డి బెదరింపులు స్థానికాధికార్లు చేసినా ఫలితము లేకపోయింది. దినపత్రికల్లో సమ్మె అన్నిచోట్ల విరమింపబడుతూ వుందట. ఏమీ ఫరవాలేదంటూ, అబద్ధపు ప్రకటనలు మొదలుపెట్టారు. స్థానిక కాంగ్రెసువాదులు కొందరు దొంగకూలీల పనిని చేశారు. ప్రజారోగ్యాన్ని వారేమీ కాపాడలేదు సరిగదా సమ్మె పొడిగింపుకు కారకులయ్యారు ప్రజలను యింకా ఇబ్బంది పాలు చేయుటకు కారకులయ్యారు.

గుంటూరు మున్సిపాలిటీ కార్మికుల కోర్కెలను తాత్కాలిక షరతులతో జీతముపై అదనంగా రు 10 లు అంగీకరించిన మీదట స్థానికంగా సమ్మెకమిటీ రాజీ చేసుకొంది. కన్సీలియేషనుబోర్డు సమ్మె విరమించమనికోరితే గుంటూరు షరతులవలె తాత్కాలిక నిర్ణయమిచ్చి త్వరలోనే హక్కులన్ని ఆమోదిస్తే సాధ్యమగుతుందని యూనియను ప్రతినిధులు చెప్పగా కన్సీలియేషను బోర్డు తమకా అధికారము లేదనీ మదరాసు వెళ్ళిపోయింది.

సమ్మెను భగ్నము చేయుటకు ప్రభుత్వప్రయత్నాలు. పోలీసు దౌర్జన్యాలు, మున్సిపాలిటీల కుట్రలు యథావిధిగా సాగుతూనే ఉన్నాయి. కన్సీలియేషన్ మదరాసు పోయిన నాలుగు దినాలకు 22-8-46 న ప్రభుత్వ కాబినెట్ కమిటీ తాత్కాలిక జీతపు పెంపుదల మున్సిపల్ పనివారలకు నిర్ణయించిందని సమ్మె విరమిస్తే వెల్లడిచేస్తామంటూ ప్రకటించింది. యూనియనుకు మాత్రం యీ విషయము తెలియజేయలేదు. తాత్కాలిక షరతు తెలియజేస్తే యూనియను పరిష్కారానికి సిద్ధంగానే ఉందని చెప్పినప్పటికి యీ షరతును ఎందుచేత వెల్లడి చేయుటకు ప్రభుత్వము జంకిందో తెలియదు. సమ్మె యెడల, కార్మికసంఘము యెడల ప్రభుత్వం అవలంబిస్తున్న కోరబట్టి. యూనియన్, యిదొక మోసమని అనుమానించింది. దానికి తగినట్లు డేనియల్ థామస్‌ను వ్యాసకర్త మదరాసులో కలుసుకొని ప్రకటన గురించి అడిగితే ప్రకటన తెలియదని చెప్పారు. కాని అదే ప్రకటన అన్నిపత్రికల్లో వెలువడ్డం ఆశ్చర్యము. 25 వ తారీఖునాడు థామస్ ప్రభుత్వనిర్ణయం 26 వ తేదీన వస్తుందన్నాడు. 26 వ తేదీన అడిగితే 27 వస్తుందన్నాడు సమ్మె పరిష్కారమైనపుడు అందరినీ పనిలోపెడతాము కేసులు ఉపసంహరించుకొంటాము, సమ్మె కాలానికి జీతము యిస్తామనీ హామీయిచ్చారు. 29 వ తేదీని నూటికి 25 (అంటే మున్సిపలు కార్మికునికి నెలకు రు 1 నుంచి రు 3 వరకు) జీతాలు పెంచుతామని ప్రకటన వచ్చింది. కార్మికులపై కక్షతీర్చుకోమని హామీ యివ్వలేదు. సమ్మెకాలానికి జీతాల మాట తెలుపలేదు. కేసులు ఉపసంహరించుకుంటామని తెలుపలేదు. మొత్తంమీద ఈప్రకటన కన్నీళ్ళు తుడవడానికిమాత్రంచేసినట్లుంది. ఈ ప్రకటన ప్రజలను మోసగించడానికి కార్మికులను యింకా అసంతృప్తి పరచడానికి సమ్మె పొడిగించెమార్గం కింపవుందిగాని పరిష్కారమునకు దారితీసేది కాదు.

ప్రకటనకు పూర్వము గుంటూరు మున్సిపలు చైర్మను గుంటూరులో తాను సమ్మె పరిష్కరించుకొన్నందుకు చర్యతీసుకొంటామని ప్రభుత్వము బెదిరించింది. స్థానికంగా యితరచోట్ల ప్రజలఆరోగ్యము దృష్టియందు పెట్టుకొని, న్యాయమగు తాత్కాలిక షరతులు ఒప్పుకొన్న మీదట సమ్మె విరమించినచోట్ల సహితము ప్రభుత్వము వ్యతిరేకిస్తూ రహస్య సర్క్యులరు జారీచేసిందట. అదిగాక కన్సీలియేషన్‌బోర్డు ప్రకటనబట్టి తాత్కాలిక షరతులు ప్రభుత్వానికి తెలియజేసిందని పత్రికా ప్రకటనవస్తే ఎందుచేత కన్సీలియేషనుబోర్డుయొక్క రిపోర్టు బయట పెట్టలేదు? అసలు సంగతి ఇది: తాత్కాలిక హెచ్చింపు అసలు కోర్కెలు విచారించేలోగా యిస్తున్నామనిచెప్పి రికమెండుచేసిన కన్సీలియేషనుబోర్డు రిపోర్టు ప్రభుత్వము యూనియనుకు ప్రజలకు తెలియకుండా దాచింది. ప్రభుత్వము హెచ్చించిన నామమాత్రపు జీతపు పెంపుదల దేనిపైలభారము చేసిందో తెలుపలేదు. అసలు కోర్కెలను గురించి తెలుపనేలేదు. ఇప్పటివరకు ప్రభుత్వ ప్రకటన గురించి స్థానిక పురపాలక సంస్థలకు డిపార్టుమెంటుద్వారా తెలుపనేలేదట. కార్మికులను మోసగించడానికి కాంగ్రెసు మంత్రివర్గము యిటువంటి పన్నాగము చేస్తున్నారంటే దీని అర్థమేమిటి?

ప్రభుత్వధోరణి యిన్ని అవకతవకలు వ్యతిరేకతతో కూడినప్పటికి, కేంద్ర సమ్మె కమిటీ నెల రోజులనుంచి సాగుతున్న సమ్మె మూలంగా పట్టణాల ఆరోగ్యము నాశనమై అంటువ్యాధులు వ్యాపించే స్థితి కలుగుటచే సమ్మె విరమించుటకు సిద్ధంగా ఉందని ప్రకటించింది. అయినా ప్రభుత్వము స్థానిక పురపాలక సంస్థలకు కార్మికులపై కక్ష సాధించమని చెప్పినట్లు ఫలదమాలోంచి దొంగకూలీలను పంపమని, సమ్మెకాలానికి జీతము విషయము తమ చేతుల్లో లేదని, కేసులు విషయము పోలీసులు, ప్రభుత్వము చూడాలని ఒకరిపై ఒకరు బాధ్యతను త్రోసివేసి పరిష్కారము లేకుండా సమ్మెను పొడిగించేదుకు సిద్ధమవుతున్నారు.

ఈ పరిస్థితుల్లో సమ్మెను కార్మికులు విరమించ దలచినప్పటికి ప్రభుత్వము అంగీకరించేటట్టులేదు కాకినాడ, రాజమండ్రి, బెజవాడ, తెనాలి, నెల్లూరు మొదలగు ప్రాంతాలలోని మున్సిపలు కార్మికులు తమ ప్రాథమిక హక్కులను కాపాడుకోడమే కాకుండా ప్రభుత్వముయొక్క కార్మిక వ్యతిరేకపంథాను ఎదుర్కొనుటకు యికసమ్మెను సాగించవలసి వచ్చింది.

కాంగ్రెసు మంత్రులు యిప్పటికైనా గుర్తించి కార్మికుల కనీసవేతనాలు, యితర సౌకర్యాలు ఆమోదించి సక్రమమైన వాతావరణం కలిగించడం ప్రజా శ్రేయస్కరం.

పోలీసుశాఖకు ఖర్చు

(11 వ పేజీ తరువాయి)

పోలీసుల జీతాల విషయంలో మాత్రం నేటి అల్పజీతాలకు కాంగ్రెసు మంత్రివర్గం బాధ్యతకాదన్నారు. కమ్యూనిస్టు వ్యతిరేకతతో కరడుగట్టిన ముస్లిం వర్తక శాసన సభ్యులు, యూరపియన్ సభ్యులు, ఇతర ధనికవర్గ ప్రతినిధులు ప్రకాశంగారిని హర్షించారు.

పోలీసుదళ నిర్మాణ పద్ధతిలోగాని, పరిపాలనలోగాని సంస్కరించే మార్పులేవీ లేకపోగా సంఖ్యాబలాన్ని హెచ్చించి, ఇంకా చురుకుగా పనిచేయడానికి ఇంకా ఎక్కువ సాయుధ దళాల రిజర్వులను నిర్మించడానికి మాత్రం కాంగ్రెసు మంత్రివర్గం అదనపు ఖర్చునుగూడా ఓటు చేయించుకుంది.

ఆకలితో బాధపడుతూ కరువు కాటకాలను ఎదుర్కొంటున్న మద్రాసు రాష్ట్ర ప్రజల అసంతృప్తి జ్వాలలను అణచడానికి పోలీసు ప్లాను సిద్ధమయిందంటే నిరసించే దేశభక్తులంతా మేల్కొని మంత్రివర్గాన్ని, ప్రజాబాటలో నడవటానికి వెంటనే కదలాలి.

4 నెలల పోలీసు హింసాకాండ!

కంచుకాగడా —

దీనికి వ్యాఖ్యానం అవసరంలేదు. చూడండి. నాలుగు నెలల కాంగ్రెసు మంత్రుల పరిపాలనలో, మన రాష్ట్రంలో, కార్మికులపైన; కర్షకులపైన కమ్యూనిస్టులపైన పోలీసుల లాఠీ, బ్రిటిష్ తుపాకి, ఎంత విచ్చలవిడిగా విలయతాండవం చేశాయో ఈ క్రింద చూడండి.

ఈ నాలుగునెలల కాలంలో 8 చోట్ల తుపాకులు కాల్చబడ్డాయి. 6 గురు చనిపోయారు. సుమారు 25 చోట్ల లాఠీఛార్జీలు జరిగాయి. 600 లకు పైగా దెబ్బలకు గురయ్యారు. 20 చోట్లకు తక్కువ కాకుండా 144 వ సెక్షను ప్రయోగింపబడింది. 1120 మందికి పైగా అరెస్టు కాబడినారు. ఇప్పుడు కేసులు జరుగుతున్నవారుగాక 100 మందికిపైగా శిక్షలు చెప్పబడ్డాయి. ఇద్దరురైతులకు యావజ్జీవశిక్ష, ఇద్దరు కార్మికనాయకులకు పదేసి సంవత్సరాల శిక్ష విధించబడ్డాయి.

ఒక్కటే ప్రశ్న: ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల పరిపాలనలోనే ఇంత అత్యల్పకాలంలో ఇంత పోలీసు హింసాకాండ సాగిందంటే దీని అర్థం ఏమిటి?

దీనికి ఒకటే సమాధానం: మన కాంగ్రెసు మంత్రులు, సంఘటిత కార్మికోద్యమాన్ని, రైతుల చైతన్యాన్ని తమకు వ్యతిరేకమని భావిస్తున్నారు. యుద్ధ కాలంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదు లవలంబించిన కుటిల ఆర్థికనీతియే దీనికి కారణమని గుర్తించడంలేదు. శిథిలమవుతున్న ఈ ఆర్థికవిధానంలో నలిగిపోతూ, తిండికి, బట్టకు, కార్మికులు సాగించుచున్న పోరాటంగా వారు దీనిని ఎంచడంలేదు. కమ్యూనిస్టులమీద తోసివేస్తే తీరిపోతుందని భావిస్తున్నారు. కాంగ్రెసు మంత్రుల ఈ కార్మిక, కమ్యూనిస్టు వ్యతిరేకతను సామ్రాజ్యవాదులు చక్కగా వినియోగించుకుంటున్నారు. ప్రజావిప్లవోద్యమాన్ని నాశనం గావించడానికి పూనుకున్నారు. అదే దీని అర్థం.

అందుచేత గౌరవనీయులైన కాంగ్రెసు మంత్రుల సన్నిధికి, వారి మొదటి నాలుగునెలల పరిపాలనలో, జరిగిన పోలీసు అత్యాచారాల జాబితాను సమర్పిస్తున్నాను.

ఇదేనా, ప్రజామంత్రులు పౌరసత్వహక్కులు పెంపొందించే విధానమని అడుగుతున్నాను. ఇదేనా, స్వాతంత్ర్య పోరాటాన్ని అంతిమస్థాయికి తీసుకుపోయే మార్గమని ప్రశ్నిస్తున్నాను. తమను అధికారంలోకి పంపిన ప్రజానీకానికి ప్రకాశం మంత్రివర్గం ఏమని సమాధానం చెబుతుంది?

★

మద్రాసు కాంగ్రెసు ప్రభుత్వం ఏప్రిల్ 30 వ తేదీన అధికారం స్వీకరించింది.

అనాడే మలబారు రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి కామ్రేడ్ కృష్ణపిళ్లె సెక్షన్ 3 డిఫెన్స్ ఆర్డినెన్సు (44) ప్రకారం మలబారునుండి ఎక్స్‌టర్న్ చేయబడ్డారు.

మే

— కామ్రేడ్ క్రిష్ణపిళ్లెను పోలీసు కావలాతో దక్షిణ కెనరా జిల్లాకు తీసికెళ్ళారు.

— కామ్రేడ్ కొరపాటి పట్టాభిరామయ్యను అరెస్టు చేశారు. 30 మంది పోలీసులు తుపాకులతో, బాయ్‌నెట్లతో కార్మికుల యిళ్ళమీద దాడిచేసి, సోదాలు చేశారు.

— మద్రాసు స్పెన్సర్ కార్మికులమీద పోలీసుల లాఠీఛార్జి.

— శివలింగమనే స్పెన్సర్ కార్మికునిపై కేసు.

— గోల్డెన్‌రాక్ కార్మికులమీద లాఠీఛార్జి చేశారు 144 వ సెక్షన్‌ను జారీచేశారు. 12 కార్మికులు గాయపడ్డారు. 40 మంది కార్మికులమీద కేసులు బనాయించారు.

— మద్రాసు బస్సు కార్మికుల సమ్మె సందర్భంలో 120 మంది కార్మికుల అరెస్టు.

— ఎస్. ఐ. ఆర్. కార్మికుల సమ్మె సందర్భంలో గోల్డెన్‌రాక్ వర్కుషాప్‌లో 6 గురు కార్మికులమీద కేసులు పెట్టారు.

— గోల్డెన్‌రాక్‌లోనే, మరో 3 గ్గురు కార్మికులమీదగూడ కేసులు పెట్టారు.

— బెజవాడలో బట్ట కొనుక్కునేందుకు వెళ్ళిన ప్రజలమీద లాఠీఛార్జీ. 5 గురి అరెస్టు.

— మద్రాసులో 19 మంది హోటల్ కార్మికులను అరెస్టు చేశారు.

— స్పెన్సర్ కార్మికుల సమ్మెలో పికెట్ చేసినందుకు 28 గురికి (యిందులో 2 స్త్రీలు) ఒక్కొక్కరికి రూ. 3 చొ. జరిమానా విధించారు.

— విల్లుపురంలో సమ్మె సందర్భంలో సెక్షన్ జారీ చేయబడింది.

— ఎస్. ఐ. రైల్వేలో ఒక గుమాస్తాను పనినుంచి తీసివేశారు.

— మోట్టూర్ మెటల్ కార్మికులమీద కేసులు బనాయించారు.

— రామనాడ్‌లో 144 సెక్షన్ పెట్టారు.

జూన్

— విశాఖజిల్లా తుంపాల చెరుకు రైతులమీద కేసులు. 3 గ్గురికి రూ 150 చొ॥ జరిమానా లేకపోతే 2 నెలలు కఠినశిక్షలు విధించారు.

— మైలవరంలో ప్రజలమీద, జమీందారుల, పోలీసుల దురంతాలు

— గన్నవరం ప్రజలమీద మలబారు పోలీసుల అమానుషకృత్యాలు — ప్రజలను పిల్లా, పెద్దా విచక్షణలేకుండా దారుణంగా లాఠీఛార్జీ చేశారు.

— మద్రాసు స్పెన్సర్‌కార్మికుల సమ్మెలో పికెటింగు చేస్తున్న 4 గురిని అరెస్టుచేశారు.

— కాశ్మీర్‌లో నెహ్రూ అరెస్టుకు, మద్రాసులో నిరసనదినం జరిపిన సందర్భంలో తీవ్రంగా లాఠీఛార్జిచేశారు. 27 గురిని అరెస్టుచేశారు. కొంతమందికి రు. 5 చొ॥ జరిమానా విధించారు. 144 సెక్షన్ జారీచేశారు.

— కాశ్మీర్‌లో నెహ్రూ అరెస్టును ఖండించుతూ మధురలో ప్రజలు జరిపిన నిరసన ప్రదర్శన సందర్భంలో తీవ్రంగా లాఠీఛార్జీ చేశారు. కాల్పులు కాల్చారు. 4 గురు చనిపోయారు టియర్‌గాస్ ప్రయోగించారు. 200 మందిని అరెస్టు చేశారు.

జూలై

— బకింగ్‌హామ్ కర్నాటిక్ మిల్లు కార్మికుల సమ్మెలో 12 మందిని అరెస్టుచేశారు.

— ఏ. కె. గోపాలన్‌ను, ప్రజలను తిరుగుబాటుకు రెచ్చగొడుతున్నాడనే నేరంమీద అరెస్టుచేశారు

— బకింగ్‌హామ్ కర్నాటిక్ మిల్లు కార్మికునకు ఒకనెల శిక్ష.

— ప్రధాని ప్రకాశం దర్శనార్థం వెళ్ళిన 800 మంది బకింగ్‌హామ్‌మిల్లు కార్మిక స్త్రీలపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు.

— చూళైలో కార్మికులపై పోలీసుకాల్పులు.

— బకింగ్‌హామ్‌మిల్సు సమ్మె సందర్భంలో 14 మంది మిల్లు కార్మికులను అరెస్టుచేశారు.

13 వ తేదీన యిద్దరు కార్మికులకు జరిమానా వేశారు.

— అరెస్టు చేసిన 8 గురిలో 5 గురు కమ్యూనిస్టులకు శిక్షలు వేశారు.

— గుంటూరు కార్మికనాయకులు కట్టయ్య మొదలగు వారికేసులో యిద్దరికి 10 సం॥. యిద్దరికి ఒక సం॥ శిక్షలు వేశారు.

— బకింగ్‌హామ్‌మిల్సు కార్మికనాయకుడు, ఆంథోనీపిళ్ళెకు, ప్రభుత్వ అనుమతిలేకుండా సభ జరిపాడని, రు 75 జరిమానా వేశారు.

— మధురలో 144 సెక్షన్ ప్రవేశపెట్టారు.

— గుంటూరుజిల్లా. గోళ్ళమూడి. చిలకలూరుపేటలలో ఎఱ్ఱజెండాను నిషేధించారు. 144 సెక్షన్ జారీచేశారు.

— కొటికలపూడి హరిజన వ్యవసాయ కూలీలు వేలంలో కొనుక్కున్న క్రిష్ణలంకలను లాక్కొని, అచ్చటనుండి వారిని వెళ్ళగొట్టారు. కొటికలపూడిలో 144 సెక్షను ప్రవేశపెట్టారు.

— పొన్నూరు అల్లర్లలో రౌడీలకు పోలీసులు మద్దతిచ్చారు.

— 144 సెక్షన్ జారీచేసి, మధురమోటారు కార్మికులు సంఘంలో మీటింగుపెట్టుకోకుండా చేశారు.

ఆగస్టు

— మలబారు కమ్యూనిస్టు నాయకులమీద సెక్యూరిటీ కేసులు పెట్టారు.

— మద్రాసులో, ఫోర్టుసెంట్ జార్జి వద్దకు వెళ్ళిన రిక్షా కార్మికులను పోలీసులు నెట్టివేశారు.

— 4 వ తేదీన కొన్నరాజపురం, మల్లాపురంలో రైతు - మిరాశీదార్ల తగాదాలో 65 మంది రైతులను అరెస్టుచేశారు.

— ఎక్కాగుడి గ్రామంలో (తమిళనాడు) జాతీయ పతాకాన్ని ఎగురవేయు సందర్భంలో వచ్చిన తగాదాలో పోలీసులు ప్రజలపై తుపాకులు కాల్చారు. ఆ కాల్పులలో ఒకతను చచ్చిపోయాడు. ఒకతను గాయపడ్డాడు.

— మధురలో 167 మంది అరెస్టు

— 13 గ్గురు పాపనాశం కార్మిక సంఘ వర్కర్లపై కేసులు.

— తంజావూరు జిల్లా కదిరమంగళంలోని రైతులకు, మిరాశీదార్లకు వచ్చిన తగాదా సందర్భంలో 21 మంది రైతులకు ఒక సం॥ శిక్ష. యిద్దరకు జీవితాంతంవరకు ఖైదు విధించబడింది.

— బెజవాడ మున్సిపల్ కార్మికుల సమ్మెలో పికెటింగు చేస్తున్న 4 గురిని అరెస్టు చేశారు.

— మద్రాసు కార్పొరేషన్ వర్కర్లపై (వారి సమ్మె సందర్భంలో) లాఠీచార్జీ చేశారు.

— కర్నూలు మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంలో ఒకరిని అరెస్టు చేశారు.

— రాజమండ్రిలో (మున్సిపల్ కార్మికుల సమ్మెలో) 10 మంది అరెస్టు.

— మద్రాసు కార్పొరేషన్ కార్మికుల సమ్మె సందర్భంలో వారి యూనియన్ కార్యదర్శిమీద కేసుపెట్టారు. 3 గ్గురు కార్మికులకు జరిమానాలు విధించారు.

— బెజవాడలో (మున్సిపల్ సమ్మె సందర్భములో) లాఠీచార్జీ. 1 స్త్రీ, 3 గ్గురు పురుషులు గాయపడ్డారు.

— మున్సిపల్ సమ్మె సందర్భంలో ఏలూరులో లాఠీచార్జీ. 20 మంది అరెస్టులు

— వైజాగ్‌లో ఆదే సందర్భంలో మూడు అరెస్టులు.

— రాజమండ్రిలో సమ్మె సందర్భంలో లాఠీచార్జీ జరిగింది. స్త్రీలు బాగా గాయపడ్డారు.

— కార్పొరేషన్ కార్మికుల సమ్మె సందర్భములో జరిగిన లాఠీచార్జీలో 30 మంది గాయపడ్డారు.

— బెజవాడలో 144 సెక్షన్ ప్రవేశపెట్టారు. లాఠీచార్జీ చేశారు. 51 మందికి దెబ్బలు

— మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భములో వైజాగ్‌లో 144 వ సెక్షన్, బెజవాడలో 61 మంది అరెస్టు. ఏలూరులో 52 మంది అరెస్టు, కాకినాడలో యిద్దరు అరెస్టు. పెద్దాపురంలో 144 వ సెక్షన్ పెట్టారు. రాజమండ్రిలో లాఠీచార్జి 11 మంది గాయపడ్డారు, (6 స్త్రీలు 1 పిల్ల). పెద్దాపురంలో లాఠీచార్జి బెజవాడలో 72 మంది అరెస్టు. అందులో 10 మంది స్త్రీలు. రాజమండ్రిలో కార్మికనాయకులమీద ఇండియన్ పీనల్‌కోడ్‌లోని 147, 148, 149, 323, 324, 227 సెక్షన్ల క్రింద కేసులు బనాయించారు.

— కేరళ కమ్యూనిస్టు నాయకుడు ఎ. కె. గోపాలన్‌కు "అభ్యంతరకరమైన" ఉపన్యాసమిచ్చాడని, 4 నెలలు శిక్ష విధించారు.

— మున్సిపల్‌కార్మికుల సమ్మెసందర్భంలో ఏలూరులో 10 మందిని అరెస్టుచేశారు.

— మున్సిపల్‌కార్మికుల సమ్మెసందర్భంలో బెజవాడలో 8 మంది వర్కర్లకు స్త్రీలతోసహా 15 రోజులచొప్పున శిక్షవేశారు

— కార్పొరేషన్ కార్మికుల సమ్మెసందర్భంలో 21 వ తేదీన పోలీసుల లాఠీచార్జి, 36 మంది వర్కర్లను అరెస్టుచేశారు.

— సైదాపేటలో కార్మికపేటపై దాడి, ఒక ముసలిస్త్రీ చనిపోయింది. 200 మంది గాయపడ్డారు. కుండలు పగులగొట్టారు. ఇళ్లు పడగొట్టారు. ట్రిప్లికేన్ మీటింగును చెదరగొట్టడానికి టియర్‌గ్యాస్ ఉపయోగించారు.

— మధుర-మీనాక్షి మిల్లుకార్మికులమీద లాఠీచార్జి మధురలో 11 మంది అరెస్టు.

— బెజవాడలో 30 మందిని అరెస్టుచేశారు. 4 గురికి నెలచొప్పున శిక్షవేశారు.

— అనకాపల్లిలో 144 వ సెక్షను.

— సైదాపేటలో 3 గ్గురు కార్మికనాయకుల మీద కేసులు.

— కార్పొరేషన్ కార్మిక సమ్మె సందర్భంలో 6 గురు కార్మికులను అరెస్టుచేశారు.

— కార్పొరేషన్ కార్మిక సమ్మె సందర్భంలో పీపుల్స్‌పార్కులో పెట్టిన మీటింగులో ప్రజలమీద లాఠీఛార్జీ చేశారు.

— మద్రాసులో ఎసెంబ్లీ హాలు ముందరనే ప్రజలమీద లాఠీఛార్జీ చేశారు. ఒక కమ్యూనిస్టు స్పృహలేకుండా పడిపోయాడు. టియర్‌గాస్ వుపయోగించారు. సభలనూ, ఊరేగింపులనూ నిషేధించారు.

— మధురలో 144 వ సెక్షన్ జారీ చేశారు. పోలీసులు ప్రజలపై టియర్‌గాస్ ప్రయోగించారు.

— మద్రాసు కార్పొరేషన్ కార్మికుల సమ్మె సందర్భంలో 3 గ్గురు కార్మిక వర్కర్లకు రు. 25 చొ॥ జరిమానా వేశారు.

— టూటికోరిన్‌లో 144 వ సెక్షన్.

— మలబారులో కమ్యూనిస్టుపార్టీ దినపత్రిక 'దేశాభిమాని' ఆఫీసును, సాయుధరిజర్వు పోలీసులు డి. యస్. పి. నాయకత్వాన సోదా.

— మధురలో ప్రజలమీద పోలీసులు తుపాకులు కాల్చారు. 2 స్త్రీలను అరెస్టుచేశారు.

— యస్. ఐ. ఆర్. కార్మికుల సమ్మె సందర్భంలో 32 మందిని అరెస్టుచేశారు. పోలీసులు టియర్‌గ్యాసు వదిలారు.

— సెక్షన్ 107 క్రింద కేరళ కమ్యూనిస్టు నాయకులు, నంబూద్రిపాద్, ఎ. కె. గోపాలన్‌లను అరెస్టుచేశారు

— బెజవాడలో (మున్సిపల్ కార్మికులసమ్మె సందర్భంలో) 11 మందిని అరెస్టు చేశారు.

— కాకినాడలో మున్సిపల్‌కార్మికుల సమ్మె సందర్భంలో యిద్దరు స్త్రీలకు ఒక్కొక్కరికి 2 వారాలు శిక్షవేశారు.

— మల్లాపురం (మలబారు) లో కామ్రేడ్ బణాక్‌ను అరెస్టు చేశారు.

— యస్. ఐ ఆర్. సమ్మె సందర్భంలో యింతవరకు మొత్తం 80 అరెస్టులు జరిగాయి.

— **కొండేపూడి లక్ష్మీనారాయణ**

ప్రజలపై కాల్చడానికి గార్వాల్ సైనికుల నిరాకరణ

టెహ్రీ సంస్థానంలో ప్రజాఉద్యమ వెల్లువ

టెహ్రీఘర్వాల్ సంస్థాన ప్రజల స్వాతంత్ర్యపోరాటంలో నూతనాధ్యాయం జూలై 25న ప్రారంభమయింది. టెహ్రీ ప్రజల నాయకుడు శ్రీ దేవసుమన్ జైలులో మరణించిన రోజుఅది. తమ నాయకుణ్ణి స్మరించి టెహ్రీ బందిఖానాలు పగలగొట్టి హిమాలయ పర్వత శృంగాలపై స్వాతంత్ర్య పతాకాల నెగరవేయడానికై ప్రజలు ప్రతిజ్ఞ తీసుకునే రోజుఅది.

సుమన్ స్మారకదినంనాడు తీవ్రమైన లాఠీచార్జీలు, అరెస్టులు, కాల్పడానికి ఆజ్ఞలు. ఇవి ప్రభుత్వం ప్రజలకోసం దాచిన బహుమతులు. కాని, ప్రజలు చలించలేదు, సైనికులు ప్రభుత్వపు ఆజ్ఞల్ని పాటించలేదు.

నేడు టెహ్రీ అంతటా ప్రజాఉద్యమం వెల్లివిరుస్తోంది.

శ్రీ దేవసుమన్ స్మారకదినంకోసం ప్రజలతో సమంగా సంస్థానాధికార్లుకూడా సర్వప్రయత్నాలూ చేసుకున్నారు. 600 మంది పోలీసుల్ని, 200 మంది సాయుధ సైనికుల్ని టెహ్రీకి చేర్చారు.

ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలన్నింటినీ ప్రజామండలి ఎరుగును. అన్నివిషయాలలోనూ ప్రజలకు హెచ్చరికనిస్తూ వారు స్మారకదినం జరపడానికి ప్రయత్నాలు సాగించారు.

చివరకి స్మారకదినంనాడు వేలకొద్ది స్త్రీలు, పురుషులు ఊరేగింపులు, మీటింగులు జరిపారు. సక్లానా, చమ్మా, ముసోరీ, డెహ్రాడూన్, అన్నిచోట్ల ప్రజామండలి నాయకులు, కాంగ్రెసువాదులూ, కమ్యూనిస్టులూ కలసి ప్రజల్ని నడిపారు.

టెహ్రీలో ప్రజాఉద్యమం నిజశక్తిని ప్రదర్శించింది. స్మారకదినానికి ముందునాడు ప్రజామండలి బహిరంగసభ జరిపింది.

నాయకుల అరెస్టులు

మీటింగు అయిన వెంటనే ప్రధాన నాయకులందర్నీ అరెస్టుచేసి, ప్రజల్ని భయపెట్టేటందుకై నాయకులకు అరదండాలువేసి వీధులవెంట తిప్పారు.

25 వ తేదీన మీటింగులు నిషేధించారు. ఇద్దరు వ్యక్తులుకలిసి నడిచినా కాల్చివేస్తామన్నారు. జూలై 23న ఆజాద్‌హింద్‌ఫౌజు సైనికులుకూడా ఊరేగింపుల్లో పాల్గొంటారని కల్నల్‌రాథోరీ ప్రకటించారు. ప్రజల వుత్సాహానికిమేరలేదు.

25 వ తేదీన నగరం అంతా పోలీసులే. ఎవ్వర్నీ వీధుల్లో నడవనివ్వటంలేదు. దుకాణాల్ని బలవంతంగా తెరిపించి, మూయకుండా పోలీసుల్ని కాపలా పెట్టారు. కాలేజీలు, స్కూళ్ళు తెరిచివుంచి పిల్లలకి మిఠాయీలు పంచిపెట్టారు. డి. ఐ. ఎస్. పి., డి. ఎస్. పి.లు కల్నల్ రాథోరి ఇంటికివెళ్ళి, ఇంటిమీద ఎగురుతున్న జెండా దింపెయ్య మన్నారు. ఊరేగింపులోకి రావద్దన్నారు.

కల్నల్ తన ప్రాణాలొడ్డి జెండా ప్రతిష్ఠ కాపాడతాననేసరికి అధికార్లకు కాళ్ళాడలేదు. తల వేళ్ళాడవేసుకు పోయారు.

ఇంక మిగిలింది రౌడీమూకని పోగుచేసి తిట్టించడం, కాని దానికి ప్రజలు చలించలేదు.

సరిగ్గా నిర్ణయించబడిన వేళకు ప్రజలంతా వీధుల్లోకి వచ్చేశారు. బ్రహ్మాండమైన ఊరేగింపు కదిలింది.

వెంటనే పోలీసులుదిగారు. ఊరేగింపుపై తీవ్రమయిన లాఠీచార్జీలు - ఒక చోటకాదు - అనేకచోట్ల ప్రారంభించారు, 147 గురిని అరస్టు చేశారు. కాని, ప్రజలు చెదిరిపోలేదు. ఊరేగింపు నడుస్తూనే వుంది. సైన్యాలు వచ్చాయి. కాని సైనికులు అధికార్ల ఆజ్ఞలు తిరస్కరించి కాల్పు నిరాకరించారు.

"నిరాయుధులమీద కాల్చం. వాళ్ళకూ ఆయుధాలివ్వండి. పోట్లాడుతాం." అన్నారు వెంటనే సైన్యాల్ని వెనక్కి పిలిపించేశారు. నలుగుర్ని తప్ప నిర్బంధితుల నందర్నీ వదిలివేశారు.

అసమ్మతి సభలు

స్మారకదినంనాటి ఘటనలు ప్రజలను తీవ్రంగా ఉద్రేకపరిచాయి. ప్రజామండలి జూలై 29న ముసోరీలో అసమ్మతి ప్రదర్శనాలు చేసింది. 2000 మ.ది ఊరేగింపులో పాల్గొన్నారు. మీటింగు అనంతరం ప్రజలు ఇంటికి పోతూంటే సినిమాహాలువద్ద రాజా కనపడ్డారు. వెంటనే ప్రజలు ఆయన్ని చుట్టుముట్టి "హంతకున్నులు పోవాలి" 'నాయకుల్ని విడవాలి' 'శ్రీ దేవసుమన్ జిందాబాద్', అని నినాదా లివ్వసాగారు. పోలీసు ఇన్‌స్పెక్టరు సాయంతో రాజా 'తప్పించుకు' పోయారు.

జూలై 31 న డెహ్రాడూన్‌లో ప్రజామండలి సేవకులు సమావేశం అయ్యారు. నిర్బంధాలకి అసమ్మతి తెల్పుతూ తీర్మానాలు చేసి ప్రధాన మంత్రివద్దకు రాయబారం పంపడానికి నిర్ణయించారు.

అగస్టు 1న రాయబారులకి ప్రధానమంత్రి దర్శనం ఇవ్వలేదు, ఎక్కడికో వెళ్ళారన్నారు. చీఫ్ సెక్రటరీ ప్రజామండలి జాబును తీసుకోడానికి కూడా నిరాకరించారు.

సంస్థానంలో అన్నిచోట్లా అసమ్మతి సభలు జరిగాయి. చంగా చౌరాలో జరిగిన పెద్ద బహిరంగసభలో టెహ్రీకి ప్రజారక్షణ యాత్ర నడపడానికి నిశ్చయించారు. ఆజాద్ ఫౌజ్‌కి చెందిన లక్ష్మణ సింగ్ ... దళానికి నాయకుడిగా ఎన్నుకోబడ్డారు.

యాత్రాదళం బయలుదేరింది

ఆరోజునసే సంస్థానం నాలుగు దిశల నుంచీ వచ్చిన 600 మందికి పైగా వలంటీర్లు టెహ్రీ వేపు నడిచారు. "మా నాయకుల్ని విడవాలి" "వెట్టి, నజరానా లికముందు ఇవ్వం", "కార్మికులు వర్ధిల్లాలి", "భారత్ మాతకీ జై", మొదలగు నినాదాలతో దళం సాగింది.

ఇంక టెహ్రీ రెండుమైళ్ళు వుందనగా 'ధాదూ-కీ-మత్రీ' అనేచోట పెద్ద పోలీసు దళం వారిని ఆపడానికి ప్రయత్నించింది. కాని లాభం లేకపోయింది.

అక్కడి కొంతమైలు దూరంలో వున్న 'నిమ్లాసూ' అనేచోట బలమైన సైనికదళం వారి దారిని అడ్డగించింది. సంస్థానంలో వున్న పెద్ద అధికారులంతావారిని రాజభవనం వద్దకి పోకుండా అటకాయించడానికి హాజరయ్యారు. అరెస్టులు చేస్తామన్నారు. కాలుస్తామన్నారు. కాని ప్రయోజనం లేకపోయింది.

సైనికులు కాల్పునిరాకరించారు

కమాండరు నాథూసింగ్ కాల్చమన్నాడు సైనికుల్ని. వారు కదలలేదు. మళ్ళీ చెప్పేడు. ఈ మారు ఆయుధాలు క్రిందపెట్టేశారు. ప్రజలు ముందుకి సాగారు.

ప్రభుత్వం వారిని ఆపడానికి మరోమారు ప్రయత్నించింది. కాని లాభం లేకపోయింది. వారు నగరంలో ప్రవేశించారు. పట్టణప్రజలు కూడా వారితో కలిసారు. పెద్ద వూరేగింపు జరిపి 'కనగచేను' అనే పెద్ద మైదానంలో మీటింగు జరుపుకుందామని ప్రకటించారు.

చీకట్లో పోలీసుదాడి

అప్పటికే రాత్రి అయిపోయింది. సభా ప్రదేశానికి వెడుతూన్న ప్రజల వూరేగింపు గడియారం స్తంభంవద్దకు వచ్చేటప్పటికి పోలీసులు సన్నీల నుపయోగించసాగారు. వందలకొద్దీ జనం పడిపోయారు. జనం చదిరిపోలేదు. లాఠీలు, సన్నీలు స్వేచ్ఛగా ఉపయోగిస్తూ వారిని 'నిమ్లాసూ' వరకూ నెట్టుకు పోయారు.

ఒక వంద మందికి పైగా జనాన్ని అరెస్టు చేసి కాలేజీ భవనంలోపెట్టి రాత్రి అంతా తీవ్రంగా హింసించారు.

పోలీసుల, ఉద్యోగుల దృష్టి అంతా లక్ష్మణసింగంమీదే వుంది. ఆయనను స్మృతి తప్పేవరకూ కొట్టి తీసుకుపోయారు. ఆయన చచ్చిపోయాడో, బ్రతికే వున్నాడో ఇంత వరకు తెలియదు. పోలీసులు చంపివేశారని ఒక వదంతివుంది, కొందరు ఆయన తప్పించుకుపోయి రహస్యంగా పనిచేస్తూన్నా రంటారు.

తీవ్రనిర్బంధ విధానం

ఆరోజు మొదలుగా సంస్థానంలో తీవ్ర నిర్బంధ విధానం చెలరేగుతోంది. 'పట్టణాలలో సైనిక శాసనమే అమలు జరుగుతూందని చెప్పాలి. పల్లెటి ప్రజలపైబడి పోలీసులు చేస్తూన్నదౌర్జన్యాలకు మితిలేదు దోపిడీలు, ప్రజల్ని హింసించడం, స్త్రీలని చెరపట్టటం, దాగి తందనాలు. వేయడం ఒకటేమిటి—స్వేచ్ఛావిహారం సాగిస్తూన్నారు.

జైళ్ళలోవున్నవారికి తిండి పెట్టుపోవడము, లాఠీచార్జీలు. మితిమీరాయి. శ్రీదేవసుమన్‌ను చంపిన మోహనసింగ్ (జైలు అధికారి)ను తెచ్చి మళ్ళీ ఉద్యోగం ఇచ్చారు.

ప్రజలలో భేదాలు పెంచడానికి

ఈ వుద్యమంలో ప్రజామండలి కలియకుండా చేసేటందుకుప్రభుత్వోద్యోగులు తీవ్ర ప్రయత్నాలు చేస్తూన్నారు. ఈ వుద్యమాన్ని రాజుకు వ్యతిరేకమన్నారు. "నువ్వు రాజద్రోహివా, కాంగ్రెసువాదివా" ఇదీ వారు ప్రజలకి వేసే ప్రశ్న.

మహారాజావారి అన్నకొడుకు శూరవీర సింగ్ (ఇతనే పోలీసు మంత్రి) బ్రిటిష్ డిప్యూటీ కమీషనర్ సాయంకోసం పరుగెత్తాడు.

వందలకొద్ది టెహ్రీ పోలీసులు, స్పెషల్ బ్రాంచి పోలీసులు రహస్యంగా పనిచేస్తూన్న నాయకులకోసం బ్రిటిష్ అధీనంలోని ఘర్వాలాల్‌కూడా వెతుకుతూన్నారు.

ప్రత్యేకంగా కమ్యూనిస్టులమీదప్రభుత్వం తనదృష్టిని కేంద్రీకరించింది. ప్రజామండలి వారికి ఆశ్రయంఇస్తే ముఖ్యంగా సక్లానీకి (టెహ్రీ కమ్యూనిస్టు నాయకుడు, ప్రజామండలి కార్యకర్త)ఆశ్రయంయిస్తే ఖబడ్దార్ అని ప్రకటించారు

కాని ఘర్వాలాలు బెదరడం లేదు. క్రమంగా ప్రతిఘటన తీవ్రం అయింది. హిందోపట్టి, వదియార్ఘర్‌పట్టీలలో సైనికులు తాగివచ్చి అత్యాచారాలు ప్రారంభించేటంతకి గ్రామస్థులంతా ఏకమై వాళ్ళని జన్మలోమరచిపోకుండా తన్నారు.

ప్రధాన నాయకులు ప్రజలలోరహస్యంగా తిరుగుతూ క్రమపద్ధతిలో వుద్యమాన్ని నిర్మించుకు వస్తున్నారు. జైళ్ళలోవున్న నాయకులు ప్రభుత్వచర్యల్ని ప్రతిఘటించడానికై నిరాహారవ్రతానికి పూనుకున్నారు.

ప్రజామండలి నిర్ణయం ప్రకారం అగస్టు 11 న సంస్థానం అంతటా నిర్బంధ విధానాన్ని నిరసిస్తూ సభలు. వూరేగింపులు జరిగాయి. కాంగ్రెసు, కమ్యూనిస్టు నాయకులు కలిసి పనిచేశారు.

డెహ్రాడూన్‌లో ఆరోజునే బ్రహ్మాండమైన వూరేగింపు. సభ జరిగాయి. జయనారాయణ వ్యాస్ (అఖిలభారత సంస్థాన ప్రజామండలి కార్యదర్శి) నగేంద్రదత్త సక్లానీ (కమ్యూనిస్టు నాయకుడు)గారలు టెహ్రీనాయకుల్ని వెంటనే విడిచిపెట్టకుంటే సత్యాగ్రహం ప్రారంభించాలనే తీర్మానం మీ... ...నించారు.

బ్రిటిష్ ఘర్వాల్ జిల్లా కాంగ్రెసు కమిటీ సంస్థానంలో జరుగుతూన్న హింసాకాండను నిరసించి ప్రజానాయకుల్ని వెంటనే విడుదల చేయకుంటే తామూ సత్యాగ్రహం, చేస్తామని తీర్మానించారు. అందుకు అనుమతి యివ్వవలసిందని ఎ. ఐ. సి. సి. కి, రాష్ట్ర భారత నాయకులకి విజ్ఞప్తి పంపారు.

అగస్టు 12 న సంస్థానోద్యోగుల సంప్రదించడానికి జయనారాయణ్ వ్యాస్, డాక్టర్ కుశాలీనంద గైరోలా (కాంగ్రెస్ ఎమ్. ఎల్. ఏ.), కల్నల్ పీత్రాచంద్ ఖాతి (ఆజాద్ ఫౌజ్) గార్లు నరేంద్ర నగర్ వెళ్ళారు. అవమానకరమైన రాజీ చేసుకువస్తే మేము అంగీకరించమని రాయబారులకు పీడ్కోలు సభలో హెచ్చరిక నిచ్చారు, ప్రజలు.

ఘర్వాలీలు సంపూర్ణమైన ఐక్యతతో సంస్థానానికి వెలుపలా, లోపలా కూడా పోరాటానికి తయారవుతున్నారు.

విష బిందువులు

ఈ సమయంలో జయనారాయణవ్యాస్ ఒక అవకతవక ప్రకటన చేశాడు.

"టెహ్రీ సంస్థానంలో 'మార్షల్ లా' ప్రకటించారని విని నేనూరుకోలేకుండా వున్నాను.

"నా అభిప్రాయంలో టెహ్రీ ప్రధానమంత్రి వుద్దేశ్యంమంచిదే.

"టెహ్రీలో ప్రజామండలి వాళ్ళకేపై కాదువుంట. రాజీయే పనికిరాదనే జనం కొందరున్నారు. 'ఫోటాలో నించి తప్పించే' లనే వారు కొందరు. పౌరసత్వపు హక్కులు కావాలంటారు అటా... వారు. కొందరు బ్రాహ్మణులూ, రాజపుత్రులూ తమ బంధుకోటిని వుద్యోగాలలో మార్చాలని ప్రయత్నిస్తూన్నారు."

ప్రజామండలిపై అధికారులకు ఇష్టం వుందన్నట్లుగా "ప్రజామండలివారిని జైళ్ళ నుంచి వదలివేశారు. ప్రజా మండలి సభ్యత్వం 'చేర్చుకోడానికి అభ్యంతరాలు పెట్టడంలేదు". అన్నారు

ప్రజామండలిపై అధికార్లకు అయిష్టం లేదు. అధికార్లపై వ్యాస్‌కి మంచి "వుద్దేశ్యం" వుంది. ఇంకలోపం ఎవరిది? 'తలతిక్క' కమ్యూనిస్టులవలన, సైన్యప్రచారకులవలన, బ్రాహ్మణ-రాజపుత్ర తగాయిదాల వలన వచ్చింది ఈ రభస అంతా! సక్లానా సంస్థానోద్యోగుల మాటల ప్రతిధ్వని!

అధికార్లకు దారి దొరికింది

ఈ మాటల్ని అధికార్లు బాగా ఉపయోగించుకున్నారు. ఎంతవరకు వారు ఉపయోగించుకున్నదీ కాంగ్రెసు ఎం. ఎల్. ఏ. డాక్టర్ కుశాల్‌నంద గైరోలా మాటలే మనకి తార్కాణం.

"ప్రజామండలి ఈ ఘటనలలో ఏమీ బాధ్యతలేదనీ, దౌలత్ రాయ్‌నూ, ఆయన సహకారులనూ అరెస్టు చేసుకోవచ్చునని నేను తమతో చెప్పినట్లుగా సంస్థానాధికారులు దుష్ప్రచారం చేస్తూన్నారు. నేను లేని సమయంలో రైతు ఉద్యమాన్ని అణచివెయ్యడానికి అధికార్లు పన్నిన ఎత్తు ఇది."

వ్యాస్‌కూ, సంస్థానాధికార్లకూ గైరోలా తగిన జవాబునిచ్చాడు.

"టెహ్రీలోని నోరులేని అమాయిక ప్రజల్ని మేల్కొలపడానికై దౌలత్‌రాం, ఆయన సహచరులూ అద్భుతమైన కృషి చేశారు. ఉద్యమాన్ని ఇంత బలమైన స్థితికి వారే తెచ్చారు.

"వారిని బయటకు తీసుకువచ్చేదాకా, ప్రజల కోరికలు ఫలించేదాకా మనం చేతులు ముడుచుకు కూర్చోము"

ఘర్వాలీప్రజల మాటలే ఇవి!

కడవెండి కాల్పులపై విచారణ జరపాలి

కరీంనగర్ జిల్లా ఆంధ్రమహాసభ తీర్మానాలు

కరీంనగర్ జిల్లా ఆంధ్రమహాసభ కార్యవర్గం శ్రీ రఘునాథరావుగారి అధ్యక్షతను జరిగింది.

ఈ సమావేశంలో కడవెండి కాల్పులపై నిష్పాక్షిక విచారణ జరిపించ వలసినదని కోరుతూ ఒక తీర్మానం చేశారు.

ఆ తీర్మానంలో యిలా వుంది.

"జనగాం తాలూకా కడవెండిలో దేశముఖురౌడీలు ఆంధ్రమహాసభ కార్యకర్తలపై జరిపిన ఘోరమైన కాల్పులకూ దురంతాలకూ ప్రజానీకం భీతిల్లుతోంది. ఈకాల్పులకు గురి అయిన శ్రీ దొడ్డి కొమరయ్యగారు దౌర్జన్యపరుల రక్తపిపాసకు ఆహుతి అయ్యారు. నిజాంప్రభుత్వం దౌర్జన్య కారకులను, నేరస్తులను పట్టుకొని శిక్షించవలసిందిగా కోరుతున్నాం.

పత్రికలు - పౌరసత్వ హక్కులు

ఆంధ్రమహాసభాధ్యక్షులైన రావి నారాయణరెడ్డిగారికి 'నవయుగ' పత్రికకూ, కార్మిక నాయకులైన మగ్దుంగారికి 'ఇన్సాఫ్' పత్రికకూ అనుమతివ్వక కాలయాపన చేస్తున్న నిజాం ప్రభుత్వ చర్యను ఈ సమావేశంవారు గర్హించారు. 'ప్రజాశక్తి' వన పత్రికను సంస్థానంలోకి రానీయకుండా నిషేధించిన ప్రభుత్వ చర్యనుకూడ తీవ్రంగా ఖండించారు. సామాన్య పౌరసత్వ హక్కులకే భంగకరమైన ఇట్టి చర్యలను మానుకోవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు.

ఖమ్మంలో గూండాల దౌర్జన్యం

హిందూ, ముస్లిం ఐక్యతను భగ్నపరచడానికి జాగీర్దార్ల ఎత్తు

22-8-46 వ తేదీన కొంతమంది రిక్షా బజారు హిందువులు ముత్యాలమ్మ గుడికి పూజకు పోతూవుండగా కొందరు ముస్లిం రౌడీలు అడ్డుపడి నానాబూతులు కూసి రెచ్చగొట్టారు. గుడినుండి తిరిగివస్తున్న ప్రజలపై పడి తీవ్రంగా కొట్టారు. ఒకస్త్రీకి మరివొక పురుషునికి గాయాలు తగిలినవి.

ఈ సంగతి తెలియడంతోనే సాయంత్రం 7 గం॥ లకు స్థానిక మసీదువద్దనుంచి ఇంకొక గూండాలముఠా బయలుదేరింది. దారిన కనపడ్డ వాళ్ళనల్లా కొట్టారు. ముప్పై మందికి గాయాలు తగిలినై. ఏడు, ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఈ విధంగా రాత్రి 10 గంటలదాకా గూండాల దౌర్జన్యం నిరాఘాటంగా సాగింది. శాంతి రక్షణకు బాధ్యత వహించిన పోలీసు శాఖ ఈ రౌడీల దారుణచర్యలను అరికట్టుటకు ఏ మాత్రం పూనుకోలేదు. ప్రభుత్వ యంత్రం పనిచేస్తోందా లేదా అనే సంశయం ప్రజలలో యేర్పడింది.

ఈ రీతిగా ప్రజలపై ముస్లిం గూండాలు లోగడకూడా తీవ్రంగా దాడిచేశారు.

ఈ విచ్చలవిడి దాడులకు కారణం ఏమిటి?

తెల్దారుపల్లి జాగీరు రైతులు తమపైసాగే దోపిడిని ఎదిరించినపుడు, ముస్లిం జాగీరుదార్లను హిందువులు నాశనం చేస్తున్నారని ముస్లింప్రజలను మోసపుచ్చుటకు తెల్దారుపల్లి జాగీరుదారు ప్రయత్నించారు. కాని విఫలులైనారు. ప్రజాఉద్యమంముందుకుపోయింది. ఇట్టి జాగీరుదార్లకు అండగావున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా గూడా ప్రజలు పోరాటానికి సిద్ధపడుతున్నారు.

అందుచే తెల్దారుపల్లి జాగీరుదారు, అతనివంటి ఇతర ప్రజా వ్యతిరేకులు ముస్లిం గూండాలచేత ప్రజలపై దాడి చేయించి ప్రజా ఉద్యమాన్ని అణచడానికి ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాక ఈ విధంగాహిందూ ముస్లిం ప్రజలనురెచ్చగొట్టి, హిందూ-ముస్లిం కలహాలను కల్పించుటకు కుట్రలు పన్నుతున్నారు.

కనుక ఈ గూండాల దాడులు, దౌర్జన్యాలు మతకలహాలుకావు. దోపిడిదార్లకు వ్యతిరేకంగా హిందూ - ముస్లిం పేద ప్రజలలో ఏర్పడిన ఐక్యతను భగ్నంచేయుటకు, ప్రజా ఉద్యమాన్ని బలహీన పరచుటకు జరుగుతున్న గూండాచర్యలే యివి.

విజ్ఞప్తి

ఈ ముస్లిం గూండాలదాడి ముస్లిం ప్రజలందరిచే చేయబడిందని తలచవద్దని హిందూ ప్రజలకు విన్నపం. ముస్లిం అభివృద్ధి నిరోధకులు కావాలని కోరేదేయిది. హిందువులు రెచ్చిపోయి, ముస్లిం ప్రజలపై దాడిచేస్తే, అప్పుడు ముస్లిం ప్రజలందర్నిని పోరాటంలోనికి దింపవచ్చునని వారి యెత్తు. ఒకవైపున ముస్లిం గూండాలదాడికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ చేసుకుంటూ ముస్లిం ప్రజల సహకారంతో ఈ గూండాచర్యలను అరికట్టుటకు ప్రయత్నించాలి.

ఈ పరిస్థితులలో ముస్లిం ప్రజలపైన ప్రత్యేక బాధ్యతయున్నది. మీరు ముస్లిము గూండాల దౌర్జన్యాల ఖండించాలి. హిందూ ప్రజలతో కలసి ఈ గూండాల నెదిరించాలి. ముస్లిం మతం పేరిట హిందూ, ముస్లిం పేదప్రజల గొంతులు గోసే కార్యక్రమం లోనికి ఈడ్చుటకు జరుగుచున్న ప్రయత్నాలను ప్రతిఘటించాలి.

ముస్లింమతం పేరిట లేక హిందూమతం పేరిట చీలికలు తెచ్చే ప్రతిచర్యను ఎదిరించండి. మీ ఐక్యతను కాపాడండి. ఈ విధముగా పట్టణంలో కొట్లాటలు రాకుండా అరికట్టండి.

— ఖమ్మం పట్టణకమ్యూనిస్టుకమిటి

— ఆంధ్రమహాసభ

ఇండియాను వదలిపోవడమంటే ఇదేనా?

భారత దేశంలో బ్రిటిష్ మిలిటరీప్లానులు

"బ్రిటిష్‌వాళ్ళు ఇండియాను విడిచి వెళ్ళిపోతున్నారు" అన్నారు మన కాంగ్రెసు నాయకులు.

లేదు! వెళ్ళటం లేదు. ఇంకా అదనంగా కూడా వస్తున్నారు.

కరాచీ వద్దనున్న డ్రిగ్‌రోడ్ వైమానికుల క్యాంపులో కొత్తగా ఇంగ్లండు నుంచి దిగుమతి అవుతున్న బ్రిటిష్ వైమానికుల భార్యలకోసమని 18 భారతీయ వైమానికులను ఇళ్ళు ఖాళీ చేయవలసిందిగా ఉత్తరవులు ఇవ్వబడ్డాయి. ఆ ఇళ్ళు భారతీయులకోసం కట్టలేదట!

భారతీయ వైమానికుల కిచ్చే జీతం నెలకి రు 60 లు. ఈ తక్కువజీతంలో కరాచీలాంటి పట్టణంలో, ఎక్కువ అద్దెలుపోసి వేరే ఇళ్ళు తీసుకుని నివసించమంటే ఎంతకష్టమో వేరే చెప్పనక్కరలేదు.

ఇంకో నిదర్శనం....

రహస్య సర్క్యులరు

బ్రిటిష్‌వాళ్ళు వెళ్ళదలచుకో లేదనడానికి ఇంకో నిదర్శనం!

జూన్ 19 వ తేదీని బ్రిటిష్ విమాన శాఖనుంచి. భారత విమానశాఖకు ఒక రహస్యసర్క్యులరు వచ్చింది. అందులో వున్న విషయం ఇది :

(1) "రెండు నెలల నోటీసులో మీ (భారత) వైమానికకేంద్రం ఈ క్రింద సూచించిన విమానదళాలకు ఆశ్రయం ఏర్పాటుచేసి, అవి పనిచేయడానికి తగిన అవకాశాలు కలిగించేలాగ నిర్మింపబడి వుండాలి.

—4 దూరప్రయాణం చేయగల బాంబరు విమాన దళాలు

—3 పగలుపయోగించే ఫైటరు విమాన దళాలు

—4 పెద్ద సరఫరా విమానా దళాలు అంటే మొత్తం 11 విమానదళాలు

(2) "ఇవన్నీ 1946 డిసెంబరు నాటికి మీరు (భారత వైమానికశాఖ) ఏర్పాటు చేసుకునే (10) విమానదళాలు కాకుండా అదనంగావచ్చే "రిజర్వు" దళాలుఅని తెలుసుకోవాలి.

(3) "1950 నాటికి, 6 దూరప్రయాణం చేయగల బాంబరువిమాన దళాలు, 3 తేలిక బాంబరు దళాలు, 3 దూర ప్రయాణం చేయగల ఫైటరు విమాన దళాలు, 5 మామూలు ఫైటరు విమానా దళాలు 1 సింగిల్ ఇంజనుగల చిన్న విమానదళం-అంటే మొత్తం 18 విమాన దళాలకు - ఆశ్రయం నిర్మించేందుకు కావలసినప్లానులన్నీకూడతయారుచేయాలి."

ఇదీ సర్క్యులరు.

వాగ్దానాలు

యుద్ధానికి పూర్వం ఇండియాకు 1 విమానదళం వుండేది యుద్ధపు రోజుల్లో అది 9 దళాలకు పెరిగింది. ఇంకాకొద్ది రోజుల్లో దానిని 10 దళాలకు పెంచుతామని కమాండర్ ఇన్‌ఛీఫ్ ఆకిన్లెక్ "వాగ్దానం" చేశాడు.

పైనచెప్పిన ఇంగ్లండు నుంచివచ్చే "రిజర్వు" దళాలు 29 కూడా దీనికి అదనంగానే మనం గమనించాలి!

రాయబారాల కోసం ఇక్కడికి వచ్చినపుడు, క్రిప్సు, పెథిక్ లారెన్సుదొరలు "బ్రిటిష్ సైన్యాలు ఇండియాలో వుండడమా విడిచి వెళ్ళిపోవడమా అనేది కొత్తగా ఏర్పడబోయే స్వతంత్ర భారత ప్రభుత్వం నిర్ణయంమీదనే ఆధారపడివుంటుంది. మాదేమీలేదు" అని ఒక "వాగ్దానం" చేశారు.

ఇందులో సదుద్దేశమేవుంటే 1950 సం॥ వరకూ ఈప్లానులూ రహస్య సర్క్యులర్లు ఎందుకు?

తమకోసం భారతీయ విప్లవంనుంచి భారతదేశాన్ని "రక్షించ" డానికే యీ ప్లానులు కాబోలు!

బ్రిటిష్‌వాళ్ల ఇండియాను విడిచివెళ్ళిపోవడమంటే ఇదేనా?

దీనికిఇప్పుడు, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పరచిన మన కాంగ్రెసు నాయకులు ఏమంటారు.

భారత నావికులమీద మరో దండయాత్ర

భారత నావికులమీద బ్రిటిష్ దొరల దాడి మళ్ళీ సాగించదలచారా అనిపిస్తోంది!

బొంబాయిదగ్గరలో నావ్లా అనే నౌకా ట్రైనింగు సెంటరులో "శివాజీ" అనే ఓడమీద రేటింగ్సుకు, 79 మందికి శిక్షలు విధించారు, శిక్షలంటే జైలుకు పంపడంకాదు. బర్తరఫ్‌లు, సస్పెన్సన్లు 14 మందిని బర్తరఫ్‌చేశారు. 40మందిని 15 రోజుల చొ॥ సస్పెండు చేశారు. ఇంకో 25 మంది సంగతి కొద్దిరోజులలో తేలుతుంది.

వారు చేసిన నేరం ఏమిటో తెలుసా?

అగస్టు 13 వ తేదీన పండగ సందర్భంలో సెలవు కావాలని కోరారు. అప్పటిమట్టుకు కెప్టెన్ లొంగి సెలవు యిచ్చాడు (వివరాలు 1-9-46 ప్రజాశక్తి 6 వ పేజీలో చూడండి).

కాని తరువాత వారికి ఇచ్చిన బహుమానాలు ఇవి!

అంతేకాదు. ఈ డిస్మిస్ చేయబడిన వారికి చేతికి దమ్మిడీ ఇవ్వకుండా క్యాంపునుంచి తరిమివేశారు. ఆస్పత్రిలో రోగంతో పడివున్న యస్. కె. స్వామి అనే రేటింగును, అప్పటికప్పుడు డిశ్చార్జి చేసి, సామానులన్నీ లాగొకొని బయటికి పంపేశారు.

ఈ ఉదంతాలన్నీ రేటింగ్సులో ఆగ్రహాన్ని కల్గిస్తున్నాయి. ఫిబ్రవరిలో జరిగిన దానికి అధికారులు ఇంకా కక్ష సాధిస్తున్నారా అనిపిస్తోంది.

['పీపుల్స్'ఏజ్ నుంచి]

మన లలితకళలపై రష్యన్‌ప్రజల ఆసక్తి

రష్యన్ భాషలో ఋగ్వేదం, భగవద్గీత భారత భాగవత, రామాయణాది గ్రంధాలు

భారతీయ సాహిత్యంలో, భారతీయ కళాసంపత్తిలో సోవియట్ ప్రజలకెంతో ఉత్సాహం. వివిధదేశాల్లో ఉన్న ఉత్తమసాహిత్యాన్ని, విజ్ఞానాన్ని ప్రజలందరికి అందించడమే సోవియట్ ప్రభుత్వ ఆశయం. ఈ ఉద్దేశంతోనే జగద్విఖ్యాత పండితుడు రాహుల్‌జీని రష్యాకు ఆహ్వానించింది. రాహుల్‌జీ తన రచనలద్వారా హిందీసాహిత్యానికి మహోపకారం చేసాడు. సంస్కృతపాళీ సాహిత్యాల్లో అతను అందెవేసిన చేయి.

భారతీయ నాట్యకళ

లెనిన్‌గ్రాడ్ యూనివర్సిటీలో భారతీయ నాట్యకళకు సంబంధించిన ఒక ప్రత్యేక మ్యూజియం ఉంది. అనేకరకాలైన భారతీయ వాయిద్య విశేషాలుకూడా ఈ మ్యూజియంలో ఉన్నాయి. భారతీయ చిత్రాలతో ఈ ప్రదర్శనశాలను చక్కగా అలంకరించారు. భారతదేశంలో నాట్యకళ ఎలా అభివృద్ధిఅయిందో తెలియజేయడానికి మధురలో 'రాసలీలా' నృత్యాన్ని, కాశ్మీరులో 'చంద్ర' నృత్యాన్ని, బెంగాల్లో 'యాత్రా' నృత్యాన్ని మలబారులో 'కథాకళి' నృత్యాన్ని నటులతోసహా (వేషాలతో ఉన్నప్పుడు, లేనప్పుడు) ఫొటోలు తీసి చక్కగా ప్రదర్శించారు. భారతదేశంలో ఇంకా సజీవంగాఉన్న ప్రజా నాట్యాన్ని చూచిసోవియట్ కళాభిజ్ఞులెంతో ఆనందిస్తూ ఉంటారు.

శిల్ప లలిత కళలు

భారతీయ శిల్పాన్ని గురించి సుర్యామెవ్ రష్యన్ భాషలో ఒక చక్కని పుస్తకం రాశాడు. రష్యన్ పత్రికల్లో ఇతను తరుచుగా భారతీయ లలితకళల్ని గురించి రాస్తూ ఉంటాడు. సింధులోయలో ఉన్న అనేక పురాతనవస్తువుల్ని స్వయంగా పరిశోధించాడు.

గుప్తులకాలంనాటి శిల్పకళా విశేషాల్ని గురించి అనేక నూతన విషయాలు కని పెట్టాడు.

సోవియట్‌లో 'శాకుంతల' ప్రదర్శనం

భారత ప్రాచీన సాహిత్యాన్ని గురించీ, నవీన సాహిత్యాన్ని గురించి సోవియట్ ప్రభుత్వం ఎంతో శ్రద్ధచూపుతూఉంది. రష్యా అంతటా ప్రసిద్ధిగాంచిన కామెర్నీ థియేటర్‌లో మొట్టమొదట ప్రదర్శించిన నాటకం మహాకవి కాళిదాసు రాసిన అభిజ్ఞాన శాకుంతలమే. 1945 లో జరిగిన సోవియట్ విజ్ఞాన పరిషత్ వార్షికోత్సవంలో సుప్రసిద్ధ విజ్ఞాన శాస్త్రవేత్త అలెక్సీ బరాన్నికోవ్ భారతీయ పౌరాణిక సాహిత్యాన్నిగురించి విపులంగా తెలియజేశాడు.

సోషలిస్టు విప్లవానంతరం రష్యన్ ప్రజల్లో ప్రాచ్య భాషల్ని గురించి సమగ్రంగా తెలుసుకోవాలనే ఒక నూతనోత్సాహం బయలుదేరింది. ప్రాచ్యభాషల్లో ఉన్న సాహిత్య విశేషాల్ని రష్యన్ ప్రజలకు అందజేయడానికి, 1922 లో 'వోస్టక్' అనే ఒక పత్రికను ప్రారంభించారు. (వోస్టక్ అంటే 'తూర్పు' అని అర్థం) ఈపత్రికలో భారతీయ సాహిత్యాన్నిగురించి-ఋగ్వేదంనుంచి బంకిం చంద్ర చటర్జీ, రవీంద్రనాథ టాగోర్ వరకు - అనేకవ్యాసాలు ప్రకటించారు. ఋగ్వేదంలో ఉన్న ఋక్కుల్ని బోరిస్ లారిన్ అదే ఛందస్సులో రష్యన్ భాషలోకి అనువదించాడు. సుప్రసిద్ధ పండితుడు చెర్బాస్కీ దండి సంస్కృత భాషలో రాసిన (7వ శతాబ్దం) దశకుమార చరిత్రను అనువదించాడు. చెర్బాస్కీ బౌద్ధతత్వ శాస్త్రంలో ఆరితేరిన మహాపండితుడు.

ద్వితీయ ప్రపంచ మహాయుద్ధానికి పూర్వం ఈ వ్యాసకర్త (దోంగెర్కీ) కాళిదాసు రాసిన రఘువంశ మహా కావ్యాన్ని అదే ఛందస్సులో అనువదించాడు.

ప్రాకృత సంస్కృతభాషల్లో నుంచి రష్యన్ భాషలోకి మార్చిన అనువాదాలు ఇంకా అనేకం ఉన్నాయి

ఆధునిక భారతీయభాషల్లో నుంచి కూడా అనేక అనువాదాలు వెలువడుతూ ఉన్నాయి. ఈ విషయంలో అలెక్సీ బరాన్నికోవ్ చేసినకృషి ఎంతో ప్రశంసనీయమైనది. భాగవతంలోని దశమస్కంధాన్ని ఇతను రష్యనుభాషలోకి అనువదించాడు

పందొమ్మిదో శతాబ్దములో లల్లూలాల్‌జీ హిందీలో రాసిన 'ప్రేమసాగర్' అనేగ్రంథాన్ని కూడా ఆ సంపుటిలోనే ప్రకటించాడు.

ద్వితీయప్రపంచమహాయుద్ధం ఆరంభం అయ్యేముందు తులసీరామాయణాన్ని సంపూర్ణంగా రష్యన్ భాషలోకి రాశాడు.

పంచతంత్రం, హితోపదేశం బౌద్ధ జాతకాలనుంచి అనేక కథలు రష్యాలో పూర్తిగాప్రచారం అయ్యాయి. నావికోవ్ 'భగవద్గీతను' అనువదించాడు. మహాభారతంలో నుంచి 'నలచరిత్ర' మొదలైన అనేక ముఖ్యభాగాల్ని ముఖోవ్‌స్కీ చక్కని రష్యన్ భాషలో రాశాడు.

మహాభారతంనుంచి సుందోపసుందుల చరిత్ర, భాగవతాన్నుంచి ధ్రువ చరిత్ర, కథాసరిత్ సాగర్‌నుంచి విద్యాధర జీమూతవాహనుని కథను కొసోవిచ్ చక్కని భాషలో అనువదించాడు.

భేతాళ పంచవింశతికి రష్యన్‌భాషలో రెండు అనువాదాలు ఉన్నాయి. ఒకటి జంబాల దత్తుననుసరించి మరొకటి శివదాసు ననుసరించి రోసలీషాన్ రాశాడు.

వాస్లీమర్ కల్యేనోవ్ ప్రస్తుతం పంచమవేదమైన మహాభారతాన్ని సమగ్రముగా రష్యన్ భాషలో అనువదిస్తూ ఉన్నాడు. కొద్దిరోజులలో ఈఅనువాదం పూర్తి అవుతుంది.

ఇదేవిధంగా టాగోరు రచనలన్నీ దాదాపు రష్యన్ భాషలోకి అనువదించారు.

(టాస్, ఇండోసోవియట్ జర్నల్‌నుండి)



సోవియట్‌లో ప్రాచ్యప్రాచీన సాహిత్యంపై పరిశోధనలు చేయుచున్న భారత పండితుడు రాహుల్ సాంకృత్యాయన్

కేపిటలిస్టు, కమ్యూనిస్టు సమాజాలలో స్వాతంత్ర్యానికివున్న వ్యత్యాసం

(8 వ పేజీ తరువాయి)

ఇలాగ అందరికీ సమానతనిస్తూ, ఉత్పత్తి పరికరాలను సంఘపరంచేసే కమ్యూనిస్టు విధానం వచ్చిందనుకోండి. అప్పుడు ఎవడేనావ్యక్తి ఆ విధానానికి ఎదురుగా పనిచేస్తూన్నప్పుడు, ఆ విధానాన్ని త్రోసివేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, అతడు ఏమిచేస్తున్నట్టు? అందరికీ సమానంగా ఉన్న వ్యక్తి స్వాతంత్ర్యాన్ని పోగొట్టడానికి ప్రయత్నించడం లేదా? అటువంటి మనిషి ప్రయత్నాలను ఆపుచేయడం వ్యక్తి స్వాతంత్ర్యానికి (అందరి) దోహదం చెయ్యడమా, అపకారం చెయ్యడమా? కమ్యూనిస్టు విధానాన్ని ఎదిరించేవ్యక్తుల ప్రయత్నాలను అరికట్టడం, వ్యక్తి స్వాతంత్ర్యానికి ఉపకారం చెయ్యడమే అవుతుంది. అందువలన కమ్యూనిస్టు రాజ్యంలో కమ్యూనిస్టువిధానానికి శత్రువు లయినవారు జాగ్రత్తగా అదిమిపెట్టబడతారు. అదిచూచి, వ్యక్తిస్వాతంత్ర్యం పోయింది! పోయింది! అని గెంతులు వేయడం వ్యక్తిస్వాతంత్ర్యాన్ని అర్థం చేసికోకపోవడమే.

కేపిటలిస్టు సమాజమూ - కమ్యూనిస్టు సమాజమూ.

కేపిటలిస్టు విధానంలో అధికసంఖ్యాకుల అవకాశాలు పోగొట్టబడతాయి. వారి క్రియా స్వాతంత్ర్యం విచ్ఛిన్నం చేయబడుతుంది. అధిక సంఖ్యాకుల క్రియా స్వాతంత్ర్యం పోవడం నుండి, వారిలో ఆందోళన, అలజడి ఎక్కువగా ఉంటుంది. దానిని కేపిటలిస్టు విధానం అణచలేకపోతుంది. అందువలన వారికి ఆ విధానాన్ని ఎదుర్కొనే స్వాతంత్ర్య మేదో ఉన్నట్లగపడుతుంది. చేతనైనంతవరకు సిద్ధాంతపూర్వకమైన స్వాతంత్ర్యానికి కూడా లెక్కచేయకుండా వారిని అన్నివిధాలా అణచడానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది కేపిటలిస్టు ప్రభుత్వం. కమ్యూనిస్టు రాజ్యంలో అధికసంఖ్యాకుల స్వాతంత్ర్యాన్ని పోగొట్టే విధానాన్ని తేవడానికి ప్రయత్నిస్తున్న కొద్దిమంది అణచివేయబడతారు. దానితో కమ్యూనిస్టు విధానంలో వ్యక్తి స్వాతంత్ర్య ముండదనుకోడం పొరపాటు.

కేపిటలిస్టు విధానంలో సంఘానికి ఉపయోగించే పనిని దేనినీ చెయ్యకుండా భోగాలను భవిస్తూ కూర్చోడానికి కొందరికి అవకాశాలున్నాయి. కమ్యూనిస్టు విధానంలో ఈ అవకాశాలు పోతాయి. సంఘానికి ఉపయోగించే పనిని దేనినో ఏదో రూపంలో చెయ్యకపోతే తిండికి అవకాశా లుండవు. ఊరక భోగాలను అనుభవించే అవకాశం పోవడాన్ని వ్యక్తి స్వాతంత్ర్యం నశించడ మనుకోవడం పొరపాటు.

ఏ వస్తువయినా శ్రమవల్ల ఉత్పత్తి అవుతుంది. గాలి తప్ప శ్రమలేకుండా ప్రకృతిలో ఆ పాళంగా దొరికేది లేదు. అందుచేత ఏ మాత్రం శ్రమతీసికోని మనుష్యులకు, కమ్యూనిస్టు ప్రభుత్వంలో గాలిని తప్ప ఇతర పదార్థా లనుభవించే అవకాశం లేకపోవడం సమంజసమే. సంఘంకోసం ఏదోరకంగా రచనలలోనో, శాస్త్రాన్వేషణలోనో, ఫాక్టరీలలోనో, పొలంలోనో కొంత పనిచేసిన వానికి శ్రమవల్ల ఉత్పత్తిఅయ్యే వస్తువులను అనుభవించడానికి హక్కు వస్తుంది.

కమ్యూనిస్టు విధానంలో ఒకవ్యక్తి ఇతరుల రెక్కల కష్టాన్ని అపహరించకుండా, తన శక్తులను విజృంభింపచేసుకుందుకు పూర్తి అవకాశా లుంటాయి. సిద్ధాంతపూర్వక స్వాతంత్ర్యమే కాక, క్రియాపూర్వక స్వాతంత్ర్య ముంటుంది. ఇతరుల స్వాతంత్ర్యాన్ని అపహరించేందుకు స్వాతంత్ర్యం, సంఘానికి పనికి వచ్చే ఏ పనీ చేయకుండా కూర్చుని భోగా లనుభవించే స్వాతంత్ర్యం కమ్యూనిస్టు విధానంలో ఉండవు. అవికావలసినవారికి కమ్యూనిస్టు విధానంలో వ్యక్తి స్వాతంత్ర్య మగపడడం లేదంటే ఆశ్చర్యం లేదు.

అగ్రరాజ్యాల ఐక్యతను భంగపరచుటకు

శాంతిసమావేశంలో సామ్రాజ్యవాద కుట్రలు

— ఫ్రాంకు పిట్‌కైరన్ —

సుప్రసిద్ధ పత్రికా విలేఖరి ఫ్రాంకు పిట్‌కైరన్, శాంతి సమావేశాన్ని సింహావలోకనం చేస్తూ పారిస్‌నుంచి ఇలా రాస్తున్నాడు:

ఇంతవరకు సాగిన శాంతి సమావేశ కార్యక్రమంలో ప్రధానరాజ్యాల విభిన్నదృష్టి నాలు స్పష్టంగా వెల్లడయాయి. ముఖ్యంగా లెక్కించతగిన విషయం ఇదే.

ఆంగ్లో అమెరికన్ కూటమి

ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్య ప్రభుత్వాలు ఒకకూటమిగా పనిచేస్తున్నాయన్నది శాంతి సమావేశంలో స్పష్టంగా కనబడుతూంది. అగ్రరాజ్యాలమధ్య పరిష్కారం కావలసిన సమస్యలు ఇంకా ఎన్నో ఉన్నప్పటికీ, వెంటనే శాంతి సమావేశం జరిపించాలని అమెరికా సామ్రాజ్యవాదులు లోగడ బైరన్సుమీద ఒత్తిడి తెచ్చారు. బ్రిటన్, అమెరికా తొత్తుల నుపయోగించుకొని సోవియటును జయప్రదంగా ఎదుర్కొనగలమని వారు ఆశించారు. ఇప్పుడు, చిన్నల దేశాల స్వాతంత్ర్యాన్ని నిర్దాక్షిణ్యంగా అణగత్రొక్కి తమ పెత్తనాన్ని నిలబెట్టుకోవాలనే దృష్టితో శాంతి సమావేశంలో ఆంగ్లో-అమెరికన్ కూటమి వ్యవహరిస్తున్న విధానం ఈ సామ్రాజ్యవాదులకు, బ్రహ్మానందం కలిగిస్తూంది.

తమవంటి దురుద్దేశాలేవీలేవని బ్రిటన్ అమెరికా ప్రభుత్వాలు అన్నాయి. కాని శాంతి సమావేశ చర్చలను విన్నవారందరికీ ఈ మాటలు శుద్ధ బూటకమని స్పష్టంకాక తప్పదు.

దురుద్దేశం

మరోవిషయం ఏమిటంటే - ప్రజాతంత్ర పునర్నిర్మాణానికి దోహదంకాగల పోట్సుడాం నిర్ణయాలు ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదులకు మహా కంటకంగా వున్నాయి. వాటిని రద్దు చేయడం వారి ముఖ్య ఆశయం. వాటితోపాటు, ఆ నిర్ణయాలకు ప్రాతిపదిక అయిన అగ్రరాజ్య ఐకమత్యాన్ని కూడా విచ్ఛిన్నం చేయాలని వారి కోరిక. ఇందుకు శాంతి ఒడంబడికల విషయంలో అంగీకారం కుదరని అంశాలపై ప్రతిష్టంభన తేవాలనీ, చిన్న రాజ్యాల పేరిట తమ కీలుబొమ్మల నుపయోగించాలనీ వీరి పన్నాగం.

వోటింగు సమస్య విషయంలో వీరి ప్రవర్తన ఈ పన్నాగాన్ని బయటపెడుతూంది. మూడింట రెండు వంతులు మెజారిటీ పద్ధతికి విదేశాంగ మంత్రుల సమావేశంలో బ్రిటన్ అమెరికాలు అంగీకరించినప్పటికీ, చిన్న రాజ్యాల అభిప్రాయమంటూ, దానికి వ్యతిరేకంగా ఆస్ట్రేలియా ప్రతినిధిచేత ఒక నాటకమాడించారు. మూడింట రెండువంతులు మెజారిటీ పొందిన తీర్మానాలతో పాటు, ఒకటి రెండు వోటు మెజారిటీ వచ్చే తీర్మానాలకు కూడా స్థానం ఉండేలా చేశారు.

దీని ఫలితం ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కరలేదు యుగోస్లావియా ప్రజలకు సంబంధించిన ఒక సమస్య ఏ ఆస్ట్రేలియా వోటుతోనో, లేక మెక్సికో వోటుతోనో, అటో ఇటో తేలి పోతుందన్నమాట. లేకపోతే, హంగరీ, జకోస్లోవేకియా దేశాలకు చెందిన సమస్యను ఏ న్యూజిలాండో, బ్రెజిలో తన వోటుతో తేల్చివేయ గలుగుతుందన్నమాట. ఇది ఎంత సక్రమమైనపద్ధతో వేరే చెప్పనక్కరలేదు

అయితే, సూత్రప్రాయంగా చూస్తే సాధారణ మెజారిటీ వచ్చినవన్నీ, సమావేశ తీర్మానాలుగా కాక, సూచనలకింద లెక్కకు వస్తాయి కాని, తరువాత జరుగబోయే విదేశాంగ సభలో, సోవియటు వీటిమీద ఏదైనా ఆక్షేపణ తెస్తే చూచారా, శాంతి సమావేశం ఆమోదించిన వాటిని సోవియటు నిరాకరిస్తూంది; ప్రజాస్వామికాన్ని మట్టి కలుపుతూంది, అని ప్రపంచమంతటా చాటడానికి తగిన ప్రచారక యంత్రాన్ని సామ్రాజ్యవాదులు సిద్ధంగా ఉంచారు. అంటే - అగ్రరాజ్యాల ఐకమత్యాన్ని విచ్ఛిన్నంచేయడానికి దీని నొక సాధనంగా ఉపయోగించడానికి సిద్ధమవుతున్నారు

సామ్రాజ్యవాదుల ఆర్థిక కుతంత్రం

ఇక యూరప్‌లో సామ్రాజ్యవాదులుపన్న దలచిన ఆర్థికవ్యూహం ఎలాంటిదో చూద్దాం. యూరప్‌దేశాల్లో స్వేచ్ఛావ్యాపార సౌకర్యాలు కావాలని లోగడ విదేశాంగమంత్రుల సభలో బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలు వాదించాయి. శాంతి సమావేశంలో (ఇటలీపై చర్చ) ఈ దృక్పథాన్నే అనుసరించాయి. ఇందులో దోషం ఏమీలేనట్టు పైకి కనబడుతుంది.

కాని, మాలొటావ్ దీని గుట్టును బయటపెట్టాడు. ఇది మేకకూ తోడేలుకూ సరిసమాన అవకాశం ఇవ్వడంలాంటిదే అని మాలొటావ్ తూర్పారబట్టాడు.

నాజీదురాక్రమణకింద నలిగిపోయి, ఇప్పుడిప్పుడే కాలూ చెయ్యీ కూడదీసుకుంటున్న దుర్బలదేశాల్లో, పెద్దదేశాలకు సరిసమాన హక్కులూ, అవకాశాలూ ఇవ్వడమంటే - ఆదేశాలను వీటిపెత్తనానికి బలిచేయడమే అవుతుందన్నాడు. ఈ దేశాలలో తమ సామ్రాజ్యాధిపత్యాన్ని స్థాపించడం కోసమే బ్రిటన్, అమెరికాలు ఇలా వాదిస్తున్నాయన్నాడు. "కాదు, ఇవిసదుద్దేశంతో చూపుతున్న సూచనేఅని బ్రిటన్ అమెరికాలు అన్నట్లయితే, దీనిని ఇండియాలోకూడా అమలుజరపకూడదు!" అని మాలొటావ్ సవాల్ చేసేసరికి బ్రిటను అమెరికా ప్రతినిధులు జవాబుచెప్పలేకపోయారు.

దక్షిణ యూరప్‌లో సామ్రాజ్యవాద పన్నాగం

ఈసందర్భంలో మరో సామ్రాజ్యవాద పన్నాగంకూడా బయటపడింది. గ్రీసులో బ్రిటను, అమెరికాలు తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని నిలబెడుతున్నారు. ఇటు స్పెయినులో ఫాసిస్టు ఫ్రాంకో ప్రభుత్వాన్ని కూలిపోకుండాకాపాడుతున్నారు. ఇటలీ, ఆస్ట్రియా దేశాల ప్రభుత్వాలను పూర్తిగా తమ చేతికిందికి తెచ్చుకోజూస్తున్నారు. ఆస్ట్రియా ప్రభుత్వం తీసుకుంటున్న సోవియటు వ్యతిరేక చర్యలను బ్రిటన్, అమెరికాలు బలపరుస్తున్నాయి. టర్కీ ప్రభుత్వం తమకు నమ్మినబంటే. ఈవిధంగా, మధ్యధరా సముద్రం తీరం పొడుగునా, ప్రజాతంత్ర యూరప్‌కు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదు [illegible] కటను నిర్మింపజూస్తున్నారు. స్పెయిన్, టర్కీ ప్రతినిధులలో [illegible] సంభాషణలు జరిగాయి. అయితే ఈవ్యూహం ఎంతవరకు నెగ్గుతుందనేది ఇటలీలో కలిగే రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

జర్మనీ సమస్య

ఇప్పుడు జరుగుతున్న శాంతిసమావేశ కార్యక్రమంలో జర్మనీసమస్య లేదు, కాని, ఇదంతా జర్మనీ విషయమై ఇకముందు జరుగబోయే శాంతిసమావేశానికి నాంది అని చెప్పవచ్చు మొత్తం యూరపుకు సంబంధించిన సమావేశంలో ఇది మొదటి సగం అని చెప్పవచ్చు. జర్మనీ విషయంలో ఎవరెవరు ఎలాంటి విధానం అనుసరిస్తారో ఈ సమావేశంలోనే స్పష్టంగా తేలిపోతుంది.

ఉదాహరణకు బ్రిటన్ అమెరికాలు ఒక కూటమిగాఏర్పడి, ప్రజాతంత్ర యూరప్ దేశాలను తమ పెత్తనంకిందికి తెచ్చుకోవాలని ఈ సమావేశంలో ప్రయత్నిస్తున్నాయి. ఈ విధానం యొక్క ఛాయలు జర్మనీలో అప్పుడే కనబడుతున్నాయి. జర్మనీలో బ్రిటన్, అమెరికాలు తమ తమ అధీనమండలాలను ఒక ఆర్థికకూటమిగ ఏర్పాటుతున్నాయి. అంటే పడమటి జర్మనీని పూర్తిగా బ్రిటన్ అమెరికా పెట్టుబడిదారుల పెత్తనంకింద పెట్టుకోవాలనుకుంటున్నా యన్నమాట.

అలాచేయడం పోట్సుడం నిర్ణయాలకు విరుద్ధమనీ, జర్మనీలో ప్రజాతంత్ర పునర్నిర్మాణానికి, భవిష్యదభివృద్ధికి భంగకరమనీ సోవియటు ఆక్షేపిస్తూంది.

(పీపుల్సు ఏజ్ నుండి)

శాంతిసమావేశంలో ట్రీస్టే సమస్య

తీవ్ర వాదోపవాదాలకు కారణమయిన ట్రీస్టే సమస్య శాంతి సమావేశంలో 'ఇటలీ రాజకీయ-ప్రాదేశికకమిటీ' ఎదుటికివచ్చింది.

ట్రీస్టే ప్రాంతాన్ని స్వతంత్ర భూభాగం చేయాలనీ: ఇస్ట్రియా ప్రదేశమూ, జూలియన్ మార్చిలో మరికొంత భాగమూ యుగోస్లావియాకు ఇచ్చివేయాలని లోగడ విదేశాంగ మంత్రుల సభలో అగ్రరాజ్యనిర్ణయం. ట్రీస్టే స్వతంత్ర భూభాగంలో ప్రభుత్వం ఎలా వుండాలన్న విషయమై నిర్ణయం జరగలేదు. మొన్న సోమవారం కమిటీ సమావేశంలో ఇటలీ సహాయ ప్రధాన మంత్రి బోనోమ మాట్లాడుతూ అగ్రరాజ్య నిర్ణయం అన్యాయమన్నాడు. యుగోస్లావియాకు యిచ్చివేయదలచిన జూలియన్ మార్చి ప్రదేశంలో కొంత భాగాన్ని ట్రీస్టే స్వతంత్ర భూభాగంలో చేర్చాలన్నాడు.

ట్రీస్టేరేవును అంతర్జాతీయం చేయడానికి యుగోస్లావియాకు అభ్యంతరం లేదుగాని, ఇతర సరిహద్దు నిర్ణయం తమకు సమ్మతం కాదన్నాడు యుగోస్లావియా విదేశాంగ సహాయమంత్రి.

తరువాత ఈవిషయమై చర్చసాగింది. అగ్రరాజ్యనిర్ణయానికి వ్యతిరేకంగా దక్షిణాఫ్రికా ప్రతినిధిద్వారా ఒక సూచన చేయించారు. యుగోస్లావియాకు ఇచ్చివేయవలసిన ఇస్ట్రియాలో పడమటి భాగాన్ని అంతర్జాతీయం చేయాలని ఈసూచన. వైట్ రష్యా ప్రతినిధి కిసిలెవ్ దీనిని ఖండించాడు. యుగోస్లావియాకు సముద్రానికి మార్గం లేకుండా చేయడమేదీని ఉద్దేశం అని చెప్పాడు. ఎక్కువగా యుగోస్లావియా ప్రజలు నివసిస్తున్న గోరీజియా నగరాన్ని యుగోస్లావియాకు ఇవ్వాలని ఇతనొక సూచనచేశాడు. ఆనగరం తమదని చెప్పుకో డానికి ఇటలీవారు దానిని తమ ప్రజలతో అక్రమంగా నింపుతున్నారన్నాడు.

సోవియటు ప్రతినిధి విషిన్‌స్కీ మాట్లాడుతూ ట్రీస్టేపట్టణం, దానిచుట్టూ యుగోస్లావియా ప్రజలు నివసిస్తున్న ప్రదేశానికంతటికీ ఆయువుపట్టులాంటిది. ఆప్రదేశానికీ దానికీ అవినాభావ సంబంధముంది. కాబట్టి దాని పరిపాలన మొదలైన విషయాల్లో యుగోస్లావియావారికి ప్రధాన స్థానముండాలన్నాడు.

డాంజిగ్ ఉదాహరణ

పోలెండు ప్రతినిధి డాంజిగ్‌నగర చరిత్రను ఉదహరించాడు. పోలెండుకు సంబంధించిన డాంజిగ్‌ను పోలెండు ప్రజలతో సంబంధంలేకుండా చేసేసరికి, అది విదేశ దురాక్రమణదారుల కెలా ఉపయోగపడిందో ఉదహరించాడు.

బ్రిటిష్ ప్రతినిధి హెక్టార్ మేక్‌నీల్ మాట్లాడుతూ, ట్రీస్టే స్వతంత్ర భూభాగం యొక్క స్వాతంత్ర్యానికి ఏమాత్రం కొరత వచ్చినా బ్రిటన్ తనవైఖరిని మార్చుకోవలసి వస్తుందని బెదరించాడు. ఆప్రదేశం మిత్రరాజ్య సమితి అధమాయిషీక్రిందనే ఉండాలట. ఆ ప్రదేశంయొక్క గవర్నరును ఎన్నుకొనేహక్కు యుగోస్లావియాకు ఉండాలని యుగోస్లావియా, రష్యాలు వాదించడం తనకు నచ్చలేదన్నాడు.

చర్చ ఇంకా సాగుతూంది.

గ్రీకుఫాసిస్టు ప్రభుత్వ దురాశ

బల్గేరియా శాంతిఒడంబడికకుచెందిన రాజకీయ, ప్రాదేశిక కమిటీ సమావేశంలో గ్రీకు ఫాసిస్టుప్రభుత్వం తనదురాక్రమణ తత్వాన్ని బయటపెట్టింది. తూర్పున బల్గేరియాలోని కొంత ప్రదేశం గ్రీసుకు ఇచ్చివేయాలని గ్రీకుప్రతినిధి వాదించాడు. గ్రీకు రక్షణకు ఇది అత్యవసరమట. ఓడిపోయిన శత్రురాజ్యమయిన బల్గేరియాకు ఈ కోరికను నిరాకరించే అధికారం లేదన్నాడు.

సోవియటు, యుగోస్లావియా ప్రతినిధులు గ్రీసును తీవ్రంగా ప్రతిఘటించారు. గ్రీసు కోరిక అక్రమమని వాదించారు. బల్గేరియాకు ఏజియన్ సముద్ర తీరానికి మార్గం ఉండడం ఎలా న్యాయమో సోవియటు ప్రతినిధి వివరించాడు. ఇందుకు పడమటి థ్రేస్‌రాష్ట్రం బల్గేరియాకు ఇవ్వాలన్నాడు.

యుగోస్లావియా ప్రతినిధి మాట్లాడుతూ గ్రీసు ఉత్తర దిక్కుగా దురాక్రమణ సాగించాలనుకుంటున్నదని ఖండించాడు. ప్రస్తుత గ్రీకు ప్రభుత్వం బాల్కన్ దేశాల శాంతికి భంగకర మన్నాడు.

ఇటలీ ఆర్థిక కమిటీలో, సోవియటుకు వస్తురూపేణా చెల్లించవలసిన యుద్ధ నష్టపరిహారం గురించి ఇటలీ సోవియటులు ప్రత్యేకంగా ఒడంబడిక కుదుర్చుకోవచ్చునని ముసాయిదాలో ఉన్న అంశాన్ని రద్దు చేయించడానికి ఆస్ట్రేలియా ప్రయత్నించింది. కాని, ఆప్రయత్నం ఓడిపోయింది. శాంతి సమావేశ మిలిటరీ కమిటీలో ఇటలీకి చెందిన 24 షరతుల్లో 17 ఆమోదించబడ్డాయి. వెనుకటి ఫాసిస్టు సేనలోను నౌకాదళాల్లోను ఉద్యోగులుగా పనిచేసిన వారినెవ్వరినీ తిరిగి సేన, నౌకాదళాల్లో ఉద్యోగులుగా తీసుకోకూడదని నిషేధించారు.

గ్రీసులో ప్లెబిసైట్ తతంగం

షరఫ్ అథర్ ఆలీ

రెండవ జార్జిరాజు గ్రీసుకు తిరిగి రావచ్చునా కూడదా అన్న సమస్యపై సెప్టెంబరు 1 వ తేదీన ప్రజల అభిప్రాయంకోసం గ్రీసులో వోటింగు (ప్లెబిసైట్) జరిగింది. క్రూరమైన నిర్బంధవిధానమూ, తప్పుడు వోటింగూ మొదలైన విధానాలన్నీ అవలంబించింది ప్రభుత్వం. రాజుకు అనుకూలంగానే ప్లెబిసైట్ ఫలితాలు వచ్చాయని ప్రభుత్వం ప్రకటించింది. 18,01,140 వోట్లు అసలు ఎన్నికల జాబితాలో వున్నాయి. ఇందులో 16,91,594 మంది వోటు చేశారు. ఇందులో రాజుకు అనుకూలంగా 11,66,512 వోట్లు వచ్చాయనీ, రాజుకు వ్యతిరేకంగా 5,21,267 వోట్లు వచ్చాయనీ, 3815 వోట్లు పనికిరాకుండా పోయాయనీ ప్రభుత్వం ప్రకటించింది. గ్రీక్ ప్రధాని సల్డారిస్ అప్పుడే లండన్ వెళ్ళి రాజుతో మంతనాలు సాగించుతున్నాడు. రాజును గ్రీసుకు రప్పించే సన్నాహాలను గురించి చర్చిస్తున్నాడు.

★

బ్రిటిష్ సాయుధ సైనిక సహాయ ఫలితంగా నేడు గ్రీసులో రాచరిక - ఫాసిస్టు నియంతృత్వం ఏర్పడింది. తిరిగి 1935 నాటి మెటాక్సస్ నియంతృత్వ దినాలు జ్ఞప్తికి వస్తున్నాయి

ఏ పరిస్థితులలో ఈ ప్లెబిసైట్ జరిగింది?

ప్రజాతంత్ర పక్షాలకు బలంగావున్న థెస్సాలీ (మధ్యగ్రీసు) మాసిడోనియా (ఉత్తరగ్రీసు) లలో గ్రీకు సైన్యాలలో సగం మంది శిక్షవేసుకు కూర్చున్నారు. అక్కడ ప్రజలను దారుణంగా హింసిస్తున్నారు. గ్రీకు సైన్యాలు చేసే ఈ దురంతాలకు బ్రిటిష్ అండ పూర్తిగావుంది. గ్రీసులోను, గ్రీసు రేవు పట్టణాలలోను 60 వేల బ్రిటిష్ సేన లున్నాయి. మధ్యధరాసముద్రంలో కమాండర్-ఇన్-చీఫ్ అయిన జనరల్ డెమ్సీ 'శాంతి భద్రతలను కాపాడటానికి' సైనికుల తోడ్పాటు అవసరమేననీ చెప్పాడు. గ్రీకు తాత్కాలిక ప్రధాని జులై 29న ప్రకటించాడు. ఇంతేగాదు మరసటిరోజున అతడు, బ్రిటిషు సేనలు సాలోనికా (మాసిడోనియా ముఖ్యపట్టణం) లో సైనికచర్య జరపడం, స్వయంగా పరిశీలించాడు.

తీవ్ర నిర్బంధవిధానం

మార్చిలో జరిగిన ఎన్నికలలో అతివాద పక్షాలు పాల్గొనలేదు. బ్రిటిషు సాయుధబలంతో ఎన్నికలలో నేటి రాచరిక ఫాసిస్టుముఠా గెల్చింది. అది ప్రభుత్వానికి వచ్చిన నాల్గు నెలలలో, (ఏప్రిల్ - జులై) 2 వేల మందిని అరెస్టుచేసింది. 441 మందిని హత్యచేసింది.

ప్రస్తుత ప్రధాని సల్డారిస్, ప్రభుత్వానికి వచ్చిన 5 నెలలలో గ్రీసును, 1935 నాటి మెటాక్సస్ నియంతృత్వపు రోజులకు లాక్కుపోయాడు.

ఈనిర్బంధ విధానానికి భయపడి కొండలలో దాక్కొన్న రైతు కూలీలపైననే, జనరల్ దెప్పిన సేనలు గ్రీకురాచరిక ముఠా సేనలతోపాటు యుద్ధాలు సాగిస్తున్నాయి.

అతివాదపక్షకూటమి అయిన ఇ. ఎ. యం. కు సానుభూతిపరులనందరినీ 'కమ్యూనిస్టు' పేరుతో ఉద్యోగాలనుంచి తొలగించివేస్తోంది.

లిబరల్ నాయకుడూ, మాజీ ప్రధాని సొఫోలిస్‌ను కూడా 'కమ్యూనిస్టు' అని నిందిస్తున్నారని, అతడు గ్రీసుకు వచ్చిన బ్రిటిష్ కార్మిక సభ్యులతో గోల పెట్టాడు.

ప్రజాభిప్రాయం తెలుపదు

అమానుషమైన సైనిక నిర్బంధవిధానం అవలంబించి, పూర్తిగా ప్రజాతంత్ర హక్కులను అణచివేసి, అనేక తప్పుడు మార్గాలవలంబించిన ప్లెబిసైట్ ఫలితాలు ఇలాగాక మరో రకంగా వుంటాయని ఎవరూ ఆశించలేదు. ఈవోటింగు లెక్కలు నిజమైన ప్రజాభిప్రాయాన్ని తెలియజేయవు.

ఫాసిస్టు పద్ధతులవలంబించి గ్రీసు గద్దెపై ఎక్కడం జార్జిరాజుకు ఈనాడు క్రొత్తగాదు. 1935 లోనూ ఇలాగే జరిగింది.

1924 గ్రీసులో ప్రజలు 100 కి 75 మంది రాజుకు వ్యతిరేకంగా వోటుచేసి, రాజును దేశాన్నుంచి వెళ్ళగొట్టారు.

అలాంటిరాజునే తిరిగి గద్దెపై ఎక్కించడానికి ఫాసిస్టుసైన్యాధికారులిద్దరు-మెటాక్సస్-కొండెలిస్ అనేవారు-కుట్రచేసి తిరుగుబాటు చేసి అధికారం స్వీకరించారు. 1935 లో ప్లెబిసైట్ తతంగం ఒకటి నడిపి 100 కి 92 మంది రాజుకు అనుకూలంగా వున్నట్లు మెటాక్సస్ ప్రకటించాడు. అందుచే ఈనాటి తతంగం నేడు తిరిగి మెటాక్సస్ నియంతృత్వపు రోజులను జ్ఞప్తికి తెస్తుంది.

అసలీ రాజెవరు?

జార్జిరాజు నిజంగా గ్రీసువాడన్నా కాదు. ఒక శతాబ్దానికిపైగా, బ్రిటన్ గ్రీసులోకి రాజులను దిగుమతి చేస్తోంది.

మధ్యధరా సముద్రంగుండా తమసామ్రాజ్యపు రాకపోకలను కాపాడుకొనేందుకు గాను, బ్రిటన్ ఇలా రాజులను దిగుమతి చేస్తూవచ్చింది.

1829 లో బ్రిటిషు, ఫ్రెంచి, రష్యా సామ్రాజ్యవాదులు బవేరియా రాకుమారుడు ఓథో ను గ్రీకురాజుగా నియమించారు.

1862 లో విప్లవం వచ్చింది. ఓథో సింహాసన పరిత్యాగం చేయవలసివచ్చింది. తర్వాత బ్రిటన్ మరో విదేశీయుని, విలియంజార్జి గ్లూక్స్‌బర్గును, గ్రీసు నెత్తిన రుద్దింది. ఇతనినే మొదటిజార్జి అంటారు. ఇతడు 1913 లో హత్య కావించబడ్డాడు.

ఇతని తర్వాత మరొక ఇద్దరు రాజులు వెలిగించారు. కాని వాళ్ళు కూడా నానా అపఖ్యాతులకు పాల్పడ్డతర్వాత ప్రస్తుతపు రెండవ జార్జిరాజు 1922లో గ్రీసుకు వచ్చాడు.

కాని గత యుద్ధానంతరం గ్రీసులో కూడ ప్రజాతంత్ర వెల్లువ లేచింది. తక్కిన దేశాలలోవలనే విప్లవోద్యమం ఇక్కడా విజృంభించింది. అందుచే 1924 లో 100 కి 75 మంది ప్రజలు వోటుచేసి రాజును గ్రీసు నుంచి గెంటివేశారు.

1935 నవంబరులో ఒక ప్లెబిసైట్ తతంగం జరిగింది. అపుడు అధికారంలో వున్న అభివృద్ధి నిరోధక ఫాసిస్టుముఠా, ఎక్కువమంది రాజు రాకకు అనుకూలంగా వున్నట్లు ప్రకటించింది.

1935 నవంబరులో మెటాక్సస్, గ్రీకు రాజ్యాంగాన్ని రద్దుచేసి రాజుతోగలసి డిక్టేటర్‌షిప్ వహించాడు.

యుద్ధకాలంలో

1941 ఏప్రియల్‌లో జర్మన్లు దాడిచేసినపుడు జార్జిరాజు గ్రీసునుండి పలాయనం చిత్తగించి క్రైట్‌చేరాడు. అక్కడినుండి లండన్ చేరాడు. కానిఅతని మంత్రులంతా జర్మన్లతో సహకారంచేసి, నాజీచేనేదోవిడికి సహాయంచేశారు.

జర్మన్లతో పోరాడిన పక్షాలన్నీ — ఇ. ఎ. యం. కు చెందిన అతివాద పక్షాలేగాక అన్నిఫాసిస్టు వ్యతిరేక పక్షాలూ-జర్మన్లనుండి విముక్తిచేసిన తమ మాతృభూమిలో తిరిగి కునస్థాపించుకుతామని ప్రతిజ్ఞచేశాయి.

యుద్ధకాలంలో రాజు సైతం, గ్రీసులో రాజుల పరిపాలన వుండాలో ప్రజాస్వామిక (రిపబ్లికు) పరిపాలన వుండాలో — అన్నది ప్లెబిసైట్‌ద్వారా తేలేదాకా రానని అన్నాడు. కాని ఇప్పుడు ప్లెబిసైట్ పెట్టింది-గ్రీసులో రాజుల పరిపాలనా లేక ప్రజాస్వామిక పరిపాలనా - అన్న సమస్యపైగాదు. రాజు తిరిగి గ్రీసుకు రావాలా అక్కరలేదా అన్న సమస్యపైననే ప్లెబిసైట్ పెట్టబడింది.

అసలీ సమస్య 1948 వరకు రాకూడదు. 1945 నవంబరులో అప్పటి ప్రధాని సొఫోలిస్‌కు బ్రిటిష్ విదేశాంగ మంత్రి బెవిన్, 1946 మార్చిలో ఎన్నికలు జరిపే పక్షంలో 1948 వరకు రాచరిక సమస్యపై ప్లెబిసైట్ జరగదని వాగ్దానం చేశాడు. ఆ వాగ్దానం లేనిదే తాను ఎన్నికలలో పాల్గొనని సొఫోలిస్ అన్నాడు. కాని ఎన్నికల తర్వాత గ్రీకు రాచరికవాదులు రాజురాకపై ప్లెబిసైట్ పెట్టాలని నిర్ణయించగానే, "బెవిన్ గ్రీకు ప్రభుత్వ విషయాలలో జోక్యం కలుగజేసుకోడు" అని బ్రిటిష్ అధికారులన్నారు.

బ్రిటిష్ సాయుధ బలాలతో గ్రీకు ప్రజల కిష్టంలేకుండా వారినెత్తిన రుద్దబడిన రెండవ రాజు పరిపాలన ఎన్నాళ్ళుంటుందో, ఎలాంటి విషమ పరిస్థితులకు దారితీస్తుందో వేరే చెప్ప నక్కరలేదు. (పీపుల్సు ఏజ్ మండి)

పాలస్తీనా సమస్యపై రౌండ్‌టేబిల్‌సభ

అరబ్బుల, యూదుల తిరస్కారం

ఇదివరలో అనుకున్నట్లు 9 వ తేదీనగాక 10 తేదీన లండన్‌లో పాలస్తీనాపై రౌండ్ టేబిల్ సభ ప్రారంభమవుతుంది.

గ్రాండ్‌ముఫ్తీని ప్రతినిధిగాఅంగీ...1 వీలు లేదని బ్రిటన్ చెప్పింది. దానితో పాలస్తీనా అరబ్బు హయ్యర్ కమిటీ, తాము లండన్ సభలో పాల్గొనమని చెప్పివేశాయి.

అరబ్బు హయ్యరుకమిటీలో లేని కొంతమంది పాలస్తీనా అరబ్బు ప్రముఖులను కూడా బ్రిటను ఆహ్వానించింది. కాని వారెవరూ రామన్నారు.

అరబ్బుదేశాలు పాల్గొంటాయి

పాలస్తీనా అరబ్బు నాయకులు, లండన్ సభను బహిష్కరించినా, అరబ్‌లీగ్ (అరబ్బు దేశాలకూటమి) మాత్రం బహిష్కరించడం లేదు. అరబ్బుదేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

లెబనాను అధ్యక్షుడు, సౌదీ అరేబియా రాజు ఇబాన్‌సాద్ పాలస్తీనా అరబ్బు హయ్యర్ కమిటీని, తమ నిర్ణయం మార్చుకోవలసిందని కోరుతూ విజ్ఞప్తిచేశారు.

యూదుల తిరస్కారం

లండన్ సమావేశంలో తాము పాల్గొనజాలమని యూదు ఏజెన్సీ తెలియజేసింది. బ్రిటిషు ప్రభుత్వం తాము సమావేశంలో పాల్గొనడానికి విధించిన షరతులనుకూడా అంగీకరించలేమని యూదు ఏజెన్సీ తెలియజేసింది.

"మా ప్రతినిధులను ఎన్నుకొనేహక్కు మాకే ఉండాలి. పాలస్తీనాలో స్వతంత్ర యూదు రాజ్యాంగం ఏర్పరిచే ప్రాతిపదికపై చర్చలు జరగాలి." అని యూదు ఏజెన్సీ తెలియజేసింది

గ్రీసు ప్రజాతంత్రాన్ని బ్రిటిష్ ప్రభుత్వం హత్యచేసింది

గ్రీసులో నేడు జరుగుతున్న దురంతాలను ఏప్రజాతంత్ర ప్రియుడూ సహించలేడు. బాల్కను రాజ్యాలశాంతికి గ్రీసు చిచ్చు పెడుతోందని యుక్రైన్ ప్రతినిధి, భద్రతా సంఘంకి గ్రీసు సమస్యను చర్చకు తెచ్చాడు. మొదట బ్రిటన్ హాలెండ్‌లు యుక్రైన్ ప్రతినిధిని మాటాడకుండా చేయడానికి ప్రయత్నించారు. కాని అది నెగ్గలేదు. భద్రతా సంఘంలో నేడు బ్రిటన్ సాయంతో గ్రీకు ఫాసిస్టు రాచరిక ప్రభుత్వం చేస్తున్న చర్యలను ఖండించాడు. బ్రిటన్ గ్రీకు ప్రతినిధులు తమ తమ ప్రభుత్వ చర్యలను సమర్థించుకో జూచారు.

'ప్రవ్డా' వ్యాఖ్య

"గ్రీకు ప్రభుత్వం పూర్తిగా తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది. బ్రిటిష్ విదేశాంగ మంత్రి చెప్పినట్లల్లా సల్డారిస్ ప్రభుత్వం తల ఊపుతోంది. ప్లెబిసైట్‌ను గురించి, రాజును తిరిగి రప్పించడం గురించి, బ్రిటిష్ విదేశాంగ మంత్రియే సన్నాహాలు చేసి ఆజ్ఞ ఇచ్చాడు." అని ప్రవ్డా విమర్శించింది.

అతివాద పక్షాల ఆక్షేపణ

వోటింగ్ సక్రమంగా జరగలేదని, వాటిని రద్దుపరచవలసిందని కౌన్సిల్ ఆఫ్ స్టేట్ (ప్రజలకూ ప్రభుత్వానికి మధ్య వచ్చే తగాదాలను తీర్చే కోర్టు) కు ఇ. ఎ. యం. అతివాద పక్షాల కూటమి విజ్ఞప్తి చేసింది. ఎట్టి క్రూరనిర్బంధవిధానాల క్రింద వోటింగ్ జరిగిందో దానిని గ్రీకు ప్రభుత్వం కప్పిపుచ్చలేదని మాస్కోరేడియో ఖండించింది. భద్రతా సంఘంలో మొదట మాట్లాడిన గ్రోమికో "గ్రీసు జీవితంలో ఈ తప్పుడు ప్లెబిసైట్ మానని పుండులా వుంటుంద"ని హెచ్చరించాడు.

గ్రీసు ప్రజాతంత్రాన్ని హత్యచేసింది బ్రిటిష్‌ప్రభుత్వమే

"గ్రీసు ఇక ఏమాత్రం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్న దేశంకాదు. గ్రీసులో ప్రజాతంత్రం హత్య చేయబడింది.

"హంతకులు బ్రిటిష్ కార్మికప్రభుత్వమే. సైనికంగా గ్రీసుకువున్న విలువనుబట్టే బ్రిటన్ దానిని తమ చెప్పు చేతుల్లోకి లాగింది. దానికి మనం తీవ్ర నిరసన తెలుపకపోతే, మూడవ ప్రపంచ యుద్ధంలోకి మనం ఈడ్చబడతాం" అంటూ బ్రిటిష్ కమ్యూనిస్టుపత్రిక "డైలీవర్కర్" తీవ్రంగా ఖండించింది.

కమ్యూనిస్టు నాయకుని హెచ్చరిక

"గ్రీసులో జరిగిన ప్లెబిసైట్ 1945 డిసెంబరునాటి క్లిష్టపరిస్థితులను కల్పించింది. 'అప్పుడు ప్రజాతంత్ర పక్షాలను అణచడానికి బ్రిటిషు సేనలుఉపయోగించబడ్డాయి.' బ్రిటన్ సాయంతో రాచరిక-ఫాసిస్టువాదులు ప్రస్తుత విధానమేకొనసాగించి తేఅంతర్యుద్ధంతప్పదు" అని గ్రీకు కమ్యూనిస్టుపార్టీ నాయకుడు జకారిడియస్ హెచ్చరించాడు. బ్రిటిష్‌సేనలు వెళ్ళిపోవాలని కూడా అయన కోరాడు.

ఇండొనేషియా స్వాతంత్ర్యం ఎవరూ అణచలేరు

ఆగష్టు 31 న డచ్చి పార్లమెంటుపై శాసన సభలో తూర్పు ఇండియా దీవులకు ఒక ఉపసంఘం (కమిషన్) పంపాలని నిర్ణయించబడింది. 29 మంది అనుకూలంగాను, 14 వ్యతిరేకంగాను వోటుచేశారు

సైన్యాలు పంపడం మానాలి

కమ్యూనిస్టు సభ్యుడు జాన్‌ఫీల్ కోయిజ్మాన్స్ దీనిపై చర్చలో మాట్లాడుతూ యుద్ధ విరమణ సంధికి తక్షణం చర్యలు తీసుకోవలసిందని ప్రభుత్వాన్ని కోరాడు. డచ్చి సైన్యాలను ఇండొనేషియాకు పంపడం మానివేయాలని కోరాడు. అవసరం సేనలను పంపకుండా కమిషన్‌ను పంపితే రాయబారాలకు అవకాశం ఉంటుందిగాని, లేకపోతే ఈకమిషన్‌ను పంపి ప్రయోజనంలేదన్నాడు.

ఇదివరలో ఈవిషయం చర్చకు వచ్చినపుడుకూడ డచ్చికమ్యూనిస్టులు, ప్రభుత్వ విధానాన్ని ఖండించారు. కమ్యూనిస్టులేగాక లిబరల్‌సభ్యులుకూడా ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

ఈ ఉపసంఘంలో ముగ్గురు సభ్యులు (వాన్‌మూక్‌తోసహా) ఉంటారు. వీరిపని, తూర్పు ఇండియా దీవుల రాజకీయ భవిష్యత్తును నిర్మించడమట. "డచ్చిసామ్రాజ్యానికి లోబడిన" నూతన అధికారాలను ఇది నిర్ణయించబోతోందట.

కాని వాస్తవంగా ఈ ఉపసంఘం చేయనున్న పని ఏమిటి? (1) తూర్పు దీవుల ఆర్థిక పునర్నిర్మాణంలో, ముఖ్యంగా ఇతర విదేశాలకు... భాగం ఉండాలి అన్నది చర్చించడం. ... పీఠాన్ని విద్యను ఈ ప్రాంతంలో పునరుద్ధరించడం! అనే మిషతో, డచ్చి సేనలను అదనంగా పంపడం.

డచ్చి ప్రభుత్వంలో (స్వదేశంలోను, వలస ప్రాంతంలోను) మార్పులు తలపెట్టడానికంటూ సెప్టెంబరు 1 వ తేదీన సమావేశం కావలసిన 'సామ్రాజ్య సమావేశం' వాయిదా వేయబడింది. ఇలాంటి బూటకపు సమావేశాలవల్ల కలిగే ఫలితం సున్న అని వేరే చెప్పనక్కరలేదు. డచ్చివారు ఎప్పటికప్పుడు "క్రొత్త సూచనలు" అంటూనే తమ సామ్రాజ్య అధికారాన్ని వదులుకొనడానికి ఇష్టపడని పద్ధతులను సూచించుతున్నారు.

సామ్రాజ్యానికి లోబడేవుండాలట

1942 డిశెంబరులో డచ్చిరాణి ఒక ప్రకటన చేసింది. ఇండొనీషియా, సురినామ్, కురకో, డచ్చి దేశాలన్నీ కలిపి ఒక 'రాజ్యం'గా ఉండాలి; ఆయా దేశాలకు అంతర్గత విషయాలలో స్వతంత్రం ఉంటుంది. కాని పరస్పరం సహాయం చేసుకోడానికి ఎప్పుడూ వీ సిద్ధంగాఉండాలి అని అంది.

1945 చివరలో ఇండొనేషియా గవర్నర్ వాన్‌మూక్ మరొక పదజాలంతో దీనినే సూచించాడు. డచ్చి సామ్రాజ్యంలో భాగస్వామిగా (కామన్‌వెల్త్) ఇండొనీషియా ఉండవచ్చు. కొంతవరకు రాష్ట్ర స్వపరిపాలన ఇలాంటి భాగస్వామిక దేశాలకు ఉంటుంది.

1946 జులై 23 న డచ్చిరాణి పార్లమెంటులో వుపన్యసించుతూ "డచ్చిసామ్రాజ్యానికి లోబడివుండే ఒక రాజ్యాంగాన్ని, ఇండొనేషియా ప్రజలకు కల్పించాలి" అని అంది.

వాన్‌మూక్ ఇటీవల పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ "ఇండొనేషియాను స్వతంత్ర దేశంగా తయారు చేయడం మాకిష్టమే. కాని సామ్రాజ్యానికి లోబడివుండే రాజ్యాంగంతో ఇది ప్రారంభమైతే బాగుంటుంది."

ఇలా ఎన్నిసార్లు, ఎన్ని సూచనలు చేసినా వాటిలో ఇండొనేషియాకు స్వతంత్రం ప్రసక్తిలేదు. అగ్నేయాసియా రంగంలో బ్రిటిష్ సైన్యాధిపతి కిల్లియారన్ ఈమధ్య ఇండొనేషియా నాయకులతో రాయబారాలకు పూనుకున్నాడు.

నవంబరు నెలాఖరులోగా బ్రిటిషు సేనలు ఇండొనీషియా నుంచి వెళ్ళిపోతాయట. బహుశా వాటిస్థానే వచ్చేడచ్చి అదనపుసేనల గురించే కిల్లియారన్ షారీర్‌తో మాట్లాడియుండవచ్చు. అప్పుడే డచ్చి సేనలు ఇండొనీషియాలో దిగుతున్నాయి కూడ. డచ్చి అదనపు సేనలను నిలపనిదే, డచ్చివారితో రాయబారాలకు తావుండదని షారీర్ స్పష్టపరిచినట్లు తెలుస్తుంది.

డచ్చివారికి బ్రిటన్‌సాయం

డచ్చివారికి, ఇండొనీషియా నాయకులకు మధ్య తామేదోపెద్ద సంధికుదిర్చే వారిలాగ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నటించుతున్నారు కాని బ్రిటన్ సాయంలేకపోతే డచ్చి సామ్రాజ్యవాదులు ఎన్నడో టోక ముడిచేవారు.

ఇండొనీషియా రిపబ్లిక్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ హట్టా ఇలా అన్నాడు. "బ్రిటన్ సాయం లేకపోతే ఒక డచ్చి సైనికుడు కూడా ఇండొనీషియాలో అడుగు పెట్టగల్గి యుండేవాడుకాదు. బ్రిటన్ సాయంతోనే నేడు డచ్చి సేనలు వివిధ ప్రాంతాలలో ఉన్నాయి.

"నిర్మొగమాటంగా చెప్పాలంటే బ్రిటిష్ సైన్యం ఇక్కడ డచ్చివారికి సైనికంగా రాజకీయంగాను సహాయం చేయడానికి ఉంది. డచ్చివారు తమ సామ్రాజ్యాన్ని మాపై రుద్దలేకపోయారు. అందుచే బ్రిటన్ వాళ్ళకు సాయపడుతోంది "బ్రిటిషువారు కలసి ఎన్ని కుట్రలుచేసినాఇండొనీషియారిపబ్లిక్‌వార్షికోత్సవంలో షారీర్ చెప్పినట్లు, "ఇండొనీషియా రిపబ్లిక్ దానంతటదే కూలదు, సైనికంగాకూడ దాని నెవరూ అణచివేయలేరు."

మిత్రరాజ్య సమితినుండి సోవియటును వెళ్ళగొట్టాలని కుట్ర

సెప్టెంబరు 6 వ తేదీన బ్రిటిష్ పత్రిక "డైలీమెయిల్" మిత్రరాజ్య సమితినుండి రష్యా వైదొలగి పోవచ్చునంటూ పెద్దపెద్ద శీర్షికలతో ప్రచురించింది.

సెప్టెంబరు 23 న జరగనున్న మిత్రరాజ్యసమితి జనరల్ అసెంబ్లీని నవంబరు వరకు వాయిదా వేయాలనీ, పారిస్‌కుగాని జినీవాకుగాని మిత్రరాజ్యసమితి సమావేశం మార్చాలనీ, మాలొటావ్ సూచించాడు. అలా అయితే ఒకేసారి శాంతిసమావేశమూ మిత్రరాజ్యసమితీ జరగడానికి వీలుంటుందని సూచించాడు.

దీనికి విపరీతవాఖ్యచేస్తూ డైలీమెయిల్ పారిస్ విలేఖరి సోవియటుపై ఇంత దుమ్మెత్తిపోస్తున్నాడు. మిత్రరాజ్యసమితిని ప్రపంచ వ్యవహారాలలో వెనక్కి నెట్టివేయాలని సోవియటు చూస్తున్నదట. ఇదివరదాకా ప్రపంచసంఘంలో సోవియటు ఉండటమే తనకు క్షేమం అనుకొన్నదట, కాని ఇపుడు బయటికి వెళ్ళిపోవడం మంచిదని అనుకొంటున్నదట.

ఇలాంటి దుష్ప్రచారం చేయడంలో అర్థం లేకపోలేదు. "డైలీమెయిల్" న్యూయార్కు విలేఖరి ఈమధ్య యుగోస్లావియాలోఅమెరికా విమానాల కాల్పులను గురించి వ్రాస్తూ ఇలా అన్నాడు.

"అమెరికా - యుగోస్లావ్ సమస్య భద్రతా సంఘంలోకి చర్చకు వస్తే, రష్యా వీటోను ఉపయోగించుతుంది. అప్పుడు భద్రతాసంఘంలో ప్రతిష్టంభన ఏర్పడవచ్చు.

"అలా జరిగే పక్షంలో మిత్రరాజ్య సమితి భగ్నం కావచ్చు. మిత్రరాజ్య సమితికి శాంతిని కాపాడగల శక్తిలేదని దానివల్ల ఋజువవుతుంది. ఇది బ్రిటిష్ అధికారుల అభిప్రాయం" అంటూ డైలీ మెయిల్ విలేఖరి వ్రాశాడు.

మిత్రరాజ్యసమితి భగ్నం అవుతుందని బెదిరింపులకు అర్థంఏమిటి? బెవిన్ బైరన్‌లు సోవియటుపై నిరంతరం దాడి చేయాలని ఇదివరకే ఎన్నడో నిశ్చయించుకొన్నారు. వీరుచేసే ప్రచారఫలితంగా సోవియటు మిత్రరాజ్యసమితిలో ఉండడానికి వీలులేని పరిస్థితులు కొన్నాళ్ళకు కలుగుతాయని వాళ్ళ నమ్మకం. సోవియటు వెళ్ళిపోతే మిత్రరాజ్య సమితిని ఆంగ్లో-అమెరికన్ కూటమి క్రింద ఎలావదితే అలా ఆడించ వచ్చునని వాళ్ళ కుట్ర. అందుకని ముందరి కాళ్ళకు బంధాలు వేయడానికే, సోవియటుపై డైలీమెయిల్ ఈ దుష్ప్రచారం సాగిస్తోంది.

సోవియటుపై దుష్ప్రచారం

స్వీడెన్‌లో తుపాకిగుండ్లు "న్యూటైమ్సు" జవాబు

ఆగస్టు ఆఖరి వారంలో ఇలాంటి దుష్ప్రచారమే కొనసాగింది. సోవియటు అధీన జర్మనీలో 'వి' రాకెట్లు చేస్తున్నారనీ, జర్మనీ బాల్టిక్ తీరంలో ఈకొత్త ఆయుధాలను పరిశోధన చేస్తుంటే కొన్ని గుండ్లు వచ్చి స్వీడెన్‌లో పడుతున్నాయనీ వార్తలు ప్రకటించబడ్డాయి.

ఈ దుష్ప్రచారానికి చెంపపెట్టు పెడుతూ "న్యూటైమ్సు" ఒకవ్యాసం వ్రాసింది.

"స్వీడిష్‌పత్రిక ఒకటి, ఈ గుండ్ల విషయం వ్రాస్తూ ఇది ఎండమావుల లాంటిమిథ్య అని అంది. గుండ్లవిషయంలో అది నిజమే. కాని స్వీడిష్ పత్రికలు కల్గించిన భయం మాత్రం మిథ్యకాదు. వాస్తవమే."

"సోవియటుకు వ్యతిరేకంగా కల్పించే కథలనుబట్టీ, చేసే ప్రచారరీతినిబట్టీ కొన్ని కొన్ని ముఖ్యకేంద్రాలనుంచే ఈ ప్రచారం, మంచి ఆరితేరిన ముఠాలు చేస్తున్నాయని తేలుతుంది. అంతర్జాతీయంగావున్న అభివృద్ధి నిరోధకశక్తులు, అసత్యాలతో పీచానికి ఒడిగట్టారు. సోవియటు ప్రతిష్టను అది కారాన్ని కించపరచాలని ఈ అబద్ధాలు మోసాలూ సాగిస్తున్నారు.

"యుద్ధోన్మాదులయిన వీరు - పూర్వపు యుద్ధోన్మాదులలాగానే - అంతర్జాతీయ సఖ్యతను భంగపరచ జూస్తున్నారు. వివిధ దేశాలమధ్య తగాదాలు రావాలని చూస్తున్నారు."

స్వీడెనులో తుపాకిగుండ్ల విషయం వ్రాస్తూ "న్యూటైమ్సు" ఇలా అంది. "సోవియటుపై అనుమానమూ, అపనమ్మకం కల్గించడానికే ఈ ప్రచారం చేయబడింది."

జర్మనుయువకులను ఎత్తుకుపోతున్నారనే మరొక కథ. బ్రిటిషువాళ్ళ లైసెన్సు పొందిన పత్రికయే ఈప్రచారం చేసిందని న్యూటైమ్సు వ్రాసింది.

"ఈ కథ నిజంకాదని ఋజువుచేయబడింది. కాని, ఇది కుళ్ళిపోయిన కోడిగ్రుడ్డులా వాతావరణాన్ని దుర్గంధమయం చేసింది. సోవియటు అధీనజర్మనీలోఎన్నికలు జరుగుతాయనగా ఈ కథ ప్రచారం చేయబడింది."

మూడవది సోవియటు అఫ్ఘన్‌సరిహద్దు ఒడంబడిక విషయమై. సోవియటు, అఫ్గనిస్తాన్‌లోకి చొచ్చుకుపోతున్నదని ఒక నింద వేశారు. వాస్తవంగా అమెరికా, అఫ్ఘనిస్తాన్ నుండి గొర్రె ఉన్ని ఎగుమతి చేసుకొంటూ వుంది. ఈ విషయాన్ని కప్పిపుచ్చడానికే, సోవియటుపై ఆరోపణ చేయబడింది" అని న్యూటైమ్సు వ్రాసింది.

వజీరిస్తాన్ గ్రామాలపై బాంబుల వర్షం

సరిహద్దుగాంధీ ఖండన

బ్రిటిషు పాలకవర్గ కపటనాటకం

పెషావర్, సెప్టెంబరు 8

సరిహద్దుగాంధీ, ఖాన్ అబ్దుల్ గఫూర్‌ఖాన్ యీ క్రింది ప్రకటన గావిస్తున్నారు:

"వజీరిస్తాన్ గ్రామాలమీద విమానాలు బాంబులవర్షం కురిపిస్తున్నాయనే హృదయ విదారకమైనవార్త ఇప్పుడే నాకందింది. ఇన్నాళ్ళనుంచీ ఈవార్తను ఎందుకు రహస్యంగా ఉంచారో తెలుసుకోవడం కష్టంకాదు. ఒకవైపు భారతీయులస్నేహం కొరకు చేతులు చాచి, కేంద్రంలో జాతీయ ప్రభుత్వం ఏర్పరచడం; మరొకవైపు అజాతీయ ప్రభుత్వానికి అడ్డంకులు కలిగించే పనులన్నీ చేయడం! వెంటనే అధికారులు తమ పాత పద్ధతులను విడనాడి, మంచి దృక్పథం అలవరచుకోవడం అవసరం.

"నేను ఖుదై ఖిద్మత్‌గార్‌ని (దేవుని సేవకుణ్ణి) మానవప్రేమ, శాంతి నాఆశయాలు. అయినా, శాంతి భద్రతల రక్షణకు చర్యలు తీసుకోవాలని నేనూ అంగీకరిస్తాను. శాంతి భద్రతలకు భంగం కలిగించేవారిని శిక్షించితీరాలి. కాని, ప్రజలపై ఇష్టంవచ్చినట్లు హత్యలు చేయడం ఎన్నటికీ అంగీకరించను"

ఢిల్లీ అధికారవర్గాలు, కొద్దిమంది వజీరిస్తాన్ నేరస్థుల్ని శిక్షించడానికే బాంబులు వేశారని అ॥ ప్రె॥ విలేఖరిద్వారా తెలియజేస్తున్నారు. ముందుగా ప్రజలకు వార్నింగు యిచ్చిన తర్వాతే, దాడులు చేశారట. విచ్చలవిడిగా బాంబులు ఉపయోగించలేదట. ఇంతవరకు ఇద్దరు మాత్రమే చనిపోయారట.



ప్రభుత్వమే పోలీసు -
- పోలీసే ప్రభుత్వం

(ఎసెంబ్లీలో ప్రకాశంగారి ఉపన్యాసం)





★

గుంటూరు పార్టీ నాయకులు
కా॥ ప్రేవ్స
కట్టయ్య, సుబ్బారావుగార్లను
హైకోర్టు, జామీనుమీద
విడుదలచేసింది. విడుదలై
వచ్చినప్పుడు
వెల్లటూరు గ్రామ ప్రజలు
వారికి అఖండ స్వాగతమిచ్చి
ఊరేగించారు.

★

★

Edited, Printed & Published by Katragadda Rajagopalrao at the Prajasakti Press, Mogalrajapuram, Bezwada. Consulting Editor : M. Chandrasekhar Rao.

★

END OF ISSUE